నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015
11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఐదు రాష్ట్రాలు, యుటిలకు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలు

ఏకగ్రీవ వార్డుల్లో మళ్లీ ఎన్నికలు పెట్టాలి

గాంధీ రాముడని... బిజెపి ప్రచారానికి వాడుకుంటోంది 05

సంపుటి 28, సంచిక: 194 | సోమవారం | 05-01-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



‘తెలంగాణ చరిత్ర మూలాలు’

## ఓ దిక్సూచి

‘తెలంగాణ చరిత్ర మూలాలు’తో తెలుగు రాష్ట్రాల చరిత్ర, భాష, సంస్కృతి కొత్త మలుపులు తిరుగబోతున్నాయని పుస్తకావిష్కరణలో పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చరిత్ర అంటేనే కూర్పులతో కూడిందన్నారు. దేశంలో విజేతలు చరిత్రను రాసుకున్న ఆనవాయితీ కొనసాగడంతో అసలు చరిత్ర ఏమిటనేది నిత్య సత్యశోధనగా కొనసాగుతుందని తెలిపారు. 03



సిట్ ఎదుట ఎమ్మెల్సీ

## నవీన్‌రావు

సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావు సిట్ ఎదుట హాజరయ్యాడు. తన వెనుక ఎవరున్నారు? ఎవరితో చేయి కలిపారు? వంటి ప్రశ్నలు అధికారులు సంధించినట్లు సమాచారం. 03

వెనిజులాను

# మేమే పాలిస్తాం



ట్రంప్ దురహంకార ప్రకటన సామ్రాజ్యవాద నిజస్వరూపం బట్టబయలు

**ఫ్లోరిడా :** వెనిజులాలో చమురు నిక్షేపాలు అమెరికా దళాల అధీనంలో ఉంటాయని, సలహాదారుల ద్వారా తామే వెనిజులాను పరిపాలిస్తామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దురహంకార ప్రకటన చేశారు. తన సామ్రాజ్యవాద నిజస్వరూపం బయటపెట్టారు. వెనిజులాలో సురక్షితంగా రాజకీయాధికార పరివర్త జరిగే వరకూ అమెరికా దళాలు వెనిజులాలోనే ఉంటాయని, వెనిజులా చమురు రంగాన్ని పునర్నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఫ్లోరిడాలోని సొంత మార్ ఎ లాగో ఎస్టేట్‌లో పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. 2003లో ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చివేసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత 22 సంవత్సరాలకు మళ్ళీ ట్రంప్ సారథ్యంలో అనేక నెలలు రహస్య ప్రణాళిక ద్వారా లాటిన్ అమెరికా దేశ ప్రభుత్వాన్ని ఆ దేశ దళం కూల్చివేసింది. ట్రంప్ పక్కా ప్రణాళికతో రాత్రికి రాత్రే మదురోను దేశం దాటించి అంతర్జాతీయ నేరస్థుడుగా మార్చారు. “వెనిజులా చమురు మాది, దానిని మేం సంరక్షిస్తాం, వాటిపై ఆంక్షలు కొనసాగిస్తాం, ఈ చమురును ఇతర దేశాలకు అమెరికా ప్రభుత్వమే విక్రయిస్తుంది, అక్కడ చమురు మౌలిక వసతులను పునరుద్ధరిస్తాం’’ అని ట్రంప్ తన ముందస్తు భవిష్యత్ వలసవాద ప్రణాళికను బహిర్గతం చేశారు. ఇరవైఏళ్ళ క్రితం హ్యూగో ఛావెజ్ వెనిజులా అధ్యక్షుడుగా ఉండగా అమెరికా చమురు నిక్షేపాలను జాతీయం చేసి ఆ దేశ ప్రైవేటు చమురు కంపెనీలను దేశం నుండి వెళ్ళగొట్టారు. ఇప్పుడు కమ్యూనిస్టు పాలకులపై డ్రగ్స్ ఆరోపణలు చేయడం ద్వారా తిరిగి ట్రంప్ ఆ చమురు నిక్షేపాలను తన అధీనంలోకి తరువాయి 2లో

వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు

## డెల్సీ రోడ్రిగ్జ



- బాధ్యతలు చేపట్టాలని కోరిన ఆ దేశ సుప్రీంకోర్టు
- మదురో విడుదలకు రోడ్రిగ్జ డిమాండ్
- అధ్యక్షుడిని బందీగా అమెరికాకు తరలించడంతో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు

**కారకస్:** వెనిజులాలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితులనుండి తాత్కాలిక ఉపశమనం కలిగించేందుకు ఆ దేశ సుప్రీంకోర్టు తక్షణ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత దేశ ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ (56)ను తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని సుప్రీం కోర్టు కోరింది. ఐతే వెనిజులా ప్రభుత్వ టీవీ ఆమె ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఇంకా ప్రసారం చేయలేదు. అధ్యక్షుడు నికొలస్ మదురోతోపాటు ఫస్ట్‌లేడీ సిలియా ఫ్లోరెస్‌ను బ్రూక్లిన్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించక ముందునుండీ రోడ్రిగ్జ దేశంలో పరిస్థితులు చక్కదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని, పరిస్థితులన్నీ తరువాయి 2లో



ట్రంప్ చర్యకు ప్రపంచ నేతల దిగ్భ్రాంతి

నేడు భద్రతామండలి సమావేశం

చేతికి సంకెళ్ళు వేసి..

బ్రూక్లిన్ నిర్బంధ కేంద్రానికి మదురో తరలింపు 02

## నిశితంగా పరిశీలిస్తున్నాం

- భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి
- అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను యుఎస్ బంధించడంపై భారత్ తీవ్ర ఆందోళన

**న్యూఢిల్లీ :** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను ఒక సైనిక చర్యలో యునైటెడ్ స్టేట్స్ బంధించడంపై ఆదివారం భారత దేశం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. చమురు సంపన్న దేశమైన వెనిజులాలో జరుగుతున్న పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలియజేసింది. వెనిజులా రాజధాని కారకాస్‌లో అమెరికా తీసుకున్న అనూహ్యచర్యకు శనివారం తెల్లవారుజామున తన మొదటి స్పందనగా న్యూఢిల్లీ ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి సంభాషణ ద్వారా పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తరువాయి 2లో

‘దేశవ్యాప్త’ నిరసనలకు

## వామపక్షాలు పిలుపు

- అమెరికా చర్య యుఎన్ చార్టర్‌ను ఉల్లంఘించి సార్వభౌమదేశంపై జరిపిన దాడిగా తీవ్ర ఖండన

**న్యూఢిల్లీ :** వెనిజులాపై అమెరికా దురాక్రమణను, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్ కిడ్నాప్‌ను 5 వామపక్షపార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించి సార్వభౌమదేశంపై జరిగిన దాడిగా ఆరోపించాయి. ఈ మేరకు ఆదివారంనాడు ఐదు వామపక్ష పార్టీలకు చెందిన అగ్రనాయకులు డి.రాజా (సిపిఐ ప్రధానకార్యదర్శి),ఎం.ఎ.బేబి (సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ(ఎంఎల్)ఎల్, మనోజ్ భట్టాచార్య (ఆర్‌ఎస్‌పి ప్రధానకార్యదర్శి), జి.దేవరాజన్ ( ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధానకార్యదర్శి)లు ఇక్కడొక సంయుక్త తరువాయి 2లో

పోలవరం నల్లమల్ల సాగర్‌ను అడ్డుకునేందుకు

## సమర్థంగా వాదించండి

న్యాయనిపుణులకు సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచన

- సుప్రీంకోర్టులో నేడు రిట్ పిటిషన్‌పై విచారణ
- సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ ప్రత్యేక సమావేశం
- ప్రాజెక్టులకు సంబంధించి అవసరమైన అన్ని ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

గోదావరి నదిపైన ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, రిట్ పిటిషన్‌పైన సోమవారం సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో తరువాయి 2లో






## కదం తొక్కిన కమ్యూనిస్టులు

- సర్కస్ గ్రౌండ్ నుంచి రెవెన్యూ గార్డెన్ వరకు వేలాదిమంది పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ
- స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిది : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

కరీంనగర్‌లో అంబరాన్నంటిన సిపిఐ వందేళ్ల సంబరాలు

ప్రజపక్షం/కరీంనగర్

భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్థానంలో ప్రజాపోరాటాలు, ఉద్యమాలు, నిర్భంధాలు త్యాగాలతో కూడిన చరిత్ర అని, ప్రజల పక్షాన నిలబడి కొట్లాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ శతవసంతాల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ, బహిరంగ సభకు తరువాయి 12లో

ప్రపంచ పోలీసుగా


## ట్రంప్ వ్యవహారం

- ప్రజాస్వామ్య దేశాలపై విదేశీ శక్తులకు దాడిచేసే హక్కు లేదు
- వెనిజులాపై దాడి భారతదేశానికి నష్టం
- కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



ప్రజాపక్షం/ ఖమ్మం

సంపద కోసమే అమెరికా వెనిజులాపై దాడి చేసిందని, ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై ట్రంప్ దాడి చేయటాన్ని యావత్ ప్రజలు ఖండించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ కోరారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు పసలేనివని వెనిజులాలోని ఆయిల్ సంపదను తమ వశం చేసుకునేందుకే ట్రంప్ వెనిజులా అధ్యక్షున్ని, ఆయన భార్యను బందీలుగా చేశారన్నారు. ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ వెనిజులాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ఉందని చర్చించే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా ట్రంప్ ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గతంలో అణు ఆయుధాల పేరు చెప్పి ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్‌ను తరువాయి 12లో




జిహెచ్‌ఎంసి విభజన

## శరవేగం

మూడు కార్పొరేషన్‌లుగా మహానగరపాలక సంస్థ !

- అధికారులు, సిబ్బంది విభజన ప్రక్రియ వేగవంతం
- ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ముగిసేలోపు విభజన పూర్తి
- జిహెచ్‌ఎంసితో పాటు కొత్తగా మల్కాజిగిరి, సైబరాబాద్
- కొత్త కార్పొరేషన్‌లకు ఇద్దరు అదనపు కమిషనర్లు..
- అధికారులు, సిబ్బంది కేటాయింపు
- సర్కార్ నుంచి గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అమల్లోకి మూడు కార్పొరేషన్‌లు

ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) మూడు మహానగర పాలక సంస్థలుగా విభజించే దిశగా ప్రక్రియ వేగం పుంజుకుంది. అధికారికంగా మూడు కార్పొరేషన్లుగా ప్రకటించకపోయినా, ఆ దిశగా అధికారులు, సిబ్బంది విభజన ప్రక్రియను ఉన్నతాధికారులు పట్టాలెక్కించారు. వచ్చేనెల 10వ తేదీ వరకు ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ఉండటంతో అప్పటిలోపు సిబ్బంది, ఇతరాత్ర విభజన ప్రక్రియను పూర్తి చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం నుండి అందడంతో అధికార యంత్రాంగం అందుకు సంబంధించిన చర్యలను వేగవంతం చేసింది. అధికారులు, సిబ్బంది, తరువాయి 2లో

ఇండోర్‌లో తాగునీరు కలుషితం..

## ‘వ్యవస్థ’ సృష్టించిన విపత్తు

- ప్రముఖ జల సంరక్షకుడు రాజేంద్ర సింగ్ వెల్లడి
- ఈ విషాదానికి లోతుగా పాతుకుపోయిన అవినీతే కారణమని ఆరోపణ

**ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత తాగునీటి కారణంగా పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ప్రముఖ జల సంరక్షకుడు రాజేంద్ర సింగ్ ‘వ్యవస్థ సృష్టించిన విపత్తు’గా అభివర్ణించారు. ఈ విషాదానికి లోతుగా పాతుకుపోయిన అవినీతే కారణమని ఆయన ఆరోపించారు. ‘భారతదేశపు జలమానవుడు’గా ప్రసిద్ధి చెందిన మేగసెసే అవార్డు గ్రహీత, భారతదేశంలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలకడగా ర్యాంక్ పొందుతున్న ఇండోర్‌లో ఇటువంటి సంక్షోభం తలెత్తడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంలో ఇటువంటి విషాదం జరిగితే, ఇతర నగరాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థల పరిస్థితి ఎంత తీవ్రంగా తరువాయి 12లో

మేడారం జాతర పనుల్లో

## అలసత్వమేలా?

- అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- పనులు పూర్తిచేయకపోవడానికి కారణాలేంటని నిలదీత
- 12వ తేదీకల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం
- లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక
- 18న సిఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని వెల్లడి



ప్రజాపక్షం/ములుగు

మేడారం జాతర ఏర్పాట్లలో నెమ్మదితనం, నిర్లక్ష్యం కనిపిస్తున్న నేపథ్యంలో మంత్రి సీతక్క, ఎంఎల్‌ఏ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, శాఖాధికారులు పనులపై సరైన దృష్టి పెట్టకపోవడాన్ని మంత్రి తీవ్రంగా తప్పుపట్టారు. ‘పనులు పూర్తి చేయకుండా కారణాలు చెప్పడం మానేయండి, ఎవరు కాంట్రాక్టర్లు? ఎవరు బాధ్యత వహిస్తారు? ఎప్పుడు పూర్తి చేస్తారు చెప్పండి!’ మంత్రి ఒక్కొక్కరినీ నిలదీశారు. 12వ తేదీలోపు అన్ని ప్రధాన పనులు పూర్తి కావాలని, లేకపోతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు ఆలస్యానికి బాధ్యులైన వారిపై తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## మయన్మార్ జైళ్ళనుండి 6,134 మంది విడుదల

**నే పైతా :** మయన్మార్ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా 6,134 మంది ఖైదీలను జుంటా సైనిక ప్రభుత్వం జైళ్లనుండి విడుదల చేసింది. వీరితోపాటు మరో 52 మంది విదేశీ ఖైదీలు కూడా త్వరలో విడుదలవుతారు. యాంగాన్‌లోని ఇన్‌సెన్ జైలు నుండి దాదాపు 12కు పైగా బస్సుల్లో ఖైదీలు కేరింతలు కొడుతూ బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. కుటుంబ సభ్యులు వారికోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూశారు. విడుదలైన ఖైదీల పేర్లు వరుసగా చదివారు. ఆ పేర్లలో తమ ప్రియతములు ఉన్నారో?లేదో? అని బంధువులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూశారు.బంధువులు తమ ప్రియతములకోసం కన్నీళ్లతో ఎదురుచూశారు. యూఖర్ టన్ అనే 35 ఏళ్ళ వయసుగల వయోజనుడు కన్నీళ్ళు పెట్టుకుంటూ ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి తాను తన కుటుంబాన్ని కలుసుకున్నాన్నారు. మయన్మార్ దేశం బ్రిటిష్ పాలకుల నుండి స్వాతంత్ర్యంపొందిన జనవరి నాలుగోతేదీ నాటికి 78 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సైనిక ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఖైదీలను విడుదల చేసింది.

# ట్రంప్ చర్యకు ప్రపంచ నేతల దిగ్భ్రాంతి

### నేడు భద్రతామండలి సమావేశం



**న్యూయార్క్:** వెనిజులా దేశాధ్యక్షుడు నికోలస్ మదురో పడక గదిలోకి ప్రవేశించి భార్యాభర్తలను నిర్బంధించి సంకెళ్లువేసి యుద్ధనౌకలో న్యూయార్క్‌కు తరలించిన అమెరికా బందిపోటు చర్యను ప్రపంచదేశాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తీవ్ర నేరంగా ఖండించారు. న్యూయార్క్ సిటీ మేయర్‌గా ఈనెల ఒకటో తేదీన బాధ్యతలు తీసుకున్న జోహ్రాన్ మమ్దానీ, ఎన్నికల్లో ట్రంప్ ప్రత్యర్థి కమలా హారిస్ సహా అమెరికాలో అనేకమంది ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. కనెక్టికట్ ప్రజా ప్రతినిధి డెమోక్రాట్ జిమ్ హిమ్స్ మాట్లాడుతూ, ట్రంప్ తన చర్యలను సర్దించుకోవడానికి వీలైన సాక్ష్యాలు ఏమీ కనిపించడంలేదని అన్నారు. వెనిజులా తీరంలో డ్రగ్స్ పడవలపై దాడులను సమర్థించలేమన్నారు. ఈ సైనిక చర్యకు కాంగ్రెస్ ఆమోదం లేదన్నారు. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ దియాజ్ కేన్ దీనిని నేరపూరిత చర్యగా పేర్కొన్నారు. ట్రంప్ మిత్రుడు, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే ఒక సందేశంలో స్వేచ్ఛ వర్ధిల్లాలి అని పేర్కొన్నారు. చైనా సహా అనేక దేశాలు ట్రంప్ చర్యను తీవ్రంగా ఖండించాయి. శాంతి–ప్రజాస్వామ్య జపం చేసే అమెరికా పరాయిదేశంపై అసత్య ఆరోపణలు చేసి అమెరికా మరోసారి తన నైజాన్ని చాటుకుందని రాజకీయ విశ్లేషకులు నిశిత విమర్శలు చేశారు. ట్రంప్‌పై విస్తారంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తదితరులు ట్రంప్ చర్యను సమర్థించారు. తాను ఈ దాడులపై వ్యాఖ్యానించలేనంటూ స్టార్‌మర్ తప్పించుకున్నారు. ఆ తర్వాత ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ, మదురో చాలా తెలివైన నాయకుడనీ, ఐతే ఆయన పరిపాలన ముగిసిందని తాను కన్నీళ్ళు పెట్టుకోలేమన్నారు. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలపై అమెరికాతో తాము చర్చిస్తామన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ఎంతమాత్రం సహించరానివిధంగా ట్రంప్ హద్దులు దాటారని విమర్శించారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ చర్య లాటిన్ అమెరికా దేశాల సార్వభౌమాధికారంపై దాడిగా పేర్కొన్నారు. మరోవైపు వెనిజులా సమస్యపై భద్రతా మండలి సోమవారం ఉదయం సమావేశం నిర్వహిస్తోంది. అనేకమంది న్యాయ నిపుణులు ట్రంప్ చర్యల్లో న్యాయబద్ధతను ప్రశ్నించారు. తక్షణ చర్యలకు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా ఈ దాడి జరిగింది. ఈ చర్యకు కాంగ్రెస్ ఇంకా అనుమతి ఇవ్వాల్సి ఉంది. యూరోపియన్ యూనియన్ ఉన్నతస్థాయి దౌత్యవేత్త కాజా కల్లాస్ స్పందిస్తూ, మదురో తన చట్టబద్ధతను కోల్పోయారన్నారు.

**మదురో తక్షణ విడుదలకు చైనా డిమాండ్**

మదురోను, ఆయన భార్యను తక్షణం విడుదల చేయాలని చైనా డిమాండ్ చేసింది. చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరింది. చైనా విదేశీ మంత్రిత్వశాఖ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మదురో, ఆయన భార్యకు వ్యక్తిగతంగా పూర్తి భద్రత సమకూర్చాలని, వారిని వెంటనే విడుదల చేయాలని కోరింది. అమెరికా అంతర్జాతీయ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించిందని విమర్శించింది. అంతర్జాతీయ సంబంధాల మౌలిక సూత్రాలను అమెరికా ఉల్లంఘించిందని విమర్శించింది. ''చైనా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తోంది, అంతర్జాతీయ చట్టాలకు అమెరికా కట్టుబడి ఉండాల్సిందే, దీనిని సహించలేం, దేశాల సార్వభౌమాధికారాలను, భద్రతను ఉల్లంఘించడం ఇక ఆపాలి'' అని ప్రకటనలో కోరింది. రష్యా కూడా ఇంతకుముందే ట్రంప్ చర్యను ఖండించింది.

# చేతికి సంకెళ్ళు వేసి..

### బ్రూక్లిన్ నిర్బంధ కేంద్రానికి మదురో తరలింపు

**న్యూయార్క్ :** ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన దుర్మార్గపూరిత ఆటవిక చర్యను ట్రంప్ ఎట్టకేలకు పూర్తిచేశారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి పెంటగాన్ డెల్టా దళం అరెస్టు చేసిన వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను ఆదివారం తెల్లవారుముందే రాజధాని కారకస్ నుండి న్యూయార్క్‌కు తరలించారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో మన్‌హాటన్‌కు తీసుకువెళ్ళారు. అక్కడే అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆయనను తమ కార్యాలయానికి తరలించింది. బ్రూక్లిన్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించారు.న్యూయార్క్‌లో విమానం దిగిన తర్వాత మదురో ఒంటికాలితో కుంటుతూ నడవడం కనిపించింది. ఆయన చేతికి సంకెళ్ళు ఉన్నాయి. కారకస్‌లో వారి నివాసం నుండి బలవంతంగా హెలికాప్టర్‌లో తీసుకువెళ్ళి అమెరికా యుద్ధనౌక ఎక్కించారు. ఆగమేఘాలపై ఆ యుద్ధనౌక భారత కాలమానం ప్రకారం శనివారం అర్థరాత్రి 12 గంటల నాటికి న్యూయార్క్‌కు చేరుకుంది. అక్కడి నుండి విమానంలో మదురోను తరలించారు. బ్రూక్లిన్ విమానాశ్రయంలో అమెరికా డెల్టా ఫోర్స్ సైనికులు మదురోను అటూ ఇటూ కాపలాగా ఉండి బయటకు తీసుకువస్తున్న వీడియో దృశ్యాలను, ఫొటోలను అంతర్జాతీయ మీడియా ప్రదర్శించింది. విమానం దిగిన తర్వాత ఆయన చేతులకు సంకెళ్లతోనే మదురోను నడిపించి తీసుకువెళ్ళారు. ఆయనపై ప్రధానంగా 2020లో నమోదైన పాత నార్కో టెర్రరిజం కేసుతోపాటు కొకైన్ ఎగుమతి కేసు, ప్రమాదకర, విధ్వంసకర మారణాయుధాలు పోగుచేసి ఉంచుకోవడం వంటి అనేక కేసులపై న్యూయార్క్ కోర్టులో పూర్తిస్థాయి విచారణ జరిపి మదురోకు శిక్ష విధిస్తామని అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ చెప్పారు.1999 నుండి వెనిజులాలో యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా అధికారంలో ఉంది. తొలుత హ్యూగో ఛావెజ్ పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేశారు. తర్వాత సోషలిస్టు విప్లవాన్ని అమలు చేశారు. 2013లో ఛావెజ్ మరణానంతరం నికొలస్ మదురో అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నారు. 2018లో ఆయన తిరిగి ఎన్నికయ్యారు.

# నిశితంగా పరిశీలిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చింది. వెనిజులా దేశ ప్రజల శ్రేయస్సుకు భారతదేశం తన మద్దతును పునరుద్ఘాటించింది. యునైటెడ్ స్టేట్స్ మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఆరోపణలను వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, అతడి భార్య లేడీ సిలియా ఫ్లోర్స్‌పై న్యూయార్క్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఆరోపణలను మోపింది. అయితే యునైటెడ్‌స్టేట్స్ చర్యను ఖండిస్తూ వెనిజులా దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి ంది. 'వెనిజులాలో ఇటీవలి పరిణామాలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. మారుతున్న పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాం. వెనిజులా ప్రజల శ్రేయస్సు, భద్రతకు భారతదేశం తన మద్దతును పునరుద్ఘాటిస్తుంది' అని ఎంఇఎ తెలిపింది. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని నిర్ధారించడం ద్వారా, చర్చలద్వారా శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సంబంధీకులందరికీ న్యూఢిల్లీ పిలుపునిచ్చింది. మాదకద్రవ్యాల అక్రమరవాణాకు మదురో పాల్పడ్డాడని గట్టిగా ఆరోపించిన తర్వాత అమెరికా కారకాస్‌పై సైనిక దాడి చేసింది. అయితే వెనిజులా దేశాధినేత ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం వెనిజులాలోని భారతీయ సమాజ సభ్యులతో సంప్రదింపులు జరుపుతోందని, వారికి సాధ్యమైనంత మేరకు అన్ని రకాల సహాయాన్ని భారతదేశం అందిస్తూనే ఉందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇక్కడ విడుదల చేసిన తన సంక్షిప్త ప్రకటనలో తెలియజేసింది. వెనెజువెలాకు అనవసరమైన ప్రయాణాల ను నివారించుకోవాలని శనివారం రాత్రి భారతదేశం తన పౌరులకు సూచించింది.

# వామపక్షాలు పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనలో అమెరికా చర్యను తీవ్రంగా ఖండించారు. వామపక్షపార్టీలైన తాము అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా, లాటిన్ అమెరికా ప్రజలకు సంఘీభావంగా ఐదు వామపక్ష పార్టీల అగ్రనాయకులు దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపును ఇచ్చారు. వెనిజులా నుండి వస్తున్న నివేదికల ప్రకారం...అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా, వారి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో సమీకరించబడుతున్నారని సూచిస్తున్నాయన్నారు. అమెరికాదురాక్రమణ, దుష్ట చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు 5 వామపక్షపార్టీల తరపున హృదయపూర్వక మద్దతు, సంఘీభావాన్ని తెలియజేస్తున్నామని సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా సహా ఐదుగురు అగ్రనాయకులు తెలియజేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రసంగంలో వెనిజులా చమురు నిల్వలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారని, ఈ దురాక్రమణ వెనక ఉన్న నిజమైన ఉద్దేశాలను బయటపెట్టారని, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఒక అడుగు ముందుకేసి క్యూబా, మెక్సికో వారి తదుపరి లక్ష్యం అవుతాయని హెచ్చరించారని వెల్లడించారు. యునైటెడ్ స్టేట్స్ జాతీయ భద్రతా వ్యూహం2025 విడుదలైన కొన్ని రోజుల తర్వాత వస్తున్న ఈ ప్రకటనలు సైనిక దాడులు చేయడం ద్వారానైనా అమెరికా సామ్రాజ్యవాదం యావత్ ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని విధించడానికి ప్రయత్నిస్తుందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. మొత్తం పశ్చిమ అర్ధగోళాన్ని తన పాలనా ప్రాంగణంగా భావిస్తున అమెరికా డొనాల్ట్ ట్రంప్ తన హక్కులను అమలుచేసే అప్రతిష్ఠపాలైన మన్రో సిద్ధాంతం సంబంధిత డొనాల్డ్ ట్రంప్ పరిణామాన్ని అమెరికా విధించాలనుకుంటోందని 5 వామపక్ష పార్టీల అగ్రనేతలు స్పష్టంచేశారు. లాటిన్ అమెరికా ప్రజలకు సంఘీభావంగా 5 వామపక్ష పార్టీలు ఇచ్చిన దేశవ్యాప్త నిరసనల పిలుపులో మనదేశంలోని శాంతి కాముకులు సామ్రాజ్యవాద వ్యతిరేకులు అందరూ పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి ఈ నిరసనలో చురుకుగా పాల్గొనాలని డి.రాజా, ఎం.ఎ.బేబి, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్ పిలుపునిచ్చారు. అమెరికా దురాక్రమణను ఖండిస్తున్న ప్రపంచవ్యాప్త దేశాల గొంతుకల్లో భారత ప్రభుత్వం కూడా చేరాలని, వెనిజులాకు దృఢంగా మద్దతు ఇవ్వాలని వామపక్ష అగ్రనాయకులు ఐదుగురు సంయుక్తం కోరారు.

# సమర్థంగా వాదించండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ముంబయిలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వితో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్థమైన వాదనలు వినిపించాలని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయ నిపుణులకు సూచించారు. అవసరమైన అన్నిఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులను వారు అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు లింక్ చేసేందుకు ఎపి ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను నిలిపివేయాలని కోరుతూ ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. తక్షణమే ఈ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆపేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయాలని, ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించింది. మొదటిగా ఆమోదించిన మేరకే పోలవరం ప్రాజెక్టు పనుల స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్ట్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫిజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలిండటం సమంజసం కాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. అందుకు సంబంధించి కేంద్ర జల సంఘం, కేంద్ర జల మంత్రిత్వ శాఖ, గోదావరి నీటి యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎపి ప్రభుత్వం డిపిఆర్ తయారీకి సిద్ధపడుతోందని, ఈ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ పిటిషన్‌లో ప్రస్తావించింది.

# మేమే పాలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చుకున్నారు. అమెరికా కంపెనీలు వెనిజులా వెళతాయి,అక్కడే వ్యాపారం చేస్తాయి, చమురును వెలికితీయడం, ఉత్పత్తి చేయడంతోపాలు అమ్మకాలు చేస్తాం, వివిధ దేశాలకు వెనిజులా చమురు విక్రయిస్తాం, ఆ సొమ్మును వెనిజులాకోసం ఖర్చుపెడతాం, ఆ దేశాన్ని తీర్చిదిద్దుతాం, 'మేక్ వెనిజులా గ్రేట్ ఎగైన్'గా చేస్తాం, అమెరికా పాలనలో వెనిజులా ప్రజలు చాలా హ్యాపీగా ఉండబోతున్నారు, వారి సమస్యలన్నీ తీరిపోతాయి'' అన్నారు. ఐతే ఎంత కాలం పాలన అమెరికా చెప్పుచేతల్లో ఉంటుందో ఖండితంగా చెప్పలేదు. ''రాజకీయ పరివర్తన జరిగే వరకూ వెనిజులాను తామే నడిపిస్తామన్నారు. ''సురక్షితమైన, వివేకవంతమైన పరిపాలన చేయగల రాజకీయ పరివర్తన వచ్చేవరకూ వెనిజులా మా పాలనా బాధ్యతలు మేమే చూసుకుంటాం, అవసరమైతే చాలా పెద్ద దాడులు చేయడానికి కూడా అమెరికా సిద్ధంగా ఉంది'' అని స్పష్టం చేశారు. ఇన్నాళ్ళుగా వెనిజులా మాదక ద్రవ్యాలను అక్రమంగా అమెరికాలోకి రవాణా చేయడంవల్ల తమ దేశం నష్టపోయిందని, సగటును ఏటా డ్రగ్స్‌వల్ల 25,000 మరణిస్తున్నారని ఆరోపించారు.

**ఆపరేషన్ 'అబ్సల్యూట్ రిసాల్వ్' 150 విమానాలతో దాడి చేశాం**

నికొలస్ మదురో ఇంటిపై దాడిచేసి అరెస్టు చేసేందుకు తమ సైనిక జనరల్స్ కొన్ని నెలలుగా కష్టపడి పక్కా ప్రణాళిక రూపొందించారని ట్రంప్ చెప్పారు. ఈ ఆపరేషన్‌కు 'అబ్సల్యూట్ రిసాల్వ్'అని నామకరణం చేశారు. ఆ ప్రణాళిక మేరకు విజయవంతంగా మదురోను అరెస్టు చేసి న్యూయార్క్‌కు తరలించామని చెప్పారు. ఈ దాడికోసం 150 విమానాలను ఉపయోగించామని, కానీ ఒకే ఒక్క హెలికాప్టర్ ధ్వంసం కావడం మినహా అమెరికా డెల్టా దళానికి ఎలాంటి నష్టం కలగలేదని, తమ సైన్యం వైపు ఎవరికీ గాయాలు లేదా మరణాలు సంభవించలేదన్నారు. మదురో తన నివాసాన్ని దుర్భేధ్యమైన కోటలా తయారు చేసుకున్నారని, ఆ వివరాలన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి దాడి చేసి చాలా తక్కువ సమయంలో డెల్టా దళం ఆయన పడకగదిలోకి ప్రవేశించి వారిద్దరినీ బంధించి ఆపరేషన్ పూర్తిచేశామన్నారు. ఈ దాడి ప్రక్రియ ప్రారంభం నుండి మదురో దంపతులను బంధించి అమెరికా యుద్ధనౌకలోకి తరలించేవరకూ మొత్తంగా రెండు గంటల్లో ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్‌ను పూర్తిచేశామని చెప్పారు. భూతలం,గగనతలం, సముద్ర తలాలమీదుగా మూడు వైపుల నుండీ వెనిజులాను ముట్టడించామని, ఈ ఆపరేషన్ కోసం కారకస్ నగరాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకుని స్తంభింపజేశామన్నారు.

**అమెరికా జోక్యం ఎక్కడెక్కడంటే...**

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అనేక దశాబ్దాలుగా లాటిన్ అమెరికా దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలను కుప్పకూల్చివేస్తూ వచ్చింది. వాటి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నది. 1965లో వామపక్షాల సారథ్యంలో కొనసాగుతున్న డొమినికన్ రిపబ్లిక్‌లో జువాన్ బాష్ ప్రభుత్వాన్ని కూల్చివేసింది. అమెరికా అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డొమినికన్ రిపబ్లిక్ కూడా మరో క్యూబాగా మారి పక్కలో బల్లెంలా తయారవుతుందని అమెరికా భయపడింది. అంతకుముందు 1961–63 మధ్యకాలంలో ఈక్వెడార్‌లో జోక్యం చేసుకుంది. సైనిక కుట్రకు పాల్పడింది. దీంతో ఈక్వెడార్ క్యూబాకు దూరంగా జరిగి అమెరికాకు సన్నిహితమైంది. బొలీవియాలో కూడా 1964 నుండి 1970 వరకూ సిఐఎ మద్దతుతో ఎన్నికైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కుట్రలు చేసింది. 1960 నుండి 1973 వరకూ 13 ఏళ్ళలో ఉరుగ్వేలో వామపక్ష గ్రూపులను అమెరికా భద్రతా సంస్థలు, గూఢచారి వర్గాలు అణచివేశాయి. చిలీలో అధ్యక్షుడు సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని సిఐఎ అక్కడి ప్రతిపక్షం ద్వారా కుట్రచేసి కూల్చివేసింది. అర్జెంటైనాలో 1976లో సైనిక పాలకులకు అమెరికా మద్దతు ఇచ్చింది. ఎల్‌సాల్వడార్‌లో 1980లో అంతర్యుద్ధానికి మద్దతు ఇచ్చింది. 1980వ దశకంలో నికరాగువాలో శాండినిస్టా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుదారులకు మద్దతు ఇచ్చింది. 1983లో గ్రెనడాలో జోక్యం చేసుకుని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసి అమెరికా అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 1989లో పనామాలో పనామా కాలువపై ఆధిపత్యం సంపాదించేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కూల్చివేసింది.

## పశ్చిమార్థగోళంలో కొత్త 'డోన్రో సిద్ధాంతం'

పశ్చిమార్థగోళం (న్యూ వరల్డ్..ఉత్తర–దక్షిణ అమెరికాలు)లో అమెరికా అధికారానికి తిరుగులేదని, అమెరికా అధికారాన్ని ఇక మళ్ళీ ప్రశ్నించడానికి అవకాశం లేదని వెనిజులాపై దాడి నిరూపించిందని డోనాల్డ్ ట్రంప్ ఫ్లోరిడా పత్రికాగోష్ఠిలో అన్నారు. ఈ దాడి మన్రో సిద్ధాంతానికి దగ్గరగా ఉందన్నారు. ట్రంప్ దానిని డోన్రో సిద్ధాంతంగా మార్చారు. ట్రంప్ మాటలు, ఆయన సమాధానాల తీరు చూస్తే ఆయన వెనిజులా సార్వభౌమాధికారం గురించి, వెనిజులా ప్రజాస్వామ్య భవిష్యత్తు–అంతర్జాతీయ నిబంధనల గురించి ఏ మాత్రం పట్టింపు లేకుండా కేవలం చమురు సంపద గురించి మాత్రమే ఆం దోళన చెందుతున్నట్లు కనిపించిందని బిబిసి కరస్పాండెంట్ టామ్ బాటెమన్ వ్యాఖ్యానించారు. పశ్చిమార్థగోళంలో ఇప్పుడు జేమ్స్ మన్రో సిద్ధాంతం పో యింది. దాని బదులు 'డోన్రో సిద్ధాంతం' వచ్చింది! అదెలాగంటే, 1823 డిసెంబరు రెండో తేదీన అమెరికా ఐదో అధ్యక్షుడు జేమ్స్ మన్రో ఆ దేశ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, యూరప్ దేశాలకు స్పష్టమైన హెచ్చరిక చేశారు. వారు పశ్చిమార్థగోళంపై కన్ను వేయకూడదని, ఈ ప్రాంత సంరక్షణ, పెత్తనం, ఆధిపత్య బాధ్యతలన్నీ అమెరికావేననీ ప్రకటించారు. దీనినే అప్పటినుండీ మన్రో డాక్ట్రిన్‌గా పిలుస్తున్నారు. 19వ శతాబ్దంలో యూరోపియన్ శక్తుల ప్రభావం నుండి విముక్తి పొందడంకోసం 19వ శతాబ్దంలో అమెరికా మన్రో సిద్ధాంతాన్ని విదేశాంగ విధానంగా స్వీకరించింది. కానీ ఇప్పుడు ట్రంప్ ఈ మన్రో సిద్ధాంతాన్ని తన డోనాల్డ్ ట్రంప్ పేరుమీద ''డోన్రో'' సిద్ధాంతంగా మార్చారు. 1904లో యూరోపియన్ రుణ దాతలు లాటిన్ అమెరికా దేశాల ను బెదిరింపులకు గురిచేసినప్పుడు అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ మన్రో సిద్ధాంతాన్ని విస్తరించారు. తమ అధిపత్యం తెచ్చే యత్నం చేశారు. ఆ తర్వాత హైతీ, నికరాగువా, డొమినికన్ రిపబ్లిక్‌లలో అమెరికా ఈ సిద్ధాంతం పేరుతో జోక్యం చేసుకుంది.

# శరవేగం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాల కార్యకలాపాల విభజన ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వం నుండి తుది గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. తర్వాత పూర్తిస్థాయిలో స్వతంత్ర కార్పొరేషన్‌లుగా చట్టబద్ధత పొందుతాయి. హైదరాబాద్ నగరం 650 చ.కి.మీ నుండి 2,053 చ.కి.మీకి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీక్యూర్) ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన విషయం తెల్సిందే. అయితే ఈ ప్రాంతాన్ని మొత్తం మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇటీవల చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందిని మూడు కార్పొరేషన్‌లకు విభజన ప్రక్రియను చేపట్టారు. మూడు జోన్‌లకు ఒక అదనపు కమిషనర్ చొప్పున నియమించగా, ఆయా అధికారులకు జోన్‌ల పరిపాలన బాధ్యతలపై కమిషనర్ కర్ణన్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా పూర్తి స్పష్టత ఇచ్చారు. కేటాయించిన జోన్‌లలో పరిపాలనను చక్కదిద్దడం, జోనల్ కమిషనర్‌లతో సమన్వయంగా పనిచేయడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆయా జోన్‌లకు పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు అధికారులు, సిబ్బంది బదిలీలు చేపట్టారు.

**మూడు గ్రేటర్ కార్పొరేషన్ల ఏర్పాటుకు కసరత్తు**

ప్రస్తుతం జిహెచ్ఎంసిలో 12 జోన్లు, 60 సర్కిళ్లు ఉన్నాయి. పునర్వ్యవస్థీకరణ అనంతరం జిహెచ్ఎంసి పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ జోన్‌లకు పరిమితం కానుంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిసిఎంసి), మల్కాజిగిరి, ఎల్.బి. నగర్, ఉప్పల్ జోన్‌లతో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (జిఎంఎంసి) ఏర్పాటు కానున్నట్లు సమాచారం. జిసిఎంసికి అదనపు కమిషనర్ సృజనను, జిఎంఎంసికి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమించే అవకాశముందని మున్సిపల్ శాఖలో ప్రచారం జరుగుతోంది. పాలకమండలి పూర్తయిన అనంతరం దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.

**నిర్మాణ అనుమతులు అక్కడి నుంచే**

నూతన గ్రేటర్ కార్పొరేషన్‌ల పరిధిలో టౌన్ ప్లానింగ్ వ్యవహారాల నిర్వహణను డైరెక్టర్ హోదాలోని ఇద్దరు సీనియర్ అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ కర్ణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఆయా జోన్‌ల పరిధిలోని భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు సంబంధిత అధికారుల ద్వారానే కమిషనర్ అనుమతికి వెళ్లనున్నాయి. కె. శ్రీనివాస్ (చీఫ్ సిటీ ప్లానర్) : శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, చార్మినార్, ఖైరతా బాద్, సికింద్రాబాద్ పర్యవేక్షించనున్నారు. బి. వెంకన్న (డైరెక్టర్, టౌన్ ప్లానింగ్): శేరిలింగం పల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్. బి. ప్రదీప్ కుమార్ (డైరెక్టర్, టౌన్ ప్లానింగ్): మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ పర్యవేక్షిస్తారు.

**జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కీలక అధికారాలు**

జిహెచ్ఎంసి చట్టం1955లోని సెక్షన్ 119 ప్రకారం ఆస్తి పన్ను అంచనాలు, సవరణలు, మ్యుటేషన్‌లు, మినహాయింపులు వంటి సేవలకు సంబంధించిన అధికారాలను నిర్దిష్ట పరిమితులు, షరతులతో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వచ్చాయి.

**భారీ బదిలీలు – సిబ్బంది పునర్వ్యవస్థీకరణ**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా జిహెచ్ఎంసిలో భారీగా ఇంజనీర్ల బదిలీలు చేపట్టారు. ఎఈ, ఎఈఈ, డిఈ, డిఈఈలతో పాటు క్వాలిటీ కంట్రోల్ సెల్ ఇంజనీర్లను 12 జోన్‌లలో అవసరమైన ప్రాజెక్టులు, నిర్వహణ విభాగాల్లో నియమించారు. ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ (పరిపాలన)గా ఉన్న కె. వేణుగోపాల్‌ను మల్కాజిగిరి, ఎల్.బి.నగర్, ఉప్పల్ జోన్‌లకు జాయింట్ కమిషనర్ (అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్)గా బదిలీ చేశారు. గీతారాధికను కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లకు జాయింట్ కమిషనర్‌గా నియమించారు.

**20 శాతం ఖాళీల భర్తీకి చర్యలు**

విలీనంతో 300 డివిజన్ల పరిధిలోని నగరంలో సుమారు 20 శాతం సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగాల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 1,500 మంది ఉద్యోగులు అవసరమని అంచనా వేస్తూ, ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

**మూడు కార్పొరేషన్‌ల విభజన ఇలా..**

ప్రస్తుతం ఉన్న 12 జోన్‌లను మూడు ప్రధాన కార్పొరేషన్లుగా విభజన

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) :** శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ జోన్‌లు.

**గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిసిఎంసి) :** కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లు.

**గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (జిఎంఎంసి) :** మల్కాజిగిరి, ఎల్.బి.నగర్, ఉప్పల్ జోన్‌లు.

**అధికారుల నియామకం – అధికారాల బదిలీ**

అదనపు కమిషనర్లు సృజన (జిసిఎంసి), వినయ్ కృష్ణారెడ్డి (జిఎంఎంసి)లకు ఆయా ప్రాంతాల బాధ్యతలు అప్పగించారు.

**నిధులు, పరిపాలన :** జాయింట్ కమిషనర్లుగా కె. వేణుగోపాల్ (మల్కాజిగిరి), గీతారాధిక (కూకట్‌పల్లి)లను నియమించారు.

# అలసత్వమేలా?

(మొదటి పేజీ తరువాయి)

సస్పెన్షన్, రికవరీ సహా కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. విద్యుత్, ఆర్అండ్‌బి, ఐటిడిఏ సహా అన్ని శాఖల పనుల పురోగతిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతర అంటే చిన్న కార్యక్రమం కాదని, ఇది రాష్ట్ర గౌరవమన్నారు. 18వ తేదీ సిఎం పర్యటనకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్దంగా ఉండాలని, 15 నుండి డెకరేషన్ పనులు మొదలై జాతర కాలమంతా మెరిసేలా ఉండాలని స్పష్టం చేశారు. జాతర కాలంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా విద్యుత్, నీరు, శానిటేషన్ వంటి అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 4వేల మందితో శానిటేషన్ సిబ్బందిని రంగంలోకి దించాలని సూచించారు. మేడారం ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా జరిగే ఈ వేడుకలో ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కల్గకుండా అధికారులు పూర్తిగా అలర్ట్‌గా పనిచేయాలని మంత్రి హెచ్చరించారు.

# డెల్సీ రోడ్రిగ్జ్

(మొదటి పేజీ తరువాయి)

చక్కదిద్దుకుంటాయని, అంతిమ విజయం వెనిజులాదేనని ఆమె అన్నారు. అమెరికా చర్యలను ఆమె ఖండించారు. వెంటనే మదురోను, ఆయన భార్య ఫ్లోరెస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ చట్టాలను ట్రంప్ ఉల్లంఘించారని, దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించారని ఆమె అన్నారు. ఈ దేశానికి ఉన్నది ఒకే ఒక్క అధ్యక్షుడని, ఆయనే నికొలస్ మదురో అనీ ఆమె ప్రకటించారు. ఈ ప్రకటన చేసిన సమయంలో ఆమె చుట్టూ ఉన్నతస్థాయి వెనిజులా అధికారులు, సైనిక జనరల్స్ ఉన్నారు. ''వారు మాపై దాడి చేస్తే చేయవచ్చు, కానీ మమ్మల్ని విచ్ఛిన్నం చేయలేరు, విడదీయలేరు'' అని వెనిజులా రక్షణ మంత్రి జనరల్ వ్లాదిమిర్ పద్రినో లోపెజ్ అన్నారు. వెనిజులా హోంమంత్రి డియోస్‌దాడో కాబెల్లో మాట్లాడుతూ, ప్రజలు వీధుల్లోకి రావాలనీ, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని పిలుపు ఇచ్చారు. అదేసమయంలో ట్రంప్ కూడా మాట్లాడుతూ, వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలుగా ఆ దేశ న్యాయస్థానం నియమించిన రోడ్రిగ్జ్‌తో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సంభాషణలు చేస్తున్నారన్నారు. అమెరికా కోసం ఏదైనా చేయడానికి, అమెరికా అడిగిన ఏదైనా ఇవ్వడానికి ఆమె సంసిద్ధత వ్యక్తం చేశారని ట్రంప్ మార్ –ఎ–లాగో ఎస్టేట్‌లో పాత్రికేయులకు చెప్పారు. వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడోతో తాను మాట్లాడలేదని, పైగా ఆమెకు దేశంలో గౌరవంగానీ, అధ్యక్ష పదవి చేపట్టేందుకు తగిన మద్దతు లేదన్నారు. ఆమెకు 2025 నోబెల్ శాంతి బహుమతి ఇటీవలే లభించింది. కానీ వెనిజులా ఉపాధ్యక్షురాలి తీరు ట్రంప్ వ్యాఖ్యలకు భిన్నంగా ఉంది. ఆమె దేశానికి, మదురోకు విధేయత ప్రకటించారు. రోడ్రిగ్జ్ వెనిజులా ప్రభుత్వ టెలివిజన్ తెరపై కనిపించి తమ అధ్యక్షుడు ఎక్కడ ఉన్నారు? సజీవంగా ఉన్నారా?లేదా? అని ప్రశ్నించారు. ఈ దేశానికి నికొలస్ మదురో ఒక్కడే అధ్యక్షుడని ఆమె వ్యాఖ్యానించారు. 2018 నుండి ఆమె వెనిజులా ఉపాధ్యక్షురాలి పదవిలో ఉన్నారు. అంతకుముందు హ్యూగో ఛావెజ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా రోడ్రిగ్జ్ అనేక పదవులు నిర్వహించారు. సమాచారమంత్రిగా, విదేశాంగమంత్రిగా, రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షురాలుగా తొలుత ఆమె బాధ్యతలు నిర్వహించారు.ప్రస్తుతం దేశ ఉపాధ్యక్షురాలుగా, యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా జాతీయ నాయకురాలు హోదాలో ఉంటూ తాత్కాలికంగా దేశాధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. మానవ హక్కుల ఉల్లంఘన పేరుతో గతంలో రోడ్రిగ్జ్‌పై అమెరికా, యూరోపియన్ యూనియన్, కెనడా దేశాలు ఆంక్షలు విధించాయి. ప్రస్తుతం దేశాన్ని నడిపించగల సత్తా రోడ్రిగ్జ్‌కు మాత్రమే ఉంది. సైనిక అధికారులు అమెరికా రక్షణ దళం దాడుల నుండి కోలుకున్నారు. తిరిగి వారి విధుల్లో కొనసాగుతున్నారు. తక్షణం వెనిజులాను అదుపులోకి తీసుకుని అమెరికా నేరుగా పరిపాలించే సంకేతాలు కనిపించడం లేదు. ఈ దశలో రోడ్రిగ్జ్ తన ప్రతిభాపాటవాలు కనబరిచి దేశంలో శాంతి, సాధారణ పరిస్థితులను తీసుకురావాల్సి ఉంది.

**వెనిజులాలో నిరసన ప్రదర్శనలు: అమెరికా జెండాలు దగ్ధం**

అధ్యక్షుడు మదురోను బందీగా అమెరికాకు తరలించడంతో వెనిజులాలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. అల్లర్లు చెలరేగాయి. ప్రజలు గుంపులుగా చేరి అమెరికా పతాకాలను దగ్ధం చేశారు. రక్షణమంత్రి కాబెల్లో పిలుపు తో ప్రజలు ధైర్యంగా వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. కారకస్ మేయర్ కార్మెన్ మెలెన్‌డెజ్ కూడా సామాన్య ప్రజలమధ్యకు వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తక్షణం మదురో దంపతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ''మదురో మళ్ళీ వస్తారు, ప్రజలు తలెత్తి బతుకుతారు'' అని ఆయన నినాదాలు చేశారు. మదురో తిరిగి రావాలని ప్రజలు నినాదాలు చేశారు. ''మేం ఇక్కడే ఉన్నాం మదురో, నువ్వు తిరిగి రావాలి, నీకోసం ఎదురు చూస్తున్నాం, నువ్విక్కడ ఉంటే మేం ఉంటాం, నువ్వే మా నాయకుడివి'' అంటూ ప్రజలు నినాదాలు చేశారు. కారకస్ ఆ పరిసరాల్లో, అనేక రాష్ట్రాలలో యునైటెడ్ సోషలిస్ట్‌పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో ప్రదర్శనలు చెలరేగాయి. ప్రజలు శాంతిగా ఉండాలని మరోవైపు తాత్కాలిక ప్రభుత్వం విజ్ఞప్తులు చేస్తోంది. కానీ చాలా మంది ప్రజలు అమెరికా దాడులతో భీతావహులయ్యారు. ఇంకా వారంతా ఇళ్ళకే పరిమితమైపోయారు. దేశంలో 2.90 కోట్లమంది జనాభా ఉన్నారు. రేపు ఏం జరుగుతుంది? అనే ప్రశ్నార్థకాలమధ్య ప్రజలు ఉత్కంఠతో కాలం గడుపుతున్నారు. ట్రంప్ చర్య వెనిజులా ప్రజలకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల్లో తప్పేముంది?

కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ సిఎం కె.చంద్రశేఖరరావు తోలుతీస్తా అంటే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నీ నాలుక కోస్తా అన్నడంలో తప్పేముందని కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణా జలాలపై సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు సభలో పూర్తిగా వాస్తవాలు మాట్లాడరన్నారు. హరీష్‌రావు ప్రజెంటేషన్ పూర్తిగా బోగస్ అని ఆయన పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉంటె ఆంధ్రోళ్ళ నీళ్ళ దోపిడీ గుర్తుకు రాదు కాని మీరు ప్రతిపక్షంలో ఉంటే వాళ్ల దోపిడీ గుర్తుకువస్తుందన్నారు. చంద్రబాబు హాయాంలో కెసిఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రోళ్ళ పంచాయతీ లేదని, కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఆంధ్రోళ్ళ పంచాయతీ లేదుగాని వారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఆంధ్రోళ్ళ పంచాయతీ తెరమీదకు వస్తుందని మతలబు ఏమిటో అన్నారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు సిఎంహోదాల్లో ఉన్న చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డిలను కలిసినా తప్పులేదు కానీ చంద్రబాబు రేవంత్ రెడ్డి సిఎం హోదాలో ఇద్దరు కలిస్తే తప్పు ఏలా అవుతుందో చెప్పు హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# నూతన కోడ్‌లతో కాంట్రాక్ట్ విధానం రద్దు!

కోర్టులలోనూ న్యాయం జరిగే పరిస్థితులండవు

ఎఐటియుసి జాతీయ కార్యదర్శి సి.శ్రీకుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, ఆ చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన నూతన నాలుగు కోడ్‌లు అమలులోనికి వస్తే 43.2 శాతం కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించబోవని, తద్వారా వారు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఎఐటియుసి జాతీయ కార్యదర్శి, కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సెక్టార్ యూనియన్ల జాతీయ నాయకులు సి.శ్రీకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పాలకులు, యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తే, వారు కనీసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తేనైనా న్యాయం జరిగేదని, పర్మినెంట్‌కు అవకాశాలు ఉండేదని, కానీ నూతన కోడ్‌ల వల్ల కాంట్రాక్ట్ విధానామే రద్దు కాబోతుందని, ఈ కోడ్ ఆధారంగా న్యాయస్థానాల్లో కూడా కార్మికులకు న్యాయం జరిగే పరిస్థితులు ఉండబోవని వివరించారు. నాలుగు కోడ్‌ల వల్ల జరిగే అన్యాయాలు, కార్మిక వ్యతిరేక చర్యల పట్ల క్షేత్రస్థాయి కార్మికులకు అవగాహన పెంచాలని, అందుకు సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని, అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా నాలుగు కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న 'నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని' డిమాండ్ చేస్తూ ఎఐటియుసి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్, ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ అధ్యక్షత వహించగా శ్రీకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ఇన్‌చార్జ్ వి.ఎస్.బోస్, ఎఐటియుసి సీనియర్ నాయకులు డాక్టర్ .బి.వి.విజయ లక్ష్మి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు వి.చంద్రయ్య, భూమయ్య, డిఫెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులుఎ.వి.రావు, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేంపావని, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, నందూరి కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్రంలో 13లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ రంగాలలో 10లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కొత్త కోడ్‌లతో వీటిని భర్తీ చేసే అవకాశాలు లేవని, తద్వారా రిజర్వేషన్లను పొందుతున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు తీవ్ర నష్టం జరగబోతుందని తెలిపారు. 'కోడ్' అమలులోనికి వచ్చిన తర్వాత భవిష్యత్తులో కొత్త నియామకాలు జరగబోవని విమర్శించారు. ఎఐటియుసి వందేళ్ల పోరాటంలో అనేక కార్మిక చట్టాలను సాధించిందని, వారికి ఉద్యోగ భద్రతను, రక్షణను కల్పించిందని, అలాంటి కార్మిక చట్టాలపైన పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ చేయకుండానే, కేవలం కేంద్ర మంత్రి వర్గ నిర్ణయం ద్వారా రద్దు చేశారని, వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. నాలుగు కోడ్‌ల వల్ల కార్మికులకు జరిగే నష్టాలు, సమస్యలపై కనీసం బిజెపి ఎంపిలకు కూడా అవగాహన లేదన్నారు. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ రద్దు అధికారాన్ని కూడా పొందుపర్చారని, తద్వారా ఆ సంఘాన్ని రద్దు చేస్తే, ఇక కార్మిక సంఘమే ఉండబోదన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు కోడ్‌లు కార్మిక సంఘాలకు ఒక పెద్ద సవాలుగా నిలిచిందని, దీనిని రద్దు చేసేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని శ్రీకుమార్ పిలుపునిచ్చారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక, పారిశ్రామిక అంశాలలో అదానీ,అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలు, రాజకీయంగా ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తోందని విమర్శించారు. ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ అనేక పోరాటల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేశారని, మహిళలకు రాత్రిపూట కూడా డ్యూటీలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్పొరేట్‌కు అనుకూలంగా నాలుగు కోడ్‌లను ప్రవేశపెట్టారని విమర్శించారు.

## కెటిఆర్‌లో పరాకాష్టకు చేరిన అహంకారం

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కె.తారక రామారావులో అహంకారం పరాకాష్టకు చేరిందని, వారిని ప్రజలే తరిమి కొట్టే సమయం అసన్నామైందని టిపిసిసి అధ్యక్షులు ఎంఎల్‌సి బి. మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బంగారు తెలంగాణను భ్రష్టు పట్టించిన భస్మాసుర సైన్యం బిఆర్ ఎస్ నేతలదని ఎద్దేవా చేశారు. ఉరి తీయడం అంటే తప్పు చేసిన వారికి శిక్ష వేయడమని, ఎన్నో ఆశలతో కోట్లాది తెచ్చుకున్న తెలంగాణను బిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురి చేసింది కాబట్టి వారిని శిక్షించాలన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల ప్రజా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి దిశలో సాగుతుందని తెలిపారు. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించి ప్రజాదరణ పొందిందన్నారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణ మాఫీ, రైతు భరోసా, మహిళలకు ఫ్రీ బస్, ఉచిత కరెంట్, సబ్సిడి గ్యాస్, సన్న బియం వంటి సంక్షేమ పథకాలు అమలు, రికార్డ్ స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చిన విషయం కెటిఆర్‌కు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. కవిత వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పి, ఆ తరువాత కాంగ్రెస్ గురించి మాట్లాడాలన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బిఆర్‌ఎస్‌ను ప్రజలు అసెంబ్లీ, లోకసభ ,పంచాయతీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో శిక్షించినా వారు మాత్రం మారడం లేదని తెలిపారు.

### ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు
# 'టెట్' నుంచి మినహాయింపు ఇవ్వాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు 'టెట్' నుంచి మినహాయింపు ఇవ్వాలని, పార్లమెంటులో చట్టసవరణ చేయాలని ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌టిఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్,ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపైన ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఎఐజెఎసిటిఒ) అధ్వర్యంలో ఉద్యమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.రాజస్థాన్ రాష్ట్ర రాజధానిజైపూర్‌లో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది.

ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల నుండి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమలు తేదీకి ముందే నియమితులైన ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలని అన్నారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ నిర్లక్ష్యం వల్లనే సుప్రీం కోర్ట్‌లో ఇటువంటి తీర్పు వచ్చిందని వారు అభిప్రాయపడ్డారు. తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నదని, దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని వారు విమర్శించారు. టెట్‌పై కొందరు ఎంపిలు పార్లమెంటులో ప్రస్తావించినప్పటికి ఫలితం లేదన్నారు. నాయకులు పరమేశ్, సాబేర్ అలి, పున్న గణేష్, శ్రీశైలం, శ్రీధర్ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అన్నలా తోడుంటా

సంక్షేమ శాఖ మంత్రి

అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దివ్యాంగులకు అన్నలా తోడుంటానని ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ భరోసా ఇచ్చారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అందులకు మాత్రమే కాదు, సమాజానికే వెలుగు చూపిన మహనీయుడని పేర్కొన్నారు. అంధత్వాన్ని శాపంగా కాకుండా అవకాశంగా మార్చిన వ్యక్తి బ్రెయిలీ అని, ఆయన ఒక వ్యక్తి కాదని ఒక ఆలోచన, ఒక ఉద్యమమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుందని మంత్రి తెలిపారు. తాను శాఖ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు అవుతోందని, ఈ కాలంలో దివ్యాంగుల సమస్యలపై నిరంతర దృష్టి పెట్టి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం పదవ తరగతి వరకే బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అనేక మంది దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరిపామని, రానున్న రోజుల్లో ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీ స్థాయి వరకు బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ దిశగా త్వరలోనే జీవో జారీ చేసి, దివ్యాంగ విద్యార్థులకు పూర్తి స్థాయి విద్యా అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాంజెండర్ల సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్సీ నవీన్‌రావును విచారించిన సిట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణలో సిట్ దూకుడు పెంచింది. నేడు విచారణకు హాజరు కావాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావుకు సిపి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో సిట్ విచారణకు హాజరయ్యారు. తీగ లాగితే డొంక కదిలిన మాదిరిగా.. ఈ కేసులో ఒక్కొక్కరినీ విచారించే కొద్దీ కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. నవీన్ రావు విచారణలో తన వెనుక ఎవరున్నారు? ఎవరితో చేయి కలిపారు? వంటి ప్రశ్నలు సిట్ అధికారులు సంధించినట్లు సమాచారం. సిట్ విచారణలో నవీన్ రావు ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానమివ్వలేదని తెలుస్తోంది. ఫోన్ ట్యాపింక్ కేసు నిందితులైన ప్రణీత్‌రావు, శ్రవణ్ కుమార్‌లతో తనకు సంబంధాలున్నాయన్న ఆరోపణలను నవీన్ రావు ఖండించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేందుకు రాజకీయంగా ఇలాంటి ప్రచారం చేస్తున్నారని నవీన్‌రావు వాపోయారు. నిందితులతో తనకెలాంటి సంబంధం లేదని, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎప్పుడూ వారితో మాట్లాడలేదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. విచారణలో ఎమ్మెల్సీ నవీన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలన్ని సిట్ అధికారులు రికార్డు చేశారు.

కాగా.. ఈ కేసులో బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌ను కూడా విచారించేందుకు సిట్ రెడీ అవుతోంది. త్వరలోనే వారిద్దరీ సిట్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకం ఓ దిక్సూచి

### పుస్తక ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకంతో తెలుగు రాష్ట్రాల చరిత్ర, బాష, సంస్కృతి కొత్త మలుపులు తిరుగబోతున్నాయని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ వాస్తవిక చరిత్రను ఆవిష్కరించుకునే పరిశోధన మార్గంలో సీనియర్ సంపాదకులు, రచయిత కట్టా శేఖర్‌రెడ్డి రచించిన 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకం దిక్సూచి వంటిదని అభివర్ణించారు. 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర అంటేనే కూర్పులతో కూడిందన్నారు. దేశంలో విజేతలు చరిత్రను రాసుకున్న ఆనవాయితీ కొనసాగడంతో అసలు చరిత్ర ఏమిటనేది నిత్య సత్యశోధనగా కొనసాగుతుందని తెలిపారు. స్వరాష్ట్రంలో తెలంగాణ చరిత్రను రాసుకునే సమయం వచ్చిందని, ఈక్రమంలోనే కట్టా శేఖర్ రెడ్డి తెలంగాణ మూలాలు పుస్తకంతో తెలుగు భాష, తెలంగాణ చరిత్ర పరిశోధనపై లోతైన పరిశోధన చేశారని కొనియాడారు.

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను, భాష, సంస్కృతులను అణిచివేసే కుట్రలు ఉమ్మడి రాష్ట్రంలో జరిగాయని అన్నారు. చరిత్ర పరిశోధనలు ఎంత తవ్వితే, ఎంత చిలికితే అంత మంచిదని, తెలంగాణ చరిత్ర స్థిరీకరణకు మరిన్ని పరిశోధనలు జరగాలని తెలిపారు.

సీనియర్ సంపాదకులు, రచయిత కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర పుస్తక రచనతో రచయిత కట్టా శేఖర్ రెడ్డి ఆంధ్ర, తెలుగు, తెనుగు భాషల మధ్య వైరుధ్యాలపై విస్తృత పరిశోధన చేశారని ప్రశంసించారు. పుస్తకం చదువుతుంటే థ్రిల్లర్ నవలను, కాల్పనిక నవలను చదువుతున్నట్టుగా ఆసక్తికరంగా సాగుతుందన్నారు. తెలంగాణ చరిత్రపై ప్రాంతీయ ఆధిపత్య శక్తుల ప్రభావం నుంచి స్వీయ అస్థిత్వం, ఆత్మగౌరవంతో కూడిన చరిత్రను ఆధారాలు, పరిశోధనలతో చెప్పే ప్రయత్నం చేశారని వివరించారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ భారతదేశ చరిత్రతో పాటు, ఆంధ్రులు, తెలంగాణ చరిత్ర కూడా వక్రీకరణలతో సాగాయన్నారు. సింహాలు తమ చరిత్రను చెప్పుకోనంత వరకు వేటగాడు చెప్పిందే చరిత్ర అవుతుందని వ్యాఖ్యానించారు.

సీనియర్ సంపాదకులు అల్లం నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో భాష, సంస్కృతుల అస్తిత్వం కోల్పోయిన తెలంగాణకు స్వరాష్ట్రంలో చరిత్ర నిర్మాణం, భాషలపై జరగాల్సిన పరిశోధనలు జరుగలేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ చరిత్ర మూలాల రచనతో కట్టా శేఖర్ రెడ్డి తెలంగాణ చరిత్ర, భాషలపై ఆసక్తికర చర్చను లేవనెత్తారని అభినందించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ చరిత్రను ఎప్పుడూ ఎవ్వరూ పూర్తిగా రాయలేరని, దేశ, రాష్ట్ర చరిత్రలు కూడా ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. సాక్షి సంపాదకులు వర్ధెల్లి మురళి మాట్లాడుతూ కట్ట శేఖర్ రెడ్డి తన రచనలతో తెలుగు, తెలంగాణ చరిత్రలకు సంబంధించి కొత్త చర్చను ప్రారంభించారన్నారు. పుస్తక రచయిత కట్టా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏదైనా అంశంపైన గత చరిత్రను అన్వేషించే స్వీయ ఆసక్తి తనను తెలంగాణ చరిత్ర మూలాలు పుస్తక రచన వైపు నడిపించాయన్నారు. తమిళ భాష ప్రాచీన హోదా అంశంతో తెలుగు భాష మూలాలపైన ఆసక్తి పెరిగిందన్నారు. వెయ్యి ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగు భాషకు ప్రాచీన హోదా ఇవ్వడాన్ని మద్రాస్ హైకోర్టులో సవాల్ చేయడం కూడా తనను తెలుగు భాషా చరిత్రపై ఆసక్తి పెంచిందన్నారు. తెలుగు లింక్‌తో తన పరిశోధనను కొనసాగించి, చారిత్రక ఆధారాలు, శాసనాలతో తెలంగాణ చరిత్ర మూలాల రచన చేశానని, అయితే ఇది మాత్రమే తెలంగాణ చరిత్ర అని తాను నిర్ధారించడం లేదని, దీనిపైన మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉన్నదని కట్ట శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశ సంపాదకులు మార్కండేయులు, సీనియర్ జర్నలిస్టు, రచయిత కోవెల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేస్తే.. ప్రజల హృదయాల్లో...

ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారు

పోటు ప్రసాద్ సంతాప సభలో

సిపిఐ నారాయణ వ్యాఖ్య



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** ప్రజల కోసం పనిచేసేవారు ప్రజల కోసం జీవించేవారు ప్రజల హృదయాల్లో ఎల్లప్పటికీ జీవించే ఉంటారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో దివంగత సిపిఐ నాయకులు పోటు ప్రసాద్ స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన బహిరగం సభలో ఆయన మాట్లాడారు.

దేశంలో కమ్యూనిజం లేకుండా చేస్తామని మోడీ, అమిత్‌షా ద్వయం బీరాలు పలుకుతున్నారని, కమ్యూనిజాన్ని అంతమొందించడం అంత సులువు కాదని అన్నారు. ఈ దేశంలోని పౌరులు అనుభవిస్తున్న అన్ని సౌకర్యాలు అలాగే ఈ దేశంలోని బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కారం అయ్యాయి అంటే అందుకు కారణం కమ్యూనిస్టులు అని కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాల ఫలితంగానే పాలకులు దిగివచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వెనుజుల దేశంపై అమెరికా దాడి తీవ్రంగా ఖండిస్తున్నామని, అమెరికా దేశం ఒక ప్రపంచ నియంతగా ప్రవర్తిస్తుందని నిత్యం ప్రపంచంలోని ఏదో ఒక దేశంతో కయ్యాలు పెట్టుకుంటూ ప్రపంచంలో అశాంతిని నెలకొల్పుతున్నదని, ట్రంప్ అనేవాడు ప్రపంచానికి కంపుగా మారాడని ప్రపంచంలోని అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు ఈ దాడులను తీవ్రంగా ఖండించాలని కోరారు. బహిరంగ సభకు జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఐ, సిపిఎం ఖమ్మం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, నున్నా రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ధనుంజయ నాయుడు, యల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, ఉస్తెల సృజన, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, సాయబెల్లి, పోటు కళావతి, పోటు చింటుబాబు, పోటు కృష్ణబాబు, మండల సిపిఐ కార్యదర్శి కడియాల అప్పయ్య, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్టా కళ్యాణి, గానుగుబండ సర్పంచ్ కడియాల పద్మ, పోటు పూర్ణచంద్రరావు, అమరారపు పున్నయ్య, చిల్లంచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పరిరక్షణకు ఎఐసిసి సమరం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎ) బలహీన పరుస్తోందని ఆరోపిస్తూ, దాని పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) శ్రీకారం చుట్టనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలు, పథకం పేరు మార్పు ప్రతిపాదనలు గ్రామీణ పేదల ఉపాధి హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని దాని అసలు రూపంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జనవరి 10 నుండి ఫిబ్రవరి 25వరకు వివిధ దశల్లో నిరసనలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా వార్డు, బ్లాక్ స్థాయిల్లో శాంతియుత ధర్నాలు, జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, రాష్ట్రాల అసెంబ్లీల ముట్టడి, జాతీయ స్థాయిలో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, సమన్వయం కోసం ప్రత్యేకంగా ఒక సమన్వయ కమిటీని ఎఐసిసి ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు అవకాశం కల్పించారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్-63
టెండర్ నోటీస్ No. 32/ 25-26 (పేపర్ నోటిఫికేషన్)
ఇ-టెండర్ కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి. ప్రస్తుత 11 KV OH లైన్‌ను UG కేబుల్‌తో భర్తీ చేయడం ద్వారా a) 33 /11 KV ASRR SS నుండి వెలువడే 11 KV GHMC PARK FEEDER ను జనరల్ కేటగిరీ eMZ 33/25-26 (Extn-I) కింద. b) హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ మెహిదీపట్నం డివిజన్‌లోని eMZ-34/25-26 (Exten-I), జనరల్ కేటగిరీ కింద 33/ 11 KV ఆసిఫ్‌నగర్ SS నుండి EMANATING 11 KV NSF ఫీడర్, c) హైదరాబాద్ సౌత్ సర్కిల్ బేగంబజార్ డివిజన్‌లోని eMZ 35/25-25 (Exten-I)జనరల్ కేటగిరీ కింద 11 KV ఇసామియా బజార్ ఫీడర్‌ను విభజించడం, d) B Hills సర్కిల్‌లోని మెహర్‌బాబా ఫీడర్‌ను జనరల్ కేటగిరీ (eMZ-36 NEW) కింద విభజించడం, అసలు పనులకు T & D మెరుగుదలలు. దీనికి సంబంధించి ఏవైనా ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్లు www.tender.telangana.gov.inమరియు www.tgsouthernpower.org నుండి చూడవచ్చు.
సం/- చీఫ్ ఇంజినీర్, ఆపరేషన్ మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 12996-PP/CL/ADVT/1/2025-26, Date: 03-01-2026



# జనరల్
STATE & REGIONAL NEWS

## 4నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అగ్రభాగాన నిలుస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఫోర్త్ క్లాస్ ఉద్యోగులకు గత 4 నెలలుగా వేతనం చెల్లించకపోవడం అన్యాయమని ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. ఎన్‌హెచ్‌ఎంల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 4 నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఈఎమ్ఐలు, ఇంటి అద్దెలు ,కరెంటు బిల్లు, పాల బిల్లు, నిత్యవసర వస్తువులు కొన్న లేని పరిస్తితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు కుటుంబ పోషణ భారమై వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జీతం వస్తేనే ఇవన్నీ కట్టేది, వండుకునేది, తినేదని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్, అక్టోబర్ నవంబర్, డిసెంబర్ వరసగా 4 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



### గ్రామపంచాయతీలకు
## భవనాల కరువు
### ఇరుకు గదుల్లోనే పాలకవర్గ సమావేశాలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని పలు గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలు లేకపోవడంతో పాలకవర్గ సమావేశాలు తీవ్ర ఇబ్బందుల మధ్య నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్వంత భవనాలు లేని గ్రామపంచాయతీలు ఇరుకు గదులు, రేకుల షెడ్డుల్లోనే కార్యకలాపాలు కొనసాగించాల్సి వస్తుండటం పై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పడిన కొర్లకుంట, నాగర్ల బండ తండా గ్రామపంచాయతీలకు ఇప్పటికీ శాశ్వత భనాలు లేకపోవడం గమనార్హం. నాగర్ల బండ తండా పంచాయితీ కార్యాలయం రేకుల షెడ్డుల్లోనే కొనసాగుతుంగా. కొర్లకుంట గ్రామపంచాయితీ భవనం ఇరుగు గదిలో ఉంది. వీటిలో సరిపడా స్థలం లేకపోవడంతో సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి కలిసి సమావేశాలు నిర్వహించుకోవడానికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు గత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని విమశలు వినిపిస్తున్నాయి. కనీస వసతులు లేక ప్రజా సమస్యల పై చర్చించేందుకు కూడా అనుకూల వాతావరణం లేకపోవడంతో పాలన పై ప్రతికూల ప్రభావం పడుతున్నదని గ్రామస్తులు అంటున్నారు. మండలంలోని రంగవరం గ్రామంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గత ప్రభుత్వం హయాంలో ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా రూ. 20 లక్షలు మంజూరు అయినా, నూతన గ్రామపంచాయితీ భవన నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేసి అసంపూర్తిగా వదిలేశారు. ప్రజాధనాన్ని ఇలా నిర్లక్ష్యంగా వృథా చేయడం పై గత పాలకులు సమాధానం చెప్పాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రంగవరంలో ఒకే గదిలో గ్రామపంచాయితీ కార్యాలయంతో పాటు అంగన్వాడీ కేంద్రాన్ని కూడా నిర్వహించాల్సి వస్తుండటంతో మహిళలు, చిన్నారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి పై సర్పంచ్ రమేష్ ఆవేదన వ్యక్తం చేస్తూ, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామ పాలన అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. గ్రామపంచాయితీలు గ్రామ పాలనకు మూలస్తంభాలుగా ఉన్నప్పటికీ, కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కేంద్ర నుంచి రావాల్సిన 15 వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజులయ నిధులు వెంటనే మంజూరు అయితే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకొవచ్చని సర్పంచులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### క్రీడాభివృద్ధిలో రిటైర్డ్ ఉద్యోగుల
## సేవలు వినియోగించుకుంటాం
### స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజాయితీతో, నిబద్ధతతో విధులు నిర్వహించే ఉద్యోగులకు సమాజంలో తప్పనిసరిగా గౌరవం లభిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీలో దాదాపు 37 సంవత్సరాలు సైక్లింగ్ కోచ్‌గా సేవలందించిన జి. చంద్రా రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశం ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వేలోడ్రోమ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివసేనారెడ్డి మాట్లాడుతూ.. సైక్లింగ్ కోచ్‌గా, స్టేడియం అడ్మినిస్ట్రేటర్‌గా, డిప్యూటీ డైరెక్టర్‌గా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ దాదాపు 225 జాతీయ స్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులను తీర్చిదిద్దిన చంద్రా రెడ్డి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే కాకుండా, వారు గౌరవప్రదమైన ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడేలా శిక్షణ అందించిన చంద్రా రెడ్డిని యువ కోచ్‌లు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సిఎం కప్–2024 నిర్వహణలో చంద్రా రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. క్రీడాభివృద్ధి కోసం రిటైర్డ్ కోచ్‌లు, అధికారుల అనుభవాన్ని వినియోగించుకునేలా స్పోరట్స్ అథారిటీ కృషి చేస్తుందని శివసేనారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఒయు సైక్లింగ్ వేలోడ్రోమ్‌లో శిక్షణ పొంది వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన సైక్లిస్టులు చంద్రా రెడ్డిని ఘనంగా సన్మానించి పాదపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఏవో అనిత, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, స్పెషల్ ఆఫీసర్ భాష, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్లు శోభ, జనార్దన్ రెడ్డి, మనోహర్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, అడ్మినిస్ట్రేటర్లు నందకిషోర్, గోకుల్, సుధాకర్ రావు, వెంకటేశ్వర రావు, కన్నం మధు, ప్రజాసంబంధాల అధికారి కాలేరు సురేష్‌తో పాటు పలువురు కోచ్‌లు, స్పోరట్స్ అథారిటీ సిబ్బంది, రిటైర్డ్ కోచ్‌లు, రిటైర్డ్ సిబ్బంది మరియు పెద్ద ఎత్తున సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

### బంగ్లాదేశ్ హిందూ వ్యాపారి
## హత్యకేసులో ముగ్గురు అరెస్టు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపార ఖోకోన్ చంద్రదాస్ (50) హత్యకేసులో ముగ్గురు నిందితులను అక్కడి ర్యాపిడ్ యాక్షన్ బెటాలియన్ (ఆర్ఎబి) అరెస్టు చేసింది. బజిత్‌పూర్ ఉపజిల్లాలోని కిషోర్‌గంజ్ నుండి దముద్యార్ సోహగ్‌ఖాన్ (27), రబ్బీ మోల్యా (21), పలాష్ సర్దార్ (25)లను శనివారం అరెస్టు చేశారు. ఆర్ఎబి మదరిపూర్ క్యాంప్ కంపెనీ కమాండర్ పోలీస్ సూపరింటెండెంట్ మిర్ మోనిర్ హుస్సేన్ మాట్లాడుతూ, నిందితులను మదరిపూర్ క్యాంప్‌కు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఖోకోన్ చంద్రదాస్ ఒక మెడికల్ షాపు నడపడంతోపాటు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన ఒక ఆటోరిక్షాలో వెళుతుండగా ఆ వాహనాన్ని గుర్తించి నిందుతులు ముగ్గురూ దాడిచేశారు. ఆయనను తీవ్రంగా కొట్టారు. ఆయనపై పెట్రోలు పోసి దహనం చేశారని మీడియాతో గడచిన గురువారం వార్తలు వెలువడ్డాయి. దాస్ తనను తాను రక్షించుకోవడం కోసం రోడ్డు పక్కన చెరువులో దూకారు. స్థానికులు కేకలు పెట్టడంతో నిందితులు ముగ్గురూ పరారయ్యారు. స్థానికులు దాస్‌ను షరియత్‌పూర్ సాదర్ ఆసుపత్రిలో చేర్చారు. ఆ తర్వాత ఆయనను ఢాకా ఆసుపత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ దాస్ గాయాలతో మరణించారు.

## నైజీరియా మార్కెట్‌లో బందిపోటు కాల్పులు
### 30 మంది మృతి




**అబుజా:** నైజీరియాలోని మార్కెట్‌లో ఒక గన్‌మెన్ కాల్పులు జరపడంతో 30 మంది మరణించారు. అనేకమంది కిడ్నాప్‌కు గురయ్యారు.నిగర్ రాష్ట్రం డెమోగ్రామంలోని కసువాన్ దాజీ మార్కెట్‌లో సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ కాల్పుల ఘటనతో ఆహార దుకాణాలలో దోపిడీలు జరిగాయి. అనేక దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ విధమైన గన్‌మెన్‌లను స్థానికులు బందిపోట్లుగా పిలుస్తారు. అపహరణకు గురైనవారిని విడిపించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. నైజీరియాలో కిడ్నాపులు, కాల్పుల ఘటనలు సర్వసాధారణాంశాలుగా మారాయి. ప్రభుత్వాన్ని బెదిరించి ధనం సంపాదించడంకోసం బందిపోట్లు కిడ్నాపులు చేస్తున్నారు. బందిపోటు తుపాకి తీసుకుని మోటార్ బైక్‌పైన వచ్చి వెంటనే విచక్షణారహితంగా కాల్పులు జరిపాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పొరుగున అగ్వారా, బొరుగు ప్రాంతాలలో గడచిన రెండు రోజులుగా వారిపై దాడులు జరుగుతూ ఉండటంతో బందిపోటు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. సెంట్రల్ నైజీరియాలో కొన్ని వారాల క్రితం ఒక కేథలిక్ స్కూలు నుండి 300 మంది విద్యార్థులను, ఉపాధ్యాయులను కిడ్నాప్ చేసిన తర్వాత మళ్ళీ జరిగిన అతిపెద్ద హింసాత్మక ఘటన ఇదే.

### తెలంగాణకు 490 టిఎంసిల ప్రాజెక్ట్‌లకు
## అనుమతులు వచ్చాయనడం అవాస్తవం
### మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు 490 టిఎంసిల ప్రాజెక్ట్‌లకు అనుమతులు వచ్చాయనడం అవాస్తవమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు మాత్రమేనని, మిగిలిన 191 టిఎంసిలు వరద జలాలపై ఆధారపడ్డాయని వివరించారు. కాంగ్రెస్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని, అవసరమైతే మరో జల పోరాటానికి బిఆర్ఎస్ శ్రీకారం చూడుతుందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నది జలాలపైన హరీశ్‌రావు ఆదివారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ 3ను కెసిఆర్ తీసుకొస్తేనే కదా ట్రిబ్యునల్ ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వాదనలు వినిపిస్తున్నదని, లేదంటే కాంగ్రెస్ రాసిన మరణశాసనం 299 టిఎంసిలకే ఆగమైతుండెనని, కృష్ణాలో తెలంగాణకు 600 టిఎంసిలు రావడానికి, నాడు కెసిఆర్ ఎంతో మేలు చేశారని అన్నారు. మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని, పాలమూరు, డిండి ప్రాజెక్ట్‌లను తాము కొనసాగిస్తామని నాటి సిఎం కెసిఆర్ స్పష్టం చేసినట్టు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వహాయాంలో 11 ప్రాజెక్టులకు డిపిఆర్‌లను పంపిస్తే, ఇందులో ఏడు ప్రాజెక్టులకు తాము అనుమతులు సాధించామని, కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాతనే రంగారెడ్డి పాలమూరు, అంబేద్కర్ ప్రాజెక్ట్‌లతోపాటు కాళేశ్వరం అడిషనల్ టిఎంసి డిపిఆర్‌లు వెనక్కి వచ్చాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలోనే తెలంగాణకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని, 11వ షెడ్యూల్‌లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పెట్టలేదని ఆరోపించారు. ఉమ్మడి ఎపిలో 42 లక్షల ఆయకట్టు ఉన్నదని, పదేళ్లలో 5 లక్షల 71 వేల ఆయకట్టు కాంగ్రెస్ తీసుకొస్తే, బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో తాము కొత్తగా 17 లక్షల ఆయకట్టు తీసుకొచ్చామని తెలిపారు. కాంగ్రెస్, టిడిపి ద్రోహం వల్లనే కృష్ణాలో 299 టిఎంసిలు వచ్చాయని, కానీ గోదావరిలో 933 టిఎంసిలకు తాము అనుమతులు సాధించామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి శాసనసభలో అబద్దాలు చెప్పినందుకు ఆయన తన సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తిలోనే 3.5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామన్నారు. బిఆర్ఎస్ హయాంలో 1200 టిఎంసిలను తరలించామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అవాస్తవాలను చెబుతున్నారని, తమ పదేళ్ల కాలంలో కేవలం 120 టిఎంసిలను మాత్రమే తరలించామని, కాంగ్రెస్ పాలనలో 241 టిఎంసిల నీటిని తరలించారని హరీశ్‌రావు ఆరోపించారు.

## పోరాటం లేకుండా సమస్యలు పరిష్కారం కావు
### ఖమ్మం నుంచే పెన్షనర్ల సమర శంఖం
### సంఘం జాతీయ కార్యదర్శి సుధాకర్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం నుంచే సమరశంఖం పూరించాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. సుధాకర్ పిలుపునిచ్చారు. పోరాటం లేకుండా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, ప్రభుత్వాల వైఖరి మారాలంటే పోరాటమే శరణ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం స్థానిక టిఎన్‌జీవో ఫంక్షన్ హాల్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో సుధాకర్ మాట్లాడుతూ పాలక వర్గాలు పెన్షనర్ల పై పెట్టే ఖర్చును వృధా ఖర్చుగా భావిస్తున్నాయని ఈ క్రమంలోనే ఓపిఎస్‌ను రద్దు చేశారని ఆయన తెలిపారు. 2014లో రాంలీలా మైదానంలో 10 లక్షల మందితో ర్యాలీ నిర్వహించడం జరిగిందని, ఆ తర్వాత సుప్రీం కోర్టు కూడా పెన్షన్ భిక్ష కాదని ఉద్యోగుల హక్కు అని తీర్పునిచ్చిన సంగతి ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత పెన్షన్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని, పెరుగుదల ఉండదని ఆఖరి 12నెలల వేతనంలో సగం మాత్రమే ఇస్తారని ఆయన తెలిపారు. పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం వచ్చిందని రూల్స్‌ను మార్చారని 2026 జనవరి ఒకటి నుంచి ఎనిమిదవ వేతన కమిటీ సిఫారసులను అమలు చేసే అధికారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందని సుధాకర్ తెలిపారు. కంట్రోల్ పే కమిషన్‌ను అనుసరించి 15 రాష్ట్రాలు పే రీవిజన్‌ను అమలు చేస్తున్నాయని దక్షిణాది రాష్ట్రాలలో సొంత పిఆర్‌సి ఉన్నాయని అయినా కేంద్రం మనకు నష్టం చేసే విధంగా నియమాలను రూపొందిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. మార్చి 25ను విద్రోహ దినంగా పెన్షనర్లు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. జేఏసి నాయకత్వంపై ఉద్యమ బాధ్యత ఉందని రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రాలు పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్దరించాయని ఈ రాష్ట్రంలో కూడా ఓపిఎస్ అమలయ్యేవిధంగా పోరాటం కొనసాగించాలన్నారు. సభలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తమిళనాడులో పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లే తెలంగాణలో కూడా అమలు చేయాలని ఆయన డిమాం డ్ చేశారు. ఖమ్మం జిల్లాలో అనేక ఉద్యమాలు పురుడుపోసుకున్నాయని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఖమ్మం వేదికగా ఉద్యమం ఉధృతం చేయాలని రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఐక్య కార్యాచరణకు తమ సంఘం సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన తెలిపారు. ఈ సభలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జయ భారతి, తెలంగాణ మహిళా ఛైర్‌పర్సన్ వి.రమాదేవి, సంఘం నాయకులు నాగమణి, శంకర్ లింగం, రాంమనోహర్, పురుషోత్తం, టిజిఒ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, వేలాద్రి, నాయకులు రాయల రవికుమార్, ఐవి భాస్కరాచారి, కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాస రావు, మేరీ ఏసుపాదం, పెదమల్ల సత్యనారాయణ, శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**డైరీ ఆవిష్కరణ, సన్మానం :** సదస్సు అనంతరం పెన్షనర్ల సంఘం డైరీని, క్యాలెండర్‌ను అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. సదస్సు సందర్భంగా వివిధ శాఖలకు చెందిన పలువురిని సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు.

## కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధ కలిగింది
### సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా(69) ఇటీవల కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదివారం హైదరాబాద్‌లోని సాయిబాబా నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, విమానాశ్రయం నుండి నేరుగా సాయిబాబా నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన చంద్రబాబు, వారికి ధైర్యం చెప్పారు. సాయిబాబా కుటుంబానికి ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ సాయిబాబా మృతితో ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధ కలిగిందని తెలిపారు. పార్టీ ఆఫీస్‌కు ఎప్పుడు వెళ్లినా, తనకు ఆయన స్వాగతం పలికేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్న పార్టీ కోసమే ఆయన పని చేశారన్నారు. ఆయన తన కుటుంబం కోసం కాకుండా పార్టీ కోసం పని చేసిన వ్యక్తి సాయిబాబా అని గుర్తు చేసుకున్నారు. సాయిబాబా కుటుంబానికి కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ కుటుంబాన్ని నిలబెట్టే బాధ్యత పార్టీ అధినేతగా ఆ కుటుంబ పెద్దగా తాను తీసుకుంటానని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన మరణం తనకు చాలా బాధ కలిగిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి శనివారం వరకు, చివరి శ్వాస ఉన్నంత వరకు పార్టీ కోసం పని చేసిన వ్యక్తి పిన్నమనేని సాయిబాబా అని వివరించారు. ఎన్‌టిఆర్ పార్టీ పెట్టినప్పుడు, ఆయన అభిమానిగా పార్టీలో చేరడం నాటి నుంచి అనునిత్యం పార్టీ కోసం పని చేశారని గుర్తు చేసుకున్నారు. పార్టీ కోసం సాయిబాబు ఎనలేని సేవలు అందించారన్నారు. చివరి రోజుల్లో నడవ లేని పరిస్థితుల్లో వీల్ చైర్‌లో వచ్చి పార్టీ ఆఫీస్‌లో కుర్చొనే వారన్నారు. పార్టీ కోసం ఒక కమిట్‌మెంట్‌తో పని చేసిన వ్యక్తి సాయిబాబా అని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు వికలాంగుల కార్పొరేషన్‌కు చైర్మన్‌గా సేవలందించారని వివరించారు. అనేక సార్లు ఆయన పార్టీ పదవుల్లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వంలో సైతం భాగస్వాములయ్యారని చెప్పారు. అనేక కార్యక్రమాలు సైతం ఆయన చేపట్టారన్నారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారని, ఆయనను చూసినప్పుడు చాలా బాధేస్తుందన్నారు. సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, కంభంపాటి రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, పార్టీ నాయకులు పొలంపల్లి అశోక్, శ్రీపతి సతీష్, నల్లెల్ల కిషోర్, పి. బాల్‌రాజ్ గౌడ్, నాగు నాగేష్ తదితరులు ఉన్నారు.

### మేడారం జాతరకు
## పెరిగిన భక్తుల రద్దీ

**ప్రజాపక్షం/ములుగు:**ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం జా తర ఇంకా 25 రోజులే ఉంది. కానీ ఇప్పటికే దేశం నలుమూలల నుండి అనేక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ లేని విధంగా మేడారం జాతరలో అద్భుతమైన కట్టడాలు నిర్మించారు. కానీ అవి పూర్తి కాకపోవడం వలన భక్తులకు తీరని ఇబ్బందులు జరుగుతున్నాయి. అయినప్పటికి జాతర వరకు పనులు పూర్తయితాయని అధికారులు చెబుతున్నారు. వారానికి ఒకసారి మంత్రులు మాత్రం మేడారం జాతరలో ప్రవేశించి జాతర స్థలం పరిశీలన చేస్తున్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం సెలవు దినం కావడంతో అనేక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారక్క దర్శించుకుంటున్నా రు. జంపన్న వాగులో స్థానాలు చేసి తన్నుల వద్దకు భక్తులు ఎత్తు బంగారాన్ని తల్లులకు అప్పజెప్తున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మేడారం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారక్క దర్శించుకుంటారు. వచ్చిన భక్తులకు ములుగు జిల్లా ఎస్‌పి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

## కోర్టు భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి





**ప్రజాపక్షం/నిర్మల్ :** నూతన కోర్టు భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి సుజన అన్నారు.ఆదివారం సారంగాపూర్ మండలం చించోలి బి గ్రామ సమీపంలో పలు కోర్టుల భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు సుజన,లక్ష్మ ణ్, నర్సింగ్ రావు,జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లు పాల్గొన్నారు.ముందుగా కోర్టు భవనాల నిర్మాణానికి సంబంధించి భూమి పూజ చేశారు.జిల్లాలో నూతన కోర్టు భవనాల నిర్మాణానికి చక్కని చదునైన స్థలాన్ని అధికారులు కేటాయించడం ఎంతో సంతోషకరమైన విషయమని వివరించారు.కోర్టులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయ సేవలు అందించడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.కోర్టు భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

**కోర్టుల ఆధునీకరణతో న్యాయ సేవలో వేగం పెరుగుతుంది : హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్ రావు**

కోర్టులు ఆధునీకరణ చెందడం ద్వారా,అధునాతన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సమాజానికి న్యాయ సేవలు మెరుగ్గా,త్వరితగతిన అం దించడానికి వీలు కలుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్ రావు అ న్నారు.ప్రధాన న్యాయస్థానం పాటు,సీనియర్ జూనియర్ సివిల్ సెషన్స్ పోక్సో,ఎస్సీ,ఎస్టీ,ఫ్యామిలీ న్యాయస్థానాలతో సహా మొత్తం 12 కోర్టు భవనాలను నిర్మించుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కోర్టు భవన నిర్మాణాలు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి,ఎస్పీ జానకి షర్మిలలు మాట్లాడుతూ, నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపనలు చేయడానికి హైకోర్టు న్యాయమూర్తులు జిల్లాకు రావడం సంతోషకరమైన విషయమని తెలిపారు. హాజరైన న్యాయమూర్తులు, కలెక్టర్ ను శాలువాలతో సన్మానించారు.

## తాత్కాలిక న్యాయమూర్తులు ఎక్కడ?
### ‘పెండింగ్స్’ పరిష్కారంపై ఆసక్తిలేని హైకోర్టులు!

**న్యూఢిల్లీ:** అపరిష్కృతంగా ఉన్న లక్షలాది క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు తాత్కాలిక న్యాయమూర్తులను నియమించుకోవాలని ఆదేశిస్తూ సుప్రీం కోర్టు చెప్పి ఏడాది గడచిపోయినప్పటికీ రాష్ట్రాలలో మాత్రం నియామకాలు జరగలేదు. హైకోర్టులు ఈ విషయంలో అంతగా ఆసక్తి చూపిస్తున్నట్లు కనిపించడంలేదు! హైకోర్టులు, సుప్రీంకోర్టులలో న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన విధి విధానాలు తెలిసిన వ్యక్తులు చెప్పిన సమాచారం ప్రకారం, దేశంలో ఉన్న 25 హైకోర్టులలో ఏ ఒక్క హైకోర్టూ కూడా తాత్కాలిక న్యాయమూర్తులను నియమించాలని కోరుతూ సిఫార్సులు చేసిన దాఖలాలు లేవు! దేశంలోని 25 హైకోర్టులలో 2025 జనవరి 30వ తేదీ నాటికి 18 లక్షలకు పైగా క్రిమినల్ కేసులు పరిష్కారం కాకుండా ఉండిపోయాయి. వీటిని పరిష్కరించడానికి అదనపు న్యాయమూర్తుల అవసరం ఉంది. హైకోర్టులు తమ మొత్తం న్యాయమూర్తుల సంఖ్యలో 10 శాతం మించకుండా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను తాత్కాలికంగా జడ్జీలుగా నియమించుకోవడానికి వీలు కల్పిస్తూ సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చి ఏడాది గడచిపోయింది. ఐనాగానీ ఇప్పటివరకూ కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖకు రాష్రాలలోని హైకోర్టుల కొలీజియంల నుండి నియామకాలు కోరుతూ ఎలాంటి సిఫార్సులూ అందలేదు. రాజ్యాంగంలోని 224 ఎ అధికరణలోని అంశాల ప్రకారం పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను తాత్కాలిక జడ్జీలుగా నియమించుకుని కేసులు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంది. నిర్ణీత ప్రకారం సంబంధిత హైకోర్టులు అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి తాత్కాలిక న్యాయమూర్తులు ఎంతమంది కావాలో నిర్ణయించుకుని వారి పేర్లను సిఫార్సు చేయాలి. ఈ వివరాలు కేంద్ర న్యాయశాఖకు ఇవ్వాలి. ఆ తర్వాత ఈ శాఖ మరిన్ని వివరాలన్నీ జోడించి సుప్రీంకోర్టు కొలీజియంకు ఈ పేర్లను పంపిస్తుంది. అప్పుడు సుప్రీంకోర్టు కొలీజియం ఈ పేర్లను పరిశీలించి ఖరారు చేసి ఎంపిక చేసిన న్యాయమూర్తుల పేర్లను కేంద్ర న్యాయశాఖకు సిఫార్సు చేస్తుంది. రాష్ట్రపతి ఈ కొత్త న్యాయమూర్తుల నియామకంపై సంతకం చేస్తారు. తాత్కాలిక న్యాయమూర్తుల నియామకాలకు కూడా దాదాపు ఇదే విధానం వర్తిస్తుంది. కాకపోతే రాష్ట్రపతి మాత్రం ఈ నియామకాల పత్రంపై సంతకాలు చేయరు. కానీ ఈ తాత్కాలిక నియామకాలకు మాత్రం రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరిగా ఉండాల్సిందే. తాత్కాలిక న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి 2021 ఏప్రిల్ 20వ తేదీన తీర్పులో సుప్రీంకోర్టు కొన్ని షరతులు విధించింది. కానీ ఆ తర్వాత ఆనాటి ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్ (మరో రిటైర్డ్ సిజెఐ),జస్టిస్ సూర్యకాంత్ (ప్రస్తుత సిజెఐ)లు కొన్ని షరతులను సడలించారు. పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను రెండు లేదా మూడు సంవత్సరాలపాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి తాత్కాలిక న్యాయమూర్తులుగా నియమించుకోవచ్చునని మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే ఆదేశించారు. కానీ ఒక షరతు ప్రకారం ఏ హైకోర్టులోనైనా న్యాయమూర్తులు 80 శాతం మేరకు నియామకాలు జరిగి ఉంటే అలాంటి చోట్ల మాత్రం తాత్కాలిక న్యాయమూర్తుల నియామకాలకు అవకాశం ఉండదు. మరో షరతు ప్రకారం తాత్కాలిక న్యాయమూర్తులు వేరుగా ధర్మాసనంలో కూర్చుని కేసులు పరిష్కరించవచ్చు. ఈ షరతులను ఈ విధంగా సడలించిన తర్వాత మొదటి షరతును తాత్కాలికంగా చెల్లుబాటు కాకుండా పక్కకునెట్టారు. ప్రతి హైకోర్టూ పరిస్థితులకు అనుగుణంగా ఇద్దరు లేదా ఐదుగురు తాత్కాలిక న్యాయమూర్తులను నియమించుకోవచ్చునని ధర్మాసనం తెలియజేసింది. ఐతే ఈ నియామకాలు ప్రస్తుతం కోర్టులో ఉన్న న్యాయమూర్తుల నియామకాల్లో 10 శాతం మించకూడదు. పదవిలో ఉన్న న్యాయమూర్తి పక్కనే కూర్చుని ఈ తాత్కాలిక న్యాయమూర్తులు కేసుల పరిష్కారానికి సహకరిస్తారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి వీరు ఉపయోగపడతారని సుప్రీంకోర్టు ఉత్తర్వు చెబుతున్నది. ఏ హైకోర్టు న్యాయమూర్తి అయినాగానీ, ఏ సమయంలోనైనాగానీ రాష్ట్రపతి ముందస్తు సమ్మతితో మాజీ న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేయడం ద్వారా నియామకాలు చేసుకోవచ్చు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## స్టోన్ క్వారీలో రాళ్లు కుప్పకూలి ఇద్దరి మృతి

**భువనేశ్వర్:** ఒడిశాలో డెంకన్‌జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. దెంకనల్ జిల్లాలో ఒక అనధికార స్టోన్ క్వారీ వద్ద రాళ్లు కుప్పకూలి కనీసం ఇద్దరు వ్యక్తులు మరణించి ఉంటారని ఆదివారంనాడు అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దుర్ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. దెంకనల్ జిల్లా మోతంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామం వద్ద ఉన్న స్టోన్ క్వారీ నుండి కొంతమంది కార్మికులు రాతి తవ్వకాలు, అన్వేషణ కోసం డ్రిల్లింగ్ చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుందని వారు తెలియజేశారు. కాగా దీనికి సంబంధించి కచ్చితమైన కారణమేమిటన్నది ఇప్పటి వరకూ తెలియ రాలేదని, స్థానిక అగ్నిమాపక సర్వీస్ బృందాలు, ఒడిశా డిసాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఒడిఆర్ఎఎఫ్), డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలికి చేరుకుని రక్షణచర్యలు చేపట్టాయని ఒక అధికారి చెప్పారు. దెంకనల్ కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పాటిల్, ఎస్‌పి అభినవ్ సోంకర్ సంఘటనా స్థలికి హుటాహుటిన చేరుకుని రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. సమాచారం ప్రకారం కేవలం ఇద్దరి మృతదేహాలు దొరికాయని చెప్పారు.

## సంక్రాంతికి తమిళనాడు ప్రభుత్వం బంఫర్ ఆఫర్

### ప్రజల ఖాతాల్లో రూ.3000 జమ!




**చెన్నై :** పొంగల్ కానుకగా తమిళనాడు ప్రభుత్వం బంఫర్ ఆఫర్‌ను ప్రకటించింది. రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.3000 నగదు జమచేయనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వం ప్రకటించిన ఈ కానుకతో దాదాపు 2.22 కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. సాధారణంగా తమిళనాడులో ప్రతి సంవత్సరం పొంగల్ పండగ సందర్భంగా ఆడవాళ్లకు చీరలు, మగవారికి దోవతులు, రూ.2000 నుంచి రూ.2500 వరకు నగదు అందిస్తుంది. అయితే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని సంవత్సరాల నుంచి అందించడం లేదు. తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, అక్కడి ప్రభుత్వం ప్రజలకు పొంగల్ కానుకతో పాటు నగదు కూడా అందించనుందని ఇదివరకు ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వం ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ప్రజలు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకోవాలని తమిళనాడు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అయితే శ్రీలంక తమిళ పునరావాస శిబిరాల్లో నివసిస్తున్న కుటుంబాలకు కూడా ఈ ప్యాకేజీ వర్తించనుంది. దీని ద్వారా కిలో బియ్యం, కిలో చక్కెర, చెరకు గడలను ప్రభుత్వం అందించనుంది. కాగా, పొంగల్ కానుకగా ప్రజలకు అందించే చీరలు, దోవతీలు అన్ని జిల్లాలకు ఇప్పటికే చేరుకున్నాయి. పొంగల్‌కు ముందే రేషన్ షాపుల ద్వారా ప్రజలకు వీటిని అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన టోకెన్లు జనవరి 8వ తేదీ నుంచి అందించనున్నట్లు సమాచారం. అయితే ఈ పథకం కోసం తమిళనాడు ప్రభుత్వం రూ.6936కోట్ల నిధులను కేటాయించింది.

## ఐదు రాష్ట్రాలు, యుటిలకు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలు

### అసోం అసెంబ్లీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా ప్రియాంకాగాంధీ నియామకం

**గువాహటి/న్యూఢిల్లీ:** అసోంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఇప్పటి నుంచే ఎన్నికలు కసరత్తును ప్రారంభించింది. అందులో భాగంగా అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ప్రధాన కార్యదర్శి (సంస్థ) కెసి వేణుగోపాల్ శనివారం రాత్రి ప్రకటించారు. రానున్న రాష్ట్ర ఎన్నికలలో పోటీ చేయడానికి అభ్యర్థుల జాబితాలను ఖరారు చేయడానికి అసోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలకు నలుగురు సభ్యుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు పార్టీ విడుదల చేసిన కాంగ్రెస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎఐసిసి ప్రధాన



కార్యదర్శి, పార్లమెంటేరియన్ అయిన ప్రియాంకను అసోం కమిటీకి చైర్‌పర్సన్‌గా నియమించారు. ఇక్కడ కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసి బిజెపిని గద్దె దించి అధికారాన్ని చేపట్టాలని చూస్తోంది. ఆమె సన్నిహితులు, లోక్‌సభ ఎంపిలు అయిన ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలక, సిరివెల్ల ప్రసాద్‌తో పాటు అసోం స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా నియమించబడ్డారని కాంగ్రెస్ ఆ ప్రకటనలో తెలిపింది. కేరళకు స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మధుసూదన్ మిస్త్రీ నాయకత్వం వహిస్తుండగా, తమిళనాడు, పుదుచ్చేరిలకు మాజీ ఉప ముఖ్యమంత్రి టి ఎస్ సింగ్ దేవ్ నాయకత్వం వహించనున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు స్క్రీనింగ్ కమిటీకి పార్టీ సీనియర్ నాయకుడు బి కె హరిప్రసాద్ నాయకత్వం వహిస్తారు. పశ్చిమ బెంగాల్ ప్యానెల్‌లోని ఇతర సభ్యులలో మొహమ్మద్ జావేద్, మమతా దేవి, బి పి సింగ్ ఉన్నారు. రాజ్యసభ ఎంపిలు సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి అభిషేక్ దత్‌తో పాటు కేరళకు స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా ఉంటారు. తమిళనాడు, పుదుచ్చేరిలకు పార్టీ నాయకులు యశోమతి ఠాకూర్, జి సి చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ స్క్రీనింగ్ ప్యానెల్ సభ్యులుగా ఉంటారు. ప్రధాన కార్యదర్శులు/ఇన్‌చార్జులు, పిసిసి అధ్యక్షులు, సిఎల్‌పి నాయకులు, ఆయా రాష్ట్రాలకు జనరల్ సెక్రటరీలకు అనుబంధంగా ఉన్న ఎఐసిసి కార్యదర్శులు కూడా వారి రాష్ట్రాల స్క్రీనింగ్ కమిటీలకు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారని కూడా ప్రకటనలో పేర్కొంది. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అసోంలలో అసెంబ్లీ ఎన్నికలు రాబోయే కొన్ని నెలల్లో జరగనున్నాయి. 126 మంది సభ్యులు కలిగిన అసోం అసెంబ్లీకి ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

## 'ఒలింపిక్స్-2036' క్రీడల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** 'ఒలింపిక్స్2036' క్రీడల నిర్వహణకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందని చెప్పారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని ప్రధాని గుర్తుచేశారు. అండర్17 ఫిఫా వరల్డ్‌ప్, హాకీ వరల్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ క్రీడతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరితో సాధ్యం కాదనే విషయాన్ని ఈ వాలీబాల్ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామని చెప్పారు. కాగా జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యి మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు చెబుతున్నారు.

## ఏకగ్రీవ వార్డుల్లో మళ్లీ ఎన్నికలు పెట్టాలి

### శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే డిమాండ్

### దేశంలో ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యం ఆక్రమించుకున్నట్లుగా ఉందని ఆందోళన




**ముంబయి:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కొన్ని వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. అయితే ఈ వార్డులలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే డిమాండ్‌చేశారు. తన బంధువులు, మిత్రపక్ష పార్టీ మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థాక్రేతో కలిసి ఆదివారం ఉద్ధవ్ థాక్రే మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యం ఆక్రమించుకున్నట్లుగా వాతావరణం ఉందని ఉద్ధవ్ ఆరోపించారు.ముంబయి మున్సిపల్ ఎన్నికల కోసం తమ కూటమి మేనిఫెస్టోను వారు ఆవిష్కరించారు. మరాఠీ భాషను గౌరవించాలని, ముంబయి, రాష్ట్రంలోని ఇతర నగరాల మేయర్ మరాఠీ వారే అవుతారని రాజ్ థాక్రే స్పష్టం చేశారు. తన ప్రభుత్వం కూలిపోయి, ఏక్‌నాథ్ షిండే రాష్ట్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుండి (జూన్ 2022లో), బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సంపదను కాంట్రాక్టర్ల కోసం దుబారా చేస్తున్నారని ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. బిఎంసి వ్యయ బడ్జెట్ రూ. 15,000 కోట్లు అయితే, వివిధ పనుల కోసం కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ మొబిలైజేషన్ రూపంలో ఇవ్వాల్సిన మొత్తం రూ. 3 లక్షల కోట్లు ఉందని ఆరోపించారు. ఇది రూ. 3 లక్షల కోట్ల కుంభకోణం అని, ఆ కిక్‌బ్యాక్ డబ్బును మున్సిపల్ ఎన్నికల కోసం వాడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఈనెల 15న జరగనున్న మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి, దాని మహాకూటమి మిత్రపక్షాలు 68 స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో ఓట్లను దొంగిలించిన తర్వాత, ఇప్పుడు అధికార పార్టీలు అభ్యర్థులను కూడా దొంగిలిస్తున్నాయని ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. 'రాష్ట్ర ఎన్నికల సంఘానికి ధైర్యం ఉంటే, అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన చోట ఎన్నికలను రద్దు చేసి, ఆ వార్డులలో మళ్లీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలి' అని శివసేన (యుబిటి) అధినేత సవాల్ విసిరారు. అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవడం అనేది ఓటర్లకు, ముఖ్యంగా జెన్‌జెడ్ తరానికి తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని నిరాకరించడమే అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని, బిజెపి తప్పుడు సంప్రదాయాన్ని నెలకొల్పుతోందని ఎంఎన్ఎస్ అధినేత రాజ్ థాక్రే పాలకపక్షానికి హెచ్చరించారు. భవిష్యత్‌లో తమ వారసులు మరింత అధునాతన పద్ధతిలో ఇలాంటి ఎత్తుగడలను అనుసరించినప్పుడు అధికార పార్టీ ఫిర్యాదు చేయకూడదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన ఇలాంటి సందర్భాల్లోనే బిజెపి సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, దీనిపై బిజెపి వైఖరి ఏమిటో చెప్పాలని ఎంఎన్ఎస్ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఏకగ్రీవ విజయాల విషయంలో బిజెపి దూకుడుగా వ్యవహరిస్తోంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చంద్రపూర్‌లో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతూ, ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్లినా ప్రజల తీర్పే నెగ్గుతుందని అన్నారు. 'వారు కచ్చితంగా కోర్టుకు వెళ్లవచ్చు, కానీ ప్రజల కోర్టు మమ్మల్ని ఎన్నుకుంది. వారు (ప్రతిపక్షాలు) కోర్టుకు వెళ్లినా, కోర్టులో ప్రజల తీర్పే నెగ్గుతుంది' అని ఫడ్నవీస్ స్వతంత్ర అభ్యర్థులు, ముస్లిం అభ్యర్థుల ఏకగ్రీవ విజయాలపై ప్రతిపక్షాల మౌనాన్ని ప్రశ్నిస్తూ అన్నారు. పౌర ఎన్నికల కోసం అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం, నామినేషన్ల ప్రక్రియలో జోక్యం చేసుకోవడం మరియు ఈ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని తారుమారు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌ను ఉద్ధవ్ థాక్రే కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 'నార్వేకర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి. స్పీకర్‌గా అతను ఏ పార్టీకి చెందినవాడు కాదు. ఎలాంటి పక్షపాతం లేకుండా పని చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది' అని థాక్రే అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. జనవరి 15న 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగే ఎన్నికల కోసం మొత్తం 15,931 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎస్ఇసి డేటా ప్రకారం, మొత్తం 33,247 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో పరిశీలన తర్వాత 24,771 చెల్లుబాటు అయ్యాయి. చెల్లుబాటు అయిన వాటిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసిన గడువులోగా 8,840 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ 29 మున్సిపల్ కార్పొరేషన్లలోని 893 వార్డులలో విస్తరించి ఉన్న 2869 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 227 స్థానాలు ఉన్న ముంబై మినహా, మిగిలినవన్నీ బహుళ సభ్య వార్డులే.

## బెంగాలీ కార్మికుల పట్ల వివక్ష

### కొన్ని రాష్ట్రాల్లో గుర్తింపు పత్రాలు అడుగుతున్నారని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ ఆందోళన

### సమాంతర పోలీస్ వ్యవస్థ నడుస్తోందని ఆరోపణ



**సంబల్‌పూర్ :** కొన్ని రాష్ట్రాల్లో బెంగాలీ కార్మికుల పట్ల చూపుతున్న వైఖరిపై కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఒడిశాలోని సంబల్‌పూర్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వలస కార్మికులను కలిశారు. కొన్ని రాష్ట్రాల్లో బెంగాలీ కార్మికులను ప్రైవేట్ వ్యక్తులు వారి గుర్తింపు పత్రాలను చూపించమని అడుగుతున్నారని ఆరోపిస్తూ, అక్కడ జరుగుతున్న 'సమాంతర పోలీసు వ్యవస్థ'పై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పద్ధతిని ఆపాలని ఆయన చట్ట అమలు సంస్థలను కోరారు. పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలోని బహరంపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఐదుసార్లు మాజీ ఎంపిగా పనిచేసిన చౌదరి, వలస కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.'నేను ఇక్కడ కొంతమంది బెంగాలీ వలస కార్మికులను కలిశాను. కాంగ్రెస్ వారికి అండగా ఉంటుందని చెప్పాను. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా వారికి తెలియజేశాను' అని చౌదరి విలేకరులతో అన్నారు.గత నెలలో సంబల్‌పూర్‌లో బీడి విషయంలో జరిగిన వాగ్వాదం తర్వాత ముర్షిదాబాద్‌లోని జంగీపూర్‌కు చెందిన 30 ఏళ్ల బెంగాలీ మాట్లాడే వలస కార్మికుడు జ్యువెల్ రాణా హత్యపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారు రాణాను బంగ్లాదేశ్ చొరబాటుదారుడిగా అనుమానించి, అతని ఆధార్ కార్డు చూపించమని అడిగారని కూడా ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణను స్థానిక పోలీసులు ఖండించారు.అధీర్ స్పందిస్తూ 'కొన్ని రాష్ట్రాల్లో సమాంతర పోలీసు వ్యవస్థ నడుస్తోంది, ప్రైవేట్ వ్యక్తులు వలస కార్మికులను వారి గుర్తింపు పత్రాలను చూపించమని అడుగుతున్నారు. దీనిని ఆపాలి. ఒక వలస కార్మికుడు బంగ్లాదేశ్ చొరబాటుదారుడు కావచ్చనే అనుమానంతో గూండాలు ఎవరినీ వేధించకుండా పోలీసులు చూడాలి' అని చౌదరి అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ మాజీ నాయకుడు అయిన ఆయన, ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఒడిశాకు చెందిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సంబల్‌పూర్ ఎంపి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాలని తాను యోచిస్తున్నట్లు చౌదరి చెప్పారు. 'వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న బెంగాలీ వలస కార్మికుల భద్రత కోసం నేను పోరాడతాను' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులను కోరారు. సంబల్‌పూర్‌కు తన ఒకరోజు పర్యటన సందర్భంగా చౌదరి నార్తర్న్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హిమాన్షు కుమార్ లాల్, సంబల్‌పూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ముఖేష్ కుమార్ భమూలను కూడా కలిశారు. ఈ ఏడాది అసెంబులీ ఎన్నికలు జరగనున్న పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులతో కలిసి, చౌదరి ఐంతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధనిపాలిని సందర్శించి, కొంతమంది బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను కలిశారు. గతేడాది డిసెంబర్ 24న రాణాను నరికి చంపిన ప్రదేశాన్ని కూడా వారు సందర్శించారు. వలస కార్మికులతో సంభాషణ సందర్భంగా, చౌదరి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒడిశాలో తమ భద్రత గురించి ఆందోళన చెందవద్దని వారికి చెప్పారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రజల మధ్య శతాబ్దాల నాటి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని చౌదరి అన్నారు. పశ్చిమ బెంగాల్ నుండి వేలాది మంది కార్మికులు ఒడిశాలో పనిచేస్తున్నారని, అదేవిధంగా ఒడిశా నుండి కూడా పశ్చిమ బెంగాల్‌లో పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. 'అయితే, ఇప్పుడు బంగ్లాదేశీ చొరబాటు పేరుతో పరిస్థితి ప్రతికూలంగా మారుతోంది. పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన వలస కార్మికులు అఘాయిత్యాలు, హింస మరియు హత్యలకు గురవుతున్నారు. ఇది రెండు రాష్ట్రాలకు ఆమోదయోగ్యం కాదు' ఆయన అన్నారు. వలస కార్మికులు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తారని, వారి ఉద్దేశాన్ని అనుమానించకూడదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'దయచేసి బెంగాలీ మాట్లాడే ప్రజలందరినీ బంగ్లాదేశీయులుగా పరిగణించవద్దు' అని ఆయన అన్నారు.

## మహిళ దారుణ హత్య

### చెట్టుకు ఉరివేసుకుని నిందితుడూ ఆత్మహత్య

**కార్వార్:** కర్నాటకలో దళిత మహిళ దారుణ హత్యకు గురైంది. ఉత్తర కన్నడ జిల్లాలోని యెల్లాపూర్ పట్టణంలో శనివారం 30 ఏళ్ల దళిత మహిళను ఆమెకు తెలిసిన వ్యక్తే రోడ్డుపైనే కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు తెలిపారు. అయితే హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న రఫీక్ ఇమామ్‌సాబ్ ఆదివారం యెల్లాపూర్ సమీపంలోని అడవిలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడని పోలీసు సూపరింటెండెంట్ దీపన్ ఎం ఎన్ పిటిఐకి తెలిపారు. ఈ ఘటన పట్టణంలో మత ఉద్రిక్తతలకు దారితీసింది. పలు హిందూ సంస్థలు ఆదివారం యెల్లాపూర్ బంద్‌కు పిలుపునిచ్చాయి. వారు మహిళ హత్యను 'లవ్ జిహాద్' కేసుగా అభివర్ణించారు. హత్యకు గురైన మహిళను యెల్లాపూర్‌లోని కలమ్మ నగర్‌కు చెందిన రంజిత భానసోడే (30)గా గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన రఫీక్, మహిళ హత్య కేసులో ప్రధాన నిందితుడు. రఫీక్, రంజిత ఇద్దరూ పాఠశాల రోజుల నుండి స్నేహితులని పోలీసులు తెలిపారు. 'ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, నిందితుడు ఆ మహిళను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె నిరాకరించడంతో, అతను బహిరంగంగా ఆమెపై కత్తితో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి' అని ఒక పోలీసు అధికారి తెలిపారు. శనివారం మధ్యాహ్నం రంజిత తన కార్యాలయం నుండి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రంజిత సుమారు 12 సంవత్సరాల క్రితం మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన సచిన్ కటేరాను వివాహం చేసుకుందని, వారికి 10 ఏళ్ల కుమారుడు ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆమె విడిగా నివసిస్తూ, యెల్లాపూర్‌లోని తన కుటుంబంతో కలిసి ఉంటోందని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన సహాయకురాలిగా పనిచేస్తోందని పోలీసులు చెప్పారు.

## గాంధీ రాముడని... బిజెపి ప్రచారానికి వాడుకుంటోంది

### వారి ఆదర్శాలను విస్మరిస్తోంది సుర్జేవాలా విమర్శ

**భువనేశ్వర్:** గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎంజిఎన్ఆర్ఇజిఏ స్థానంలో 'విబి–జి రామ్ జి'ని తీసుకురావడంపై నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేత రణదీప్ సింగ్ సుర్జేవాలా తీవ్రంగా విమర్శించారు. బిజెపి మహాత్మా గాంధీని గానీ, శ్రీరాముడిని గానీ గౌరవించదని, వారిని కేవలం ప్రచారానికి వాడుకుంటుందని సూర్జేవాలా ఆరోపించారు. శనివారం భువనేశ్వర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్జేవాలా మాట్లాడుతూ యుపిఎ హయాంలోని ఎంజి నరేగా స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టాన్ని తీసుకురావడం వల్ల సుమారు 50 కోట్ల మంది పేదల జీవనోపాధిపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా, ప్రచారం కోసం మహాత్మా గాంధీ కళ్ళజోడును వాడుకున్నారు కానీ ఆయన ఆదర్శాలను విస్మరించరని, అదే



విధంగా, బిజెపి శ్రీరాముడి పేరుతో అధికారాన్ని చేజిక్కించుకుంది కానీ ఆయన ఆదర్శాలను విస్మరించిందని మండిపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) స్థానంలో కొత్త చట్టం తీసుకురావడం వల్ల సుమారు 12.5 కోట్ల మంది పేద, గిరిజన, దళిత, వెనుకబడిన తరగతుల ప్రజలపై నేరుగా ప్రభావం పడిందని ఆయన పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులను కూడా కలుపుకుంటే, బిజెపి ప్రభుత్వ నిర్ణయం మొత్తం 50 కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేగా ఒక డిమాండ్ ఆధారిత వ్యవస్థ అని, ఏ కార్మికుడైనా పంచాయతీని సంప్రదించి పని కోరవచ్చని సూర్జేవాలా చెప్పారు. నరేగా కింద కొన్ని రోజుల్లో పని కల్పించకపోతే, వేతనాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే, కొత్త చట్టం ప్రకారం, ప్రతిదీ ఢిల్లీ నుండే నిర్ణయించబడుతుందని, ఏ రాష్ట్రానికి, జిల్లాకు లేదా గ్రామానికి ఎంత పని ఇవ్వాలో ఢిల్లీలో కూర్చున్న వారే చెబుతారని పరోంగా మోదీనిద్దేశించి వ్యాఖ్యానించారు. నరేగాకు పూర్తిగా కేంద్రమే నిధులు సమకూర్చేదని, అయితే కొత్త చట్టం కింద రాష్ట్రాలు 40 శాతం ఖర్చును భరించాల్సి ఉంటుందని కాంగ్రెస్ ఎంపి అన్నారు. 'మనకు తెలిసినట్లుగా, రాష్ట్రాలు 40 శాతం నిధులను చెల్లించలేవు, కాబట్టి పేదలకు పని కల్పించాలనే ఆలోచన వాటంతటవే ఆగిపోతాయి' అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అజయ్ కుమార్ లల్లు మాట్లాడుతూ, పార్టీ జనవరి 10న ఒడిశాలో 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్'ను ప్రారంభించనుందని, ఇది ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుందని తెలిపారు.

## ఫరీదాబాద్ మహిళ గ్యాంగ్ రేప్ సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మహిళా కమిషన్

**ఫరిదాబాద్:** ఫరీదాబాద్‌లో 25 ఏళ్ల మహిళపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనను హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ ఆదివారం సుమోటోగా స్వీకరించిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై వివరణాత్మక నివేదికను, పోలీసులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి ఫరీదాబాద్ పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తాను కమిషన్ చైర్మన్ రేణు భాటియా అడిగి తెలుసుకున్నారని వారు చెప్పారు. 'నేను బాధితురాలి కుటుంబంతో మాట్లాడాను. ఆమెకు అవసరమైన అన్ని సహాయాన్ని అందిస్తాము' అని భాటియా అన్నారు. ఇదిలా ఉండగా, బాధితురాలికి తన ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న డాక్టర్ అమిత్ యాదవ్ మాట్లాడుతూ బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. 'ఆమె ముఖంపై ఏర్పడిన లోతైన గాయాలను సరిచేయడానికి శనివారం ముఖానికి శస్త్రచికిత్స జరిగిందని, మహిళ అంగీకరించిన తర్వాత, ఆమె విరిగిన కుడి భుజానికి శస్త్రచికిత్స చేస్తామని చెప్పారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధితురాలు సోమవారం సాయంత్రం ఫరీదాబాద్‌లోని సెక్టార్ 23లో ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు, ఆమె ఎన్ఐటి 2 చౌక్ వరకు ఆటోరిక్షాలో వెళ్లి, ఆ తర్వాత మెట్రో చౌక్ వరకు నడిచి వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో తన ఇంటికి వెళ్లడానికి ఆటో కోసం అక్కడ నిలబడి ఉండగా, ఒక ప్రైవేట్ ఆసుపత్రి అ ంబులెన్స్ డ్రైవర్‌తో సహా ఇద్దరు నిందితు లు ఆ మహిళకు లిఫ్ట్ ఇస్తామని చెప్పారని వారు తెలిపారు. అయితే, 25 ఏళ్ల బాధితురాలిని ఆమె గమ్యస్థానానికి తీసుకెళ్లకుండా, వారు గురుగ్రామ్ వైపు వెళ్తూ కదులుతున్న వాహనంలోనే ఆమెపై సామూహిక అత్యాచారం చేశారని వారు ఆరోపించారు. రాత్రంతా ఆమెను వాహనంలో తిప్పి, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఫరీదాబాద్‌లోని రాజా చౌక్ సమీపంలో వాహనం నుండి బయటకు తోసేశారని పోలీసులు తెలిపారు. బాధితురాలిని తర్వాత ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చినట్లు పోలీసులు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితులు, ఒకరు మధుర వాసి కాగా, మరొకరు ఝాన్సీ వాసి, వారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు.

## అగ్నిప్రమాదంలో ద్విచక్ర వాహనాలు దగ్ధం

**త్రిస్సూర్(కేరళ) :** త్రిస్సూర్ రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 500 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయని అగ్నిమాపక, రెస్క్యూ సర్వీస్ అధికారులు తెలిపారు. ఉదయం 6.20 గంటల ప్రాంతంలో పెయిడ్‌పార్కింగ్ షెడ్‌లో మంటలు చెలరేగాయని, సుమారు 6.40 గంటలకు సహాయం కోసం కాల్ వచ్చిందని అధికారి తెలిపారు. కవర్ కప్పి పార్క్ చేసిన ఒక ద్విచక్ర వాహనంపై పడిన విద్యుత్ తీగ నుండి వచ్చిన నిప్పురవ్వే అగ్నిప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. ఆ షెడ్‌లో సుమారు 500 ద్విచక్ర వాహనాలు పార్క్ చేసి ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. వాటిలో అధిక భాగం ఈ ఘటనలో కాలిపోయాయి. ఐదు అగ్నిమాపక యంత్రాలను మోహరించామని, ఉదయం 7.45 గంటల ప్రాంతంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చామని అధికారులు తెలిపారు. మంటలు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలకు వ్యాపించకుండా, మరింత నష్టం జరగకుండా నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఒక లోకోమోటివ్ పార్క్ చేసి ఉన్నప్పటికీ, దానికి పెద్దగా నష్టం జరిగినట్లు రైల్వే అధికారులు ధృవీకరించలేదని అధికారి తెలిపారు. ద్విచక్ర వాహనాలతో పాటు, టిన్ షీట్లతో కప్పబడిన మొత్తం షెడ్ కూడా అగ్నిప్రమాదంలో దెబ్బతిందని అధికారి చెప్పారు. అగ్నిప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి పోలీసులు, రైల్వే అధికారులు దర్యాప్తు ప్రారంభించారని అగ్నిమాపక అధికారులు తెలిపారు. త్రిస్సూర్ వెస్ట్ పోలీసులు అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం, అగ్నిప్రమాదంలో సుమారు 500 ద్విచక్ర వాహనాలతో పాటు, రైల్వే స్టేషన్ పశ్చిమ వైపున పార్కింగ్ సౌకర్యాన్ని నిర్వహించే కాంట్రాక్ట్ పొందిన అశ్వతి ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన పార్కింగ్ ఫీజు ప్రింటింగ్ యంత్రం కూడా దగ్ధ



మైంది. ఇది కాకుండా, అశ్వతి ఎంటర్‌ప్రైజెస్ ఉద్యోగులకు చెందిన రెండు మొబైల్ ఫోన్లు, రూ. 10,000 నగదు కూడా అగ్నిప్రమాదంలో కాలిపోయాయని ఎఫ్ఐఆర్ పేర్కొంది.రాష్ట్ర పోలీసు చీఫ్ రవాడ ఎ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. 'పార్కింగ్ ప్రాంతంలోని ఉద్యోగుల వాంగ్మూలాల ఆధారంగా ప్రాథమిక అంచనా వేశాం. అసిస్టెంట్ కమిషనర్, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో సహా అదనపు పోలీసు సూపరింటెండెంట్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం.' అని ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సంఘటన తర్వాత, కేరళ అంతటా చెల్లింపు పార్కింగ్ సౌకర్యాల వద్ద అగ్నిమాపక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. 'పోలీస్ సూపరింటెండెంట్ (రైల్వే) దీనికి బాధ్యత వహించారు. ఆయన ఈ విషయాన్ని పరిశీలించి నివేదిక సమర్పిస్తారు. అదనంగా, స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్)తో కూడిన భద్రతా యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి ఉమ్మడి ప్రయత్నం జరుగుతుంది' అని చంద్రశేఖర్ అన్నారు. విద్యుత్ లైన్ నుండి నిప్పురవ్వ వచ్చి అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమిక ప్రకటనలు సూచించాయని, అయితే దానిని నిర్ధారించడానికి మరింత దర్యాప్తు అవసరమని ఆయన అన్నారు. రెవెన్యూ మంత్రి కె రాజన్ కూడా సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు.




# సాహిత్య విశ్వరూపం..

సాహిత్య ప్రక్రియల్లో శరవేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను.. ప్రమాణాలను పరిశీలిస్తే, ఒక నిర్దిష్ట ఆకృతి లేదా ఒకే ప్రక్రియకు రచనలు పరిమితం కావడం లేదని, ఏదో ఒక చట్రంలో ఇరుక్కొని అల్లాడడం లేదని స్పష్టమవుతున్నది. సాహిత్య విశ్వరూపం సాక్షాత్కరిస్తున్నది. గత ఏడాది వచ్చిన ఎన్నో రచనలు ఈ విషయాన్ని రుజువు చేశాయి. కొత్త సంవత్సరంలో సాహిత్యం మరిన్ని మార్పులకు లోనవుతుందనడంలో అనుమానం లేదు. రాజకీయపరంగా ప్రపంచం ముక్కచెక్కలుగా విడిపోయి, యుద్ధాల్లో మునిగితేలుతున్నప్పటికీ, సాహితీపరంగా వసుధైక కుటుంబంగా పరిఢవిల్లుతున్నది. నేటి సాహిత్యం విభిన్న స్వరాల సమ్మేళనం, అనేక భావోద్వేగాల ప్రతిఫలనం, ఆధునిక సాంకేతిక పరిణామాలతో ముడిపడిన సృజనాత్మక వ్యక్తీకరణ. మానవ సమాజం ఎదుర్కొంటున్న మార్పులు, ఒత్తిడులు, ఆశలు, భయాలు వంటి ఎన్నో అంశాలన్నీ కలిసి ఈ కాలపు సాహిత్యానికి ఒక ప్రత్యేక స్వరూపాన్ని ఇచ్చాయి. గత దశాబ్దాల్లో సాహిత్యం అనేక సంక్షోభాలను చూసింది. మహమ్మారి అనంతర మానసిక అలసట, రాజకీయ అస్థిరత, వాతావరణ మార్పుల భయం, కృత్రిమ మేధస్సు ఎదుగుదల వంటివి సాహిత్యంపై లోతైన ప్రభావం చూపాయి. ఇప్పుడు రాబోయే రచనల్లో కేవలం ఆందోళన మాత్రమే కాదు, దానికి ప్రతిస్పందనగా ఆశ, స్వస్థత, మానవీయత కూడా ప్రధానంగా దర్శనమిస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. ప్రక్రియల మధ్య అంతరాలను చెరిపివేయడాన్ని సరికొత్త సాహిత్యంలో చూడవచ్చు. ఒకప్పుడు సాహిత్యాన్ని 'ఇది ప్రేమ నవల, ఇది థ్రిల్లర్, ఇది సైన్స్ ఫిక్షన్' అంటూ స్పష్టంగా వర్గీకరించేవారు. సరిహద్దులు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ సరిహద్దులు మసకబారాయి. ఒకే కథలో ప్రేమ కూడా ఉంటుంది, రహస్యం కూడా ఉంటుంది, సామాజిక విమర్శ కూడా ఉంటుంది, కొన్నిసార్లు సైన్స్ ఫిక్షన్ లేదా చారిత్రక నేపథ్యమూ కలుస్తుంది. పాఠకుడు కేవలం ఒకే అనుభూతిని కాకుండా, అనేక అనుభూతులను ఒకే రచనలో పొందాలని కోరుకుంటున్నాడు. రచయిత కూడా ఆ ఆశయాన్ని గుర్తించి కథనాన్ని బహుళస్థాయిల్లో నిర్మిస్తున్నాడు. ఈ ప్రక్రియల మేళవింపు నేటి సాహిత్యానికి ప్రధాన లక్షణంగా మారింది. అయితే, అంతకంటే ఎక్కువగా నేటి సాహిత్యం సమాజం పెనవేసుకుపోయింది. విడదీయరాని బంధం లో నిలిచి ఉంది. అది కేవలం సౌందర్యానుభూతిని అందించే కళామాధ్యమంగా మాత్రగాక, అన్యాయాలపై ప్రశ్నలు వేసే, మౌనంగా ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చే, మార్పు కోసం మనసులను కదిలించే శక్తివంతమైన ఆయుధంగా కూడా రూపాంతరం చెందుతున్నది. ఈ సందర్భంలో ప్రగతిశీల, సామ్యవాద ధోరణులు నేటి సాహిత్యంలో ప్రధానంగా సామాజిక న్యాయం, సమానత్వం, వ్యవస్థాగత మార్పు కోసం ఇచ్చే పిలుపుగా కనిపిస్తున్నాయి. రచయితలు అధికార నిర్మాణాలను విమర్శిస్తూ, అట్టడుగున పడివున్న వర్గాల పక్షాన నిలబడి, మరింత సమానమైన సమాజాన్ని ఊహిస్తూ తమ కలాన్ని వినియోగిస్తున్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు, కుల వివక్ష, లింగ పక్షపాతం, జాతి ఆధారిత అన్యాయాలు, రాజకీయ అవినీతి వంటి సమస్యలను సాహిత్యం అద్దంలా ప్రతిబింబిస్తున్నది. ఈ ప్రతిబింబం అలంకారికమైనది కాదు. ఎందుకంటే, అది వాస్తవికతతో నిండినది. పీడితుల జీవితాలను, వారి దైనందిన పోరాటాలను నిజాయితీగా చిత్రించడం ద్వారా పాఠకుడిలో అవగాహనను, ఆలోచనను పెంపొందించడమే ఈ తరహా సాహిత్య లక్ష్యంగా గోచరిస్తున్నది. సమాజంలోని లోపాలను చూపించడం ద్వారా అవి సహజమైనవో, మారనివో కాదని, మార్పుకు లోబడి ఉన్నవేనని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇలాంటి ప్రగతిశీల సాహిత్యం సంక్లిష్టమైన సామాజిక, రాజకీయ సమస్యలను మానవీయంగా మారుస్తున్నది. గణాంకాలు, సిద్ధాంతాలు దూరంగా అనిపించిన చోట, కథలు, కవితలు, పాత్రలు మన హృదయాలను తాకుతాయి. ఒక కార్మికుడి బాధ, ఒక రైతు నిరాశ, ఒక మహిళ ఎదుర్కొనే వివక్ష, ఒక దళితుని అవమానం... ఇవన్నీ వ్యక్తిగత అనుభవాలుగా పాఠకుడి మనసులో నిలుస్తాయి. ఈ భావోద్వేగ అనుసంధానమే అన్యాయాన్ని ప్రశ్నించే తొలి అడుగు. ఇతరుల బాధను మనదిగా అనుభవించినప్పుడే సమాజాన్ని మార్చాలనే తపన పుడుతుంది. ఇలాంటి రచనలు కేవలం అవగాహన కల్పించడంతోనే ఆగిపోవు. చర్యకు ప్రేరేపిస్తాయి. మనలో చేయగల శక్తిని సృష్టించడమే ఈ రచనల లక్ష్యం. చరిత్రలో కొనసాగిన దాస్యపు అవశేషాలపై తిరుగుబాటు చేసే భావాన్ని, సామాజిక సాధికారతపై విశ్వాసాన్ని ఇది పెంపొందిస్తుంది. చదువరుడు ఒక నిశ్చేష్ట వీక్షకుడిగా కాక, మార్పు ప్రక్రియలో భాగస్వామిగా మారాలని ఇది కోరుకుంటుంది. గత ఏడాది పరఢవిల్లిన ప్రగతిశీల, సామ్యవాద సాహిత్యం ఈ ఏడాది కూడా తన విశ్వరూపాన్ని చూపడం ఖాయం. ఇది అణచివేతకు గురైన వర్గాల గొంతుకలను ముందుకు తీసుకువస్తుంది. కార్మికులు, రైతులు, శ్రామిక వర్గాలు, చారిత్రకంగా వెలివేయబడిన సమూహాలకు సంబంధించిన కథలు ప్రధాన సాహిత్య వేదికలపై స్థానం పొందుతున్నాయి. సంప్రదాయ సాహిత్య వ్యవస్థలు విస్మరించిన జీవిత అనుభవాలను ఈ రచనలు కేంద్రబిందువుగా మారుస్తాయి. దీని ద్వారా సాహిత్యం ఒక వర్గానికే పరిమితం కాకుండా, సమాజం మొత్తానికి చెందిందనే భావన బలపడుతుంది. విమర్శతో పాటు ప్రత్యామ్నాయాలను ఊహించడమూ నేటి సాహిత్య ముఖ్య లక్షణంగా కనిపిస్తున్నది.



సమాన హక్కులు, సహకారం, సమృద్ధి, సామాజిక న్యాయం వంటి విలువల ఆధారంగా నిర్మితమయ్యే భవిష్యత్తు చిత్రాన్ని ఇది మన ముందుంచుతుంది. వనరుల పంచకం, గౌరవంతో కూడిన జీవనం, మానవ సంబంధాల్లో సమానత్వం వంటివి కల్పిత యూటోపియాలుగా కాక, సాధ్యమైన లక్ష్యాలుగా చూపిస్తుంది. ఈ ఊహాశక్తే సమాజాన్ని ముం దుకు నడిపించే ప్రేరణగా మారుతున్నది. నేటి సాహిత్యం ఎక్కువగా సాంస్కృతిక ప్రతిక్రియాశీల శక్తులతో స్పష్టం గా పోరాడుతున్నది. మూఢ విశ్వాసాలు, మౌలికవాదం, సామంతత్వ భావజాలం, సామ్రాజ్యవాద భావజాలం వంటి పాత వ్యవస్థలను ప్రశ్నిస్తూ, ఆధునికత, శాస్త్రీయ దృక్పథం, వలస విముక్తి ఆలోచనలను ప్రోత్సహిస్తున్నది. ఇది కాలానికి వెనుకబడిన ఆలోచనలకు వ్యతిరేకంగా నిలబడి, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తిగా మారుతుంది. ఈ సందర్భంలో ప్రగతిశీలత, సామ్యవాదం మ ధ్య ఒక సూక్ష్మ మైన తేడా కూడా కనిపిస్తుంది. ఆధునిక ప్రగతిశీల సాహిత్యం అవకాశాల సమానత్వంపై ఎక్కువగా దృష్టి పెడుతూ, సంస్కరణాత్మక విధానాలు, చైతన్యవంతమైన ప్రభుత్వ పాత్ర ద్వారా కనీస వేతనం, ఆహార భద్రత, రాజకీయ హక్కులు వంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. మరింత స్పష్టమైన సామ్యవాద దృక్పథం అయితే ఉత్పత్తి సాధనాల సామాజిక స్వామ్యం వంటి మూలభూత మార్పులపై దృష్టి కేంద్రీకరిస్తుంది. అయినప్పటికీ, మనిషికి గౌరవప్రదమైన జీవితం లభించాలన్నదే ఈ రెం డింటి మధ్య అంతర్లీనంగా ఉన్న సమాన లక్ష్యం. ఎన్నో రకాలుగా నేటి సాహిత్యంలో ప్రగతిశీల, సామ్యవాద ధోరణులు నైతిక ఆలోచనకు, సామాజిక మార్పుకు నిరంతర శక్తిగా కొనసాగుతున్నాయి. మానవ జీవనంలోని పోరాటాలు, ఆశలు, మెరుగైన జీవితానికి ఉన్న ఆకాంక్షలు సాహిత్య కేంద్రంలోనే ఉండాలని ఇవి గుర్తుచేస్తున్నాయి. ఈ సాహిత్యం మనలను ప్రశ్నిస్తుంది, కదిలిస్తుంది, మా ర్పు వైపు నడిపిస్తుంది. ఇది ఆహ్వానించ తగిన పరిణామం.

కాగా, ఒకప్పుడు ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన 'ప్రేమ' మరోసారి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. రోజులో ఎక్కువ సమయం యాంత్రికంగా గడిచిపోతున్న తరుణంలో, ప్రేమతత్వం మళ్లీ వేళ్లూనుకుంటున్నది. ప్రేమ సాహిత్యాన్నే ఇటీవలి కాలంలో ఎక్కువ మంది చదువుతున్నారని, అలాంటి పుస్తకాలే ఎక్కువగా అమ్ముడవుతున్నారని ఒక అభిప్రాయం. ప్రేమ రచనలు అంటే కేవలం ఇద్దరి మధ్య సంబంధం మాత్రమే కాదు... అవి మనిషి ఒంటరితనానికి, భయాలకు, ఆత్మవిశ్వాసానికి సంబంధించిన అంశాలు మారాయి. వేగవంతమైన, ఒత్తిడితో నిండిన జీవనశైలిలో పాఠకుడు భావోద్వేగ సాంత్వన కోసం సాహిత్యాన్ని ఆశ్రయిస్తున్నాడు. అందుకే ప్రేమ సాహిత్యం ఒక రకమైన మానసిక విశ్రాంతిని అందించే సాధనంగా మారింది. దీనితో పాటు ఫాంటసీతో కలిసిన ప్రేమ కథలు, అంటే రోమాంటసీ, ఈ కాలంలో అపూర్వమైన ఆదరణ పొందుతున్నాయి. కల్పిత ప్రపంచాలు, మాంత్రిక శక్తులు, బలమైన పాత్రలు, వాటి మధ్య వికసించే ప్రేమ వంటివి పాఠకులను, ముఖ్యంగా యువతను ఆకర్షిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు సైతం ఇలాంటి రచనలను ప్రపంచవ్యాప్తంగా పరిచయడం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రేమ సాహిత్యంతో పాటు దాని లోపలే అనేక ఉపరూపాలు విస్తరించాయి. క్రీడాకారుల జీవితాలను ఆధారంగా చేసుకున్న ప్రేమ కథలు, మానసికంగా క్లిష్టమైన, చీకటి కోణాలను స్పృశించే ప్రేమ కథలు, లింగ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సంబంధాల కథలు ఇప్పుడు ప్రధా న ప్రవాహంలోకి వచ్చాయి. ఒకప్పుడు వి మర్శలకు భయపడి, ఎక్కడో సాహిత్య ప్రపంచ అంచుల్లో ఉన్న కథలు ఇప్పు డు కేంద్రంలో నిలుస్తున్నాయి. ఇది సమాజంలో మారుతున్న విలువలను, సమానత్వంపై పెరుగుతున్న అవగాహనను ప్రతిబింబిస్తుంది. ఇదే సమయంలో థ్రిల్లర్, మానసిక సస్పెన్స్ సాహిత్యం తన స్థిరమైన పాఠక వర్గాన్ని కొనసాగిస్తోంది. నేరం, రహస్యం, మానవ మనస్సులోని చీకటి మూలాలు ఎప్పంటి మాదిరిగానే పాఠకుడిని ఆకర్షిస్తూనే ఉంటాయి. అయితే నేటి థ్రిల్లర్ కథలు కేవలం హత్యలు లేదా మిస్టరీలకే పరిమితం కావడం లేదు. అవి కుటుంబ సంబంధాలు, గృహహింస, గుర్తింపు సంక్షోభం వంటి అంశాలను లోతుగా తవ్వుతున్నాయి. దీనితో పాటు సాంకేతికత ఆధారంగా రూపొందిన కథలు, ము ఖ్యంగా కృత్రిమ మేధస్సు, డేటా నిఘా, డిజిటల్ నియంత్రణ వంటి అంశాలతో కూడిన కథలు, పాఠకుడిలో భయంతో పాటు ఆలోచనను కూడా రేకెత్తిస్తున్నాయి. ఈ కథలు భవిష్యత్తుపై హెచ్చరికలుగా కూడా పనిచేస్తున్నాయి. గతంలో డిస్టోపియన్ సాహిత్యం విస్తృతంగా పా పులర్ అయినప్పటికీ, ఈ సంవత్సరం ప్రారంభం నాటికి పాఠకుల్లో దానికి ఒక రకమైన అలసట కనిపిస్తుంది. నిరంతరం విధ్వంసం, చీకటి భవిష్యత్తు చూపించే కథలకంటే, ఇప్పుడు పాఠకులు ఆశను చూపించే కథలను కో రుకుంటున్నారు. అందుకే ఆశావహమైన సైన్స్ ఫిక్షన్, హోప్‌పంక్, సోలార్ పంక్ వంటి ధోరణులు బలపడుతున్నాయి. ఇవి భవిష్యత్తును సమస్యలతో నిండినదిగా కా కుండా, పరిష్కారాలతో కూడినదిగా ఊహిస్తాయి. సమా జం కలిసి పనిచేస్తే, ప్రకృతితో సమన్వయం సాధిస్తే, మా నవాళి ముందుకు సాగగలదనే సందేశాన్ని ఇవి ఇస్తాయి. నేటి సాహిత్యంలో మానసిక ఆరోగ్య అంశాలపై చాలా సున్నితమైన, బాధ్యతాయుతమైన ప్రస్తావనలు కనిపిస్తున్నాయి. ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, ఒంటరితనం వంటి అనుభవాలు ఇప్పుడు కథలలో సాధారణంగా కనిపిస్తున్నాయి. అయితే అవి కేవలం బాధను చూపించడానికే కా కుండా, స్వస్థత, పరస్పర సహాయం, వ్యక్తిగత ఎదుగుదల వంటి కోణాలను కూడా ఆవిష్కరిస్తున్నాయి. ఈ అర్థంలో సాహిత్యం ఒక రకమైన 'సామూహిక థెరపీ'లా మారింది. సామాజిక స్పృహతో కూడిన రచనలు కూడా ఈ కాలంలో కీలక స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఒకప్పుడు ప్రధాన సాహిత్యంలో చోటు దక్కని అనేక వర్గాల అనుభవాలు ఇప్పుడు బలమైన స్వరంతో వినిపిస్తున్నాయి. అణగారిన సముదాయాల జీవితం, వారి పోరాటాలు, వారి సంస్కృతి — ఇవన్నీ కథలుగా మారుతున్నా యి. చరిత్రను, పురాణాలను, క్లాసిక్స్‌ను కొత్త కోణంలో తిరిగి చెప్పే ప్రయత్నాలు పెరిగాయి. ఇవి కేవలం పాత కథలను మళ్లీ చెప్పడం కాదు... వాటిలో దాగి ఉన్న అధికార సంబంధాలను ప్రశ్నించడం, కొత్త అర్థాలను వెలికి తీయడం. ఇదే సమయంలో నాస్టాల్జియా కూడాసాహిత్యంలో ఒక ముఖ్యమైన భావంగా మారింది. 1990లు, 2000ల ప్రారంభ కాలం నేపథ్యంగా కథలు పెరుగుతున్నాయి. అప్పటి సంగీతం, టెలివిజన్ కార్యక్రమాలు, సాంకేతిక మార్పుల తొలి దశలు — ఇవన్నీ పాఠకులకు ఒక రకమైన సాంత్వనను, భద్రతా భావాన్ని అందిస్తున్నాయి. అనిశ్చిత భవిష్యత్తు మధ్యలో గతం ఒక ఆశ్రయంగా మారుతోంది.

పబ్లిషింగ్ రంగంలో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆడియోబుక్స్ వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రయాణాల్లో, పనుల మధ్యలో కూడా కథలను వినగలగడం వల్ల ఆడియో కథలకు విస్తృత ఆదరణ లభిస్తోంది. పూర్తి నటీనటులతో, నేపథ్య ధ్వనులతో రూపొందిన ఆడియో పుస్తకాలు ఒక నూతన అనుభూతిని సృష్టిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఎడిటింగ్, మార్కెటింగ్, కంటెంట్ విశ్లేషణ వంటి రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. అయితే, పూర్తిగా ఏఐ సృష్టించే పుస్తకాలపై పాఠకుల ఆసక్తి కొంత తగ్గుతోంది. మానవ స్వరం, మానవ అనుభూతి ఇప్పటికీ విలువైనదనే భావం పెరుగుతున్నది. డిజిటల్‌తోపాటు స్వయం ప్రచురణ రచయితలకు కొత్త అవకాశాలను తెరచాయి. సంప్రదాయ ప్రచురణ సంస్థలపై ఆధారపడకుండా, రచయిత నేరుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠకులను చేరుకునే పరిస్థితి ఏర్పడింది. దీనితో పాటు ముద్రిత పుస్తకాలకు కూడా ఒక కొత్త విలువ ఏర్పడింది. అందమైన కవర్లు, ప్రత్యేక డిజైన్‌లు, సేకరణకు అనువైన సంచికలు పుస్తకాన్ని కేవలం చదవదగిన వస్తువుగా కాకుండా, ఒక కళాఖండంగా మార్చాయి.

పఠనం కూడా ఇప్పుడు ఒక సామాజిక అనుభవంగా మారుతోంది. ఆన్‌లైన్ కమ్యూనిటీలు, సెలబ్రిటీ బుక్ క్లబ్‌లు, ప్రత్యక్ష పఠన సమావేశాలు వంటివి పాఠకులను ఒకరితో ఒకరు అనుసంధానిస్తున్నాయి. పుస్తకం చదవడం ఒక వ్యక్తిగత చర్య మాత్రమే కాకుండా, చర్చ, సంభాషణ, సాంస్కృతిక భాగస్వామ్యంగా మారింది. పర్యావరణ స్పృహ కూడా ఈ కాలపు సాహిత్య మరియు ప్రచురణ రంగంలో ముఖ్యమైన అంశంగా మారింది. పునర్వినియోగ కాగితం, కార్బన్‌న్యూట్రల్ ముద్రణ వంటి విధానాలు ప్రచురణలో అమలవుతున్నాయి. పాఠకులు కూడా స్థిరత్వాన్ని గౌరవించే ప్రచురణలను ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిణామ క్రమంలోనే, కథలు కేవలం పుస్తకాల్లోనే పరిమితం కావడం లేదు. ఒక కథ పుస్తకంగా మొదలై, వెబ్ సిరీస్‌గా, సినిమాగా, వీడియో గేమ్‌గా, ఇంటరాక్టివ్ యాప్‌గా విస్తరిస్తోంది. ఈ క్రాస్‌మీడియా కథనాలు కథకు కొత్త జీవం ఇస్తున్నాయి, విస్తృత ప్రేక్షకులను చేరుకుంటున్నాయి. మొత్తంగా చూసినప్పుడు, 2026 సాహిత్యం ఒక మార్గమధ్య దశలో ఉన్న సజీవ సాంస్కృతిక ప్రక్రియ. ఇది సాంకేతికతను స్వీకరిస్తూనే, మానవ అనుభూతిని కేంద్రంగా ఉంచుతోంది. భయం, ఆశ, ప్రేమ, పోరాటం, స్వస్థత తదితర అంశాలు ఈ కాలపు సాహిత్యాన్ని నిర్వచిస్తున్నాయి. భవిష్యత్తు ఎంత అనిశ్చితంగా ఉన్నా, కథ చెప్పాలనే మానవ అవసరం మాత్రం ఇంకా అదే బలంతో కొనసాగుతోంది. నేటి సాహిత్యం ఆ సత్యానికి ఒక బలమైన సాక్ష్యంగా నిలుస్తోంది.

---

## ఈ వారం కవితలు (వందేళ్ల సిపిఐ సంబురాల సందర్భంగా)




### వందేళ్ల పోరాటాల చరిత్ర చాటుతున్న జెండా

జెండా ఎగురుతున్నది
ఎర్ర జెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత్ర చాటుతున్నది. ॥జెండా॥

భారతదేశం మెచ్చిన జెండా
కాన్పూర్‌లో పుట్టిన జెండా
పేదల మదిలో మెరిసిన జెండా
కష్టజీవులు పట్టిన జెండా
పోరాటాల్లో వెలిగిన జెండా
దేశమంతటా నిండిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది.

కంటికి రెప్పలా కాపలగుంటూ
కష్టజీవుల కాచే జెండా
మట్టి మనుషుల గుండెల్లోన
సంఘం శక్తిని నింపిన జెండా
వెట్టి బతుకుల బంధుక్ జేసి
సాయుధ పోరును నడిపిన జెండా

జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది.
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది.

తూర్పు దిక్కున సూర్యుడివోలే
ఎర్రని కాంతిని పంచిన జెండా
సంపూర్ణ స్వాతంత్రం కావాలంటూ
స్వాతంత్ర పోరు చేసిన జెండా
కార్మిక శ్రమకు విలువనుగట్టి
దోపిడీ గుట్టును విప్పిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది.

దోపిడీ చేసే తిమింగలాలను
రోడ్డున కీడ్చే శ్రామిక జెండా
మీరెట్ కాన్పూర్ కుట్ర కేసులను
నిర్బంధాలను ఎదిరించిన జెండా
ఉన్మాదానికి ఊపిరి పోసే
మనువాదమును తరిమేజెండ
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండ ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
జెండా ఎగురుతున్నది...

అమరవీరుల రక్తపు ధారల
సాహస బాటలో నడిచే జెండ
రక్తము చిందిన వీరుల త్యాగం
వృథా కాదని చాటిన జెండ
వర్గ రహిత సమాజం కోసం
సోషలిజాన్ని ప్రకటించిన జెండ
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండాఎగురుతున్నది
అజరామర పోరాటాల
జెండా ఎగురుతున్నది ...

– కె.వి.ఎల్.
9490952649

---

## మన కమ్యూనిస్టులు



ప్రజల తరపున పోరుజేస్తారు మన కమ్యూనిస్టులు
ప్రజల కొరకు ప్రాణమిస్తారు మన కమ్యూనిస్టులు
ప్రజల సుఖము కోరుకుంటారు మన కమ్యూనిస్టులు
పాలకులను ప్రశ్నిస్తారు మన కమ్యూనిస్టులు ॥ప్ర॥

విభజించి పాలించే ఆంగ్లపాలన వద్దంటు
స్వరాజ్యం స్వపరిపాలన భారతీయుల హక్కంటూ
పోరాట మార్గంలో స్వాతంత్ర్యం సాధించిరి
బ్రిటీషోడి చేతినుండి మనదేశపాలన భూర్జువాల పాలైంది ॥ప్ర॥

అదే దోపిడీ దౌర్జన్యం మరో కోణపు కుంభకోణం
సహజ వనరుల విక్రయంతో పర్యావరణ కాలుష్యం
ప్రైవేటైజేషన్ పడగనీడలో కార్పొరేట్ అస్థిరత్వం
ఐరావతం అన్న రాజ్యాంగం ఆర్థిక అసమానతలు ఆపలేదయ్యో ॥ప్ర॥

నీతిలేని నాయకత్వం నియంతృత్వం చేసినపుడు
రోజురోజుకి ధరలు పెంచి విర్రవీగి పోయినపుడు
అరచేతిలో స్వర్గంతో మోసగించే మోసగాళ్లను
నిలదీసి ప్రశ్నిస్తూ మన కమ్యూనిస్టులు నిప్పులై మెరిసినారయ్యో ॥ప్ర॥

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏకస్వామ్యం పనికిరాదు
ఒకటి రెండు పార్టీలకే పట్టంగట్టుట సరికాదు
కమ్యూనిస్టులు గెలవాలి కొత్త మార్పు రావాలి
నవ సమాజ నిర్మాణంలో మనదేశం నందనవన మవ్వాలి
అన్నిరంగాలభివృద్ధితో ఈ ప్రపంచములో అగ్రగామిగా నిలవాలి ॥ప్ర॥

డాక్టర్ ఎస్. సూర్య ప్రకాష్

---

## ప్రగతిమార్గం

ఆకాశమంతా అరుణారుణపతాకం సుత్తి కొడవలి కార్మిక
కర్షక చిహ్నం
చైతన్యంతో సాగిపోతుంది
మనం భారత కమ్యూనిస్టు సైన్యం
ఎంతో మంది అమరుల రక్తంతో
ఎరుపెక్కినది ఆ జెండా, అది సత్యం
వందేళ్ళుగా రెపరెపలాడుతూ
అదే చైతన్య స్రవంతిలో అనునిత్యం

మార్క్స్ఎంగెల్ కమ్యూనిస్టు ప్రణాళిక
రష్యా బకునిన్ సిద్ధాంతం వెలుగులో
కర్షక కార్మికులను ఏకంచేసి
ప్రజా సైనం నిర్మించినది

గద్దర్ వీరుల, బోల్షివిక్ విప్లవం
రష్యామార్గం ప్రపంచ పోరాటాల
స్ఫూర్తితో భారత దేశంలో కమ్యూనిస్టు సైన్యం కవాతు చేస్తూ నడిచింది

లాఠీలు, తూటాలు నిషేధాలు
నిర్బంధాలు ఎదుర్కొని
అతివాద మితవాద కాంగిరేసుతో
భుజం కలిపి ఆంగ్లేయులను
దేశం నుండి తరిమికొట్టిన పార్టీరా!

బ్రిటీష్ దొరలను తరిమికొట్టినది
సంస్థానాధీషులను అంతమొందించినది
బూర్జువా భూస్వాముల గడీలను
ధ్వంసం చేసినది మూడక్షరాల
మన సిపిఐ ముందు కేగినదిరా!
ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్, ఎఐవై ఎఫ్
కార్మిక కర్షక మేధావి
ప్రజాసంఘాలే అంగాలుగా
ముందుకునడిచి అన్నిరంగాలల్లో
దూసుకు పోయిన
చైతన్య కెరటమే యర సిపిఐ రా!

కర్షకులకు గిట్టుబాటు ధరలు
కార్మికులకు కనీస వేతనాలు
స్త్రీలకు శ్రమకు తగ్గ జీత భత్యాలు
నియమిత పని గంటలు విద్యా,
వైద్యం సౌకర్యాలు
సాధించి పెట్టిన పార్టీ మనదిరా!

భారత కమ్యూనిస్టు పార్టీ
ఉమ్మడి కుటుంబం నుండి
చిన్న చిన్న సైద్ధాంతిక వైరుధ్యాలతో
మన అన్నదమ్ములు
కమ్యూనిస్టులు వేరుపడినవారు
ఉమ్మడి ఆశయం కోసం వారు
పోరాడుతున్నారు

చీలిపోయి పేలిపోయి చిన్న పార్టీలుగా
బలహీనపడి ప్రజలకు దూరమయ్యారు
ఓ కమ్యూనిస్టు సోదరులారా!
సామ్రాజ్య వాద, పెట్టుబడిదారి
పార్టీలకు బలమిస్తున్నారు.

మన దేశం కోసం మన ప్రజల కోసం
మనమంతా ఒక్కటై
వామపక్ష ప్రజాతంత్ర
ఐక్యసంఘటనగా ఏర్పడి
బలమైన రాజకీయశక్తిగా ఎదుగుదాం
భారతదేశాన్ని ప్రగతిమార్గంలో
నడుపుదాం.

– బూర భిక్షపతి
9866612717

---

చదవాల్సిన పుస్తకం

# సామాజిక చైతన్య స్వరం.. 'జన చంద్రోదయం'

పరిచయం అవసరం లేని పాటల ప్రేమికుడు... మాట ల మాంత్రికుడు... కవిగా, గేయ రచయితగా అందరికీ తెలిసిన గద్దమీది చంద్రమోహన్ గౌడ్ రాసిన పాటల సంకలం 'జన చంద్రోదయం' ఎక్కడా చంద్రుడిలా చల్లగా ఉండదు. ప్రచండ సూర్యుడి తీవ్రత ఇందులో ఉన్న వంద పాటల్లోనూ కనిపిస్తుంది... సామాజిక చైతన్యానికి స్వరం గా వినిపిస్తుంది.. కార్మిక, కర్షక గొంతుకై, ప్రతి పాట... ప్రతి పదంలోనూ నిప్పులా రగిలించిన కమ్యూనిస్ట్ కాబ ట్టే, ఆయన తన రచనలతోనే కుళ్లిన సమాజానికి 'కర్రుకాల్చి వాత' పెడతారు. సాహిత్యం చాలా రూపాల్లో మన ముందుకు వస్తుంది. అందులో చాలా భాగం వ్యక్తిగత భా వాలకు, ప్రేమకు, అభిరుచులకు సంబంధించినదే. కానీ కొద్ది మంది మాత్రమే, సమాజ లోతుల్ని చూస్తారు. బాధ, శ్రమ, ఆకలి, అణచివేత, దోపిడీ లాంటి వాస్తవాలను గ్ర హిస్తారు. న్యాయం కోసం పరితపిస్తారు. పదాలకు ఛురకత్తులు తగిలించి, అన్యాయాల కుత్తుకలు తెగనరుకుతారు. అలాంటి రచయితల్లో 'గద్దమీది' స్థానం ముందు వరుసలోగాక ఎక్కడ ఉంటుంది? 'కవి హృదయం అతి సున్ని తం. ప్రతి సంఘటనకూ అది త్వరగా స్పందించే లక్ష ణం కలది. అతడి మూలాలు ఉద్యమాల్లో ఉంటే... అదీ ప్రగతిశీల ఉద్యమాల్లో ఉంటే.. చెప్పనక్కర్లేదు. జనం గొంతుకై లే స్తాడు. ఆ కవితాత్వికత జనఘోషగా ప్రతిబింబిస్తుంది అతని రచనల్లో. సరిగ్గా చంద్రమోహన్ గౌడ్ అలాంటివాడే' అంటూ అరసం సభ్యుడు, ప్రముఖ రచయిత ఏటుకూరి ప్రసాద్ ముందుమాటలో కితాబునివ్వడం చాలా రచయిత ప్రతిభను, పాటల్లో వేడిని వర్ణించడానికి.

**'తల్లి నా ఎర్రని జెండా..**
**నీకున్నది చరిత్ర అణువణువు నిండా**
**పరాయి చేతిలో గాయాల పాలయ్యి**
**సిరులున్న నా తల్లి విలవిల్లాడంగా**
**సూడలేక నాడు నేతలంతా కూడి**
**అరుణ బీజాలను అవనిపై జల్లిరి'** అంటూ, శతాబ్ది ఉత్సవాల జరుపుకొంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావాన్ని వర్ణించినా,

**పోరుబాట పిలుస్తుంది**
**కదలి రమ్ము నేస్తమా..**
**నిన్ను నన్ను ఏకమై**
**ఉద్యమించి మన్నది**
**రణం జెయ్యమన్నది'** అంటూ స్ఫూర్తిబాట చూపినా, అది 'గద్దమీది' పాటేనని స్పష్టమవుతుంది. ఈ పుస్తకంలో పొందుపరచిన ఏ పాటను ప్రస్తావించినా, మరో పాటకు అన్యాయం చేయడమే. ఏ కోణాన్ని స్పృశించినా మరో పార్శ్వాన్ని విస్మరించినట్టే. కమ్యూనిజాన్ని ఒక శాస్త్రంగా అభివర్ణిస్తూ, సిపిఐ అజరామరమని నినదిస్తూ...

(((((**'పుట్టుక దప్ప సావులేని పోరు పార్టీ మనదిరా**
**జరుగుతున్న దోపిడీపై ఎదిరించిన జెండారా**
**శ్రమ జీవుల ఊపిరైన తిరుగుబాటు జెండారా**
**పుట్టుక తప్ప సావులేని పోరు పార్టీ మనదిరా'** అంటారు రచయిత. పార్టీని రైతుకూలీ పొలంలో ఉదయించిన పొద్దుగా, జనం గుండె నెగడులో ఎరుపెక్కిన జెండాగా పేర్కొంటారు. 'చెరసాలలు, ఉరితాళ్లకు జంకనట్టి పార్టీరా మంచి కొరకు మార్పు కొరకు పుట్టినట్టి పార్టీరా' అంటూ సిపిఐ ఘనతను వేనోళ్ల శ్లాఘించారు. వీటిలో వాస్తవాలే తప్ప అతిశయోక్తులు ఎక్కడా లేవు... కనిపించవు. ఎరుపు ఆయన నరనరాల్లో జీర్ణించుకుంది కాబట్టే, ఎర్ర జెండాకు పట్టం కట్టారు.

**'ఉద్యమ చరిత కలిగిన జెండా**
**పోరు నడిపిందీ ఎర్రని జెండా**
**దేశమంతా ఎగురుతుంది జనం**
**గుండెల నిండా**
**కార్మిక, కర్షకులకు నిరంతరం**
**నిలుస్తుంది అండా'**
అంటారు.)))))))




కార్మికులు, కర్షకులు, తాడితులు, పీడితులు, బాధితులు, సిపిఐ, ఎర్ర జెండా.. ఇవీ 'గద్దమీది' పాటల పునాదులు. కమ్యూనిజం ఆయన రక్తంలో ప్రవహిస్తున్నదని, పాటల్లో అక్షర రూపమై బయటపడుతుందని 'జన చంద్రోదయం' స్పష్టం చేస్తుంది. కమ్యూనిస్టు కాబట్టే ఆయన స్వరం మృదువైన లాలిత్యం కనిపించదు.. అంతులేని క్షోభ, కోపం, తిరుగుబాటు, మానవ గౌరవ మేళవింపులు పలకరిస్తాయి. భారమైన పరికరాల గర్జన ఆ పాటల్లో ప్రతిధ్వనిస్తుంది. వ్యవసాయ భూమిలో మట్టిని మోస్తున్న రైతు అడుగుల సవ్వడి వినిపిస్తుంది. అంతులేని అణచివేతలు.. అక్రమాలు.. అన్యాయాలు.. దుర్మార్గాలు చూసినవాడు కాబట్టే, ఆయన మాటలు పదునుగా, సూటిగా హృదయాల్లోకి చొచ్చుకుపోతాయి. 'గద్దమీది' ప్రస్తావించిన శ్రమజీవులు కళ్లెదుటే ఉన్నా పట్టించుకునేవారు చాలా అరుదు. ఆ బాధ్యతను భుజాలకెత్తుకున్న రచయిత 'గద్దమీది'. ఆయన పాటల్లో దోపిడీ యంత్రాంగం నేరుగా మానవత్వాన్ని ఎలా పీల్చేస్తున్నదో తేటతెల్లమవుతుంది. ఒకరి కడుపు నింపడానికి మరొకడు ఎన్ని కష్టాలు పడుతున్నాడో బహిర్గతమవుతుంది. 'జన చంద్రోదయం'లో ఉన్న పాటలు పాఠకులను ఉర్రూతలూగించడమేకాదు.... పాటగాడిగా మార్చేస్తాయి. అంతటి లయబద్ధమైన శబ్ద సౌంద ర్యం ఉంది. నిరసనకారుడిగా మారుస్తాయి.. అంతటి బలమైన సందేశం ఉంది. కేవలం కమ్యూనిస్టులు.. వామపక్ష భావజాలం ఉన్నవారు మాత్రమేకాదు, మన వత్వం ఉన్న ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన... కొని దాచుకోవాల్సిన పుస్తకం.

**పుస్తకం పేరు**

**జన చంద్రోదయం**
**జనం కోసం కలం గేయాలు**
**రచయిత: గద్దమీది చంద్రమోహన్ గౌడ్**
**వెల: రూ.200/**

**ప్రతులకు**

**నవచేతన పబ్లిషింగ్ హౌస్**
**గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) ఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన మాజీ మంత్రి

డా.సి లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల మండలం కిష్టారం గ్రామ పంచాయతీలో పిట్టల మల్లేష్ కూతురు (17) ప్రమాదవశాత్తు మరణించారు. మృతికి సంతాపం తెలిపిన మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు డా.సి లక్ష్మారెడ్డి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు 5000/రూపాయలు ఆర్థిక సహాయం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా అందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు యాదయ్య ,వైస్ ప్రెసిడెంట్ యాదయ్య ,బన్సీలాల్ రాజేందర్ గౌడ్, 2వ వార్డ్ మెంబర్ సింగిదాస్ శ్రీనివాసులు ,సున్నపు లక్ష్మయ్య, మున్నూరు కృష్ణయ్య, గొల్ల చుక్కయ్య ,గొడుగు యాదయ్య, యువ నాయకులు పిట్టల వెంకటేష్, బోయిపల్లి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాపక్షం/మక్తల్ : బొలేరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మక్తల్ మండలం సత్యవరం గ్రామానికి చెందిన పాషా(22) ఆదివారం ఉదయం చికెన్ వ్యాపారానికి అవసరమైన కోళ్ల కోసం ద్విచక్ర వాహనంపై మక్తల్‌కు వస్తుండగా, మక్తల్ నుంచి సిమెంటు లోడుతో ఆత్మకూరు వైపు వెళ్తున్న బోలోరో భూత్పూర్ గ్రామ పరిసరాల్లోని రిజర్వాయర్ దిగువ డ్యాం క్రాసింగ్ వద్ద వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాషాకు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన బోలోరో వాహనదారుడు గాయపడిన వ్యక్తిని పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## అంబేద్కర్‌నగర్ కాలనీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాపక్షం/వెల్దండ : మండలకేంద్రంలోని 4వ వార్డులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 'శుభ్రత – పరిశుభ్రత' అనే నినాదంతో 4వ వార్డు సభ్యురాలు జంగిలి సునీత ఆనంద్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆదివారం ఈదమ్మ దేవాలయం పరిసర ప్రాంతంలో జెసిబి సాయంతో సొంత డబ్బులతో ఆప్రాంతాన్ని శుభ్రం చేశారు. 4వ వార్డు ప్రజలు నామీద నమ్మకంతో నన్ను గెలిపించేందుకు కృతజ్ఞతాభావంగా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సంక్షేమంకొరకు పాటుపడుతూ 4వవార్డును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వీధిలైట్లు, డ్రైనేజి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిత్యం ప్రజలతో ఉండి వారి సమస్యలను తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జ్యోతినిరంజన్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జంగిలియాదగిరి, ఈదులపల్లి జగన్, పెద్ద ఆంధ్రయ్య, జంగిలి ప్రభుదాస్, జంగిలిశ్రీను, జంగిలి తిరుపతయ్య, గోరేటిరాజు, వెంకటయ్య, గోరటిబొందయ్య, అంజయ్య, జంగిలి వెంకటయ్య, మట్టబుచ్చయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన మల్లోజు బాలమణి ఆదివారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు గోకమల్ల కరుణాకర్ బాలమణి కుటుంబసభ్యులను పరామర్శించి తన వ్యక్తిగతంగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్‌రావు, రైతు రాజన్న, రమేష్, వెంకటయ్య, సత్యనారాయణ, కృష్ణయ్య, బాలకృష్ణ, ప్రేమ్‌సాగర్, వార్డుసభ్యులు పడకంటి వెంకటేష్, రమేష్, రామార్జున్, ప్రేమ్‌కుమార్, గ్రామస్తులు రాజు, జగదీష్, శ్రీనివాస్‌గౌడ్, పవన్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా - తప్పిన ప్రమాదం

ప్రజాపక్షం/వీపనగండ్ల : వడ్లను మిల్లులో బియ్యంగా పట్టించుకుని వస్తున్నా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని తూముకుంట గ్రామానికి చెందిన కురుమయ్య సొంత ట్రాక్టర్‌లో అదే గ్రామానికి చెందిన ఓ రైతు వడ్లను చిన్నంబావి మండల కేంద్రంలోని రైస్ మిల్లులో బియ్యం పట్టించడానికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. మిల్లులో బియ్యం పట్టించుకుని చిన్న దగడ గ్రామం మీదుగా తూముకుంట వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో ట్రాక్టర్ పై ఉన్న రైతు సురక్షితంగా బయటపడగా, డ్రైవర్ కురుమయ్య తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాదానికి సమీపంలోని కొందరు రైతులు 108 అంబులెన్స్ సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో కురుమయ్యను వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి అనంతరం అదే అంబులెన్సులో వనపర్తి ఏరియా ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ట్రాక్టర్‌లోని బియ్యం బస్తాలు కిందపడి పగిలి పోవడంతో రైతుకు అపార నష్టం వాటిల్లింది.



## సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలపరిశీలన

ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మున్సిపల్‌పరిధిలో తిమ్మరాసిపల్లిలో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఆదివారం మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రవీందర్, షాన్‌వాజ్‌ఖాన్‌లు తిమ్మరాసిపల్లిలో స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా కల్వకుర్తి మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పేదల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బాలునాయక్, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

## ఉపాధి హామీ పేరు మార్పుతో పేద ప్రజల హక్కులపై దాడి

ప్రజాపక్షం/కృష్ణ : నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పిడి అంశం పై నారాయణపేట జిల్లా అధ్యక్షులైన కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం ద్వారా బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ ఆశయాలను మరిచి పోతుందని విమర్శించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన వికషిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబిజీ రామ్ జీ) చట్టం పేదల హక్కులను దెబ్బ తీసులా ఉందని అన్నారు. కొత్త చట్టం ద్వారా మహిళా కూలీలకు వ్యతిరేకంగా ఉందని, ఇప్పుడు ఉన్న వందరోజుల ఉపాధి హామీలో 62 శాతం మహిళలు ఉపాధి పొందేవారని, దింతో పేద కుటుంబంలోని మహిళలు నష్టపోతారని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ, 10 రోజుల పని హామీ ని కాగితాలకే పరిమితం చేస్తోందని ఆరోపించారు. కేంద్రం నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడం వల్ల పేద కూలీలకు పని, వేతనాలు అందడం లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకం భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై మోపుతూ, బాధ్యత నుంచి బీజేపీ ప్రభుత్వం తప్పించుకుంటోందని మండిపడ్డారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఈ పథకాన్ని బలహీనపరచడం ప్రజల హక్కులను హరించడమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయితీ రాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల సిద్దేశ్వర్, నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులుల కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాజప్ప గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, మాగనూరు ఉమ్మడి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉపాధి హామీ పథకం మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ క్రీడాకారులు ...

# జాతీయ స్థాయిలో రాణించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు మథిన్ సహకారంతో జిల్లా స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ రూరల్ టోర్నమెంట్ క్రీడా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో మహబూబ్‌నగర్ నుంచి పలువురు క్రీడాకారులు భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని గుర్తుచేశారు. కోరియా, జపాన్ వంటి దేశాల తరహాలో క్రీడారంగం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. క్రీడాకారులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో శిక్షణ పొందాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని ఆయన సూచించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. త్వరలోనే రూ.16కోట్ల వ్యయంతో జిల్లా క్రీడా మైదానం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా క్రీడారంగంలో మరింత ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకు ముందు నిర్వాహకులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, అంజద్, ప్రశాంత్, నాయకులు చెన్న వీరయ్య, శేఖర్, శ్యాం, హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రజినీకాంత్ రెడ్డిపాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగకు రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : సంక్రాంతి పండుగకు ముందే మహబూబ్ నగర్ జిల్లాలో రూ.1200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో జిల్లాకు రానున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోఆప్షన్ సభ్యులు అర్షద్ అలి ఏర్పాటు చేసిన ఆత్మీయ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.680కోట్లతో అంతర్గత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మిషన్ భగీరథ నీటిని ప్రజలు వినియోగించే పరిస్థితిలేదని, అందుకే రూ.220 కోట్ల వ్యయంతో ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు పనులను శరవేగంగా పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. రానున్న మున్సిపల్ ఎన్నికలల్లో ''అభ్యర్థి ఎవరైనా సరే, రేవంత్ రెడ్డి మన అభ్యర్థి అనే భావంతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ప్రజలు ఓటు వేయాలి'' అని ఆయన పిలుపునిచ్చారు. రిజర్వేషన్ ఏది వచ్చినా, కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. గత పదేళ్లలో రాని నిధులు మహబూబ్ నగర్‌కు కేవలం రెండు సంవత్సరాల్లో తెచ్చి మహబూబ్‌నగర్ అభివృద్ధిని వేగవంతం చేసిన విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మహ్మద్ అలి, ఖాజా పాషా, శేఖర్ ఉమర్, అంజద్, ప్రశాంత్ పాల్గొన్నారు.



## అంధుల జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

ప్రజాపక్షం/మహబూబ్ నగర్ : అంధుల కోసం లిపిని సృష్టించి వారి జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా మెట్టుగడ్డ లోని శిశు గృహలో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని జరీనా బేగం తో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధుల సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండేలా ఆలోచించి లూయిన్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేశారన్నారు. ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కారం కు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల వయో వృద్ధుల శాఖ సంక్షేమ అధికారిణి జరీనా బేగం, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, డాక్టర్ రమయ్య, దివ్యాంగులు, వయో వృద్ధులు పాల్గొన్నారు.

# యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాపక్షం/నారాయణపేట్ : యోగా సాధన ద్వారా వృత్తి జీవితంలో ఏర్పడు ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, యోగా వల్ల మానసిక శారీరక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. యోగాన్ని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 6 గంటలకు, నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువు గట్టు వద్ద, పతాంజలి యోగ సమితి ఆధ్వర్యంలో, యోగ గురువు సురేష్ మార్గదర్శకత్వంలో ప్రకృతి ఒడిలో యోగ సాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది యోగాభ్యాసకులు, దామరగిద్ద నుండి విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ నల్లపు లింగయ్య, డిఎంహెచ్ ఓ జయచంద్ర మోహన్, బిజెపి నాయకులు నాగు రావు నామాజీ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించగా, నిత్య యోగాభ్యాసం వల్ల శరీరానికి ఆర్యోగం, మనసుకు ప్రశాంతత లభిస్తుందని యోగ గురువు సురేష్ వివరించారు. ప్రతిరోజు యోగాన్ని జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక రకాల రోగాల నుండి దూరంగా ఉండవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ ఒత్తిడి ప్రతి ఒక్కరి పై ప్రభావం చూపుతుందని, అలాంటి పరిస్థితుల్లో యోగ సాధన మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తుందని డీఎస్పీ తెలిపారు. యోగా ద్వారా క్రమశిక్షణ, సహనం పెరుగుతాయని, ముఖ్యంగా యువత యోగాన్ని అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగ సాధన ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్ మాట్లాడుతూ. యోగం ఒక సంపూర్ణ ఆరోగ్య విధానమని, ఇది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా జీవన శైలిగా మారాలని డిఎంహెచ్ఓ తెలిపారు. నిత్య యోగాభ్యాసం వల్ల రక్తపోటు, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని, శరీరంతో పాటు మనసు కూడా ఆరోగ్యంగా ఉంటుందని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ రోజు వారీ జీవితంలో యోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నాగు రావు నామాజీ మాట్లాడుతూ. ప్రకృతి మధ్య నిర్వహించిన యోగ సాధన కార్యక్రమం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని తెలిపారు. భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన గొప్ప సంపద యోగమని, దీనిని ప్రతి ఒక్కరూ గర్వంగా స్వీకరించాలని ఆయన అన్నారు. యోగా ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా సమాజంలో సానుకూల మార్పు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, రాజు లహోటి, క్యాతన్ రఘు, అశోక్, వెంకటేష్, యశ్వంత్, సుదర్శన్, బాలాజీ, మల్లికార్జున్, నర్సింహులు, ఆర్ముడు రిజర్వు పోలీసులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం ద్వారా...

# రూ.4లక్షలు అందజేత



ప్రజాపక్షం/మక్తల్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కోసం రూ. 4 లక్షలు ముదిరాజ్ సంఘం ద్వారా శివాజీ యువజన సంఘానికి అందజేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా చిట్యాల గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తమ వంతుగా 4 లక్షల రూపాయల నగదును ఆదివారం శివాజీ యూత్ సభ్యులకు సంఘం సభ్యులు మాజీ సర్పంచ్ బి. నర్సిములు, ఉల్లా లక్ష్మణ్, మాజీ ఎంపిటిసి రామలింగప్ప అందజేశారు. విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే మరికొంత ఆర్థిక సాయం అందిస్తామని ముదిరాజ్ సంఘం సభ్యులు భరోసా ఇచ్చారు. విగ్రహ ప్రతిష్టాపనకు ముందుకొచ్చిన యువతను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు కావలి పెద్ద రాములు, ముదుమల్ లింగప్ప, దుకాణం తమలప్ప, పంది రామలింగప్ప, సింహాద్రి, పుల్లారి శ్రీనివాసులు, పుల్లారి వెంకటేష్, నాగేష్, బి. వెంకటేష్, సి. దత్తు, వాకిటి నరసింహులు, గొర్రె కండ్ల వెంకటయ్య, శివాజీ యువజన సంఘం అధ్యక్షులు పుల్లారి అంజి, ఉపాధ్యక్షులు ఇంటెనికి నరసింహ, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, కోశాధికారి లక్ష్మీ పురం రంగప్ప, కార్యదర్శులు చాకలి అనిల్, పంది అంజప్ప, పుల్లారి పరుశురాం, బి. రాము, తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు పంటల మార్పిడితో అధిక ప్రయోజనాలు

మరికల్‌లో విస్తృతంగా పర్యటించిన సెంట్రల్ నోడల్ అధికారి రమణ్ కుమార్



ప్రజాపక్షం/నారాయణపేట్ : రైతులు నూతన పద్ధతిలో వ్యవసాయం చేయాలని, పంటల మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని జాయింట్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేషన్ పీఎండీడీకే వై సెంట్రల్ జోనల్ అధికారి రమణ్ కుమార్ ఐ.ఏ.ఎస్ తెలిపారు.

రెండు రోజుల నారాయణపేట్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఇన్‌చార్జీ కలెక్టర్ ప్రతీక జైన్ తో కలిసి పీఎండీడీ కే వై కమిటీ సభ్యులతో సమీక్ష చేసిన విషయం విదితమే రెండో రోజు ఆదివారం సెంట్రల్ జోనల్ అధికారి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మరికల్ మండల కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ రైతు శరణప్ప కు చెందిన ఆముదం పంట, టమాట తోటను ఆయన పరిశీలించారు. పంట కోత అయిన తర్వాత గడ్డిని తొలగించేందుకు నిప్పు పెట్టడంతో పొలం నల్లగా మారడం గమనించిన ఆయన పొలాల్లో నిప్పు పెట్టరాదనీ సూచించారు. ఆ ప్రాంత రైతులతో ముఖముఖి నిర్వహించారు. గత 40 ఏళ్ల క్రితం మన పెద్దలు ఒకే పద్ధతి లో వ్యవసాయం చేసేవారిని, అప్పట్లో వ్యవసాయ అధికారులు ఉండేవారు. కాదని, అప్పుడు ఒకే పద్ధతిలో వ్యవసాయం చేసేవారిని ఆయన తెలిపారు. కాలానుగుణంగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పర్యటించి పంటల మార్పిడి, వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త కొత్త మార్పుల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోందని, అందుకు అనుగుణంగా రైతులు క్రాఫ్ డైవర్షన్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో కేవలం తినడానికి సరిపడా పంట పండిస్తే చాలు అనే విధంగా వ్యవసాయం చేసే వారని, కానీ ఇప్పుడు ఉత్పత్తి పెంచేలా చేయాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన తెలిపారు.

మారిన లైఫ్ స్టైల్ తో పాటు మనం మారాలి అన్నారు. ఏటేటా జనాభా పెరుగుతోంది, కానీ భూమి పెరగడం లేదు కదా అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం పథకాలను వినియోగించుకుని వ్యవసాయ ఉప్పాదకత ను, పశు పాలన డైరీ ఫామ్ ను పెంచుకోవాలన్నారు. దేశంలోని దాదాపు 700 పైబడి ఉన్న జిల్లాలలో జాతీయ స్థాయిలో సర్వే చేసి వ్యవసాయ ఉత్పాదకత, వ్యవసాయ అనుబంధ రంగాలలో వెనుక బడిన 100 జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందని, అందులో నారాయణపేట జిల్లాను కూడా ఎంపిక చేశారని, అన్ని శాఖల సహకారంతో ఉత్పత్తినీ పెంచి క్రెడిట్ సౌలభ్యం కల్పించాలన్నదే పథకం ఉద్దేశం అని ఆయన తెలిపారు. ఇదంతా కేవలం అధికారులు కార్యాలయంలో కూర్చుని చేయలేమని, వ్యవసాయ విస్తీర్ణ అధికారి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అందరూ సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని, అందుకే కేంద్రం మంచి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు తాను వచ్చానని సెంట్రల్ నోడల్ అధికారి రమణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రతిసారి వరి, పత్తి సాగు చేయకుండా ఆయుదం, కందులు, కూరగాయలు సాగు చేస్తున్న మరికల్ రైతు శరణప్ప ను ఈ సందర్భంగా నోడల్ అధికారి అభినందించారు. ఒకే రకమైన పంటలు పండించడం ద్వారా నేలల్లో సారవంతం తగ్గుతుందని, పంటల మార్పిడి అవశ్యకత ఉందన్నారు. జిల్లాలో డైరీ ఫామ్ ను, ఫౌల్ట్రీ, గొర్రెల షెడ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలనరి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి నీ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ (ఎఫ్ ఏసీ) ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, వికారాబాద్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాక అధికారి జాన్ సుధాకర్, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వక్ రెడ్డి, నాబార్డు అధికారి షణ్ముక చారి, ఎల్డీఎం విజయ కుమార్, డిపివో సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ రామాకోటి, గ్రామ సర్పంచ్ గూప చెన్నయ్య, ఉప సర్పంచి ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



## రిపోర్టర్లను సన్మానించిన పెబ్బేరు ప్రెస్‌క్లబ్


ప్రజాపక్షం/పెబ్బేరు : గత నెలలో జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ప్రజాప్రతినిధులైన రిపోర్టర్లను పెబ్బేరు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. రంగాపురం గ్రామానికి చెందిన నందీశ్వర్ వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అదే గ్రామానికి చెందిన నందీశ్వర్ వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అదే గ్రామానికి చెందిన మిద్దె రాములు వార్డు మెంబర్‌గా గెలిచారు. అదేవిధంగా కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు వార్డు మెంబరుగా గెలిచి ఉప సర్పంచుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్ ఆధ్వర్యంలో పెబ్బేరు జర్నలిస్టులు అందరూ కలిసి వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విలేఖరిగా గుర్తింపు పొంది ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనందున వారికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఇక నుంచి మీరు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. కాబట్టి జర్నలిస్టు వృత్తికి రాజీనామా చేసి ప్రజా సేవకు అంకితం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, అబ్దుల్ హుస్సేన్, సభ్యులు బాలరాజు, రాజేంద్ర ప్రసాద్ , విజయ్, మందడి చిరంజీవి, అతీక్ పాషా, మన్నెం, రాంబాబు, సి.రమేష్, బి.రమేష్, విజయ్ కుమార్, బాషా, తరుణ్, మహేష్, ప్రకాశ్, నాగరాజు, గోపాలకృష్ణ, రామకృష్ణ, బీసన్న, కుమార్, రవి, ఎల్లస్వామి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిని కలిసిన సర్పంచ్‌లు

ప్రజాపక్షం/వంగూర్ : మండలపరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామసర్పంచ్‌లు నూకం శ్రీనివాసులు, పానుగంటి బాలయ్య ఆదివారం ఎంపి డాక్టర్ మల్లురవిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు విష్ణు, కోట్ల జగపతి రావు పాల్గొన్నారు.



## శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్‌లు



**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి జిల్లా భువనగిరిలోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి కుటుంబ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ పివి శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, రాష్ట్ర సమాచార కమిషనర్ పివి శ్రీనివాస్ రావులకు మానేపల్లి గోపికృష్ణ వెంకటేశ్వర స్వామి వారి ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మానేపల్లి రామారావు, మానేపల్లి మురళీకృష్ణ, మానేపల్లి గోపికృష్ణ పాల్గొన్నారు.

## బెంగుళూర్ బేకరికి రూ.5వేల పెనాల్టీ




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణంలోని పాతబస్టాండ్ ఎదురుగా గల బెంగళూర్ బేకరీ యాజమాన్యం వారు షాపులో అపరిశుభ్రత, డేట్‌ఎక్స్‌పెయిర్ అయిన చాక్‌లెట్స్ అమ్ముతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది షాపును పరిశీలించి రూ.5వేల పెనాల్టీ విధించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యేనేపల్లి యాదగిరి, సందీప్ పాల్గొన్నట్లు చెప్పారు.



## గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి

### నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల:** గ్రామ సర్పంచ్‌లు గ్రామ సమస్యల పట్ల అంకితభావంతో పనిచేయాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నూతనంగా ఎన్నికైన చిట్యాల మండల సర్పంచ్‌ల ఫోరం కార్యవర్గం ఆయనను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహాయం చేస్తానన్నారు. ముఖ్యంగా మురుకి కాలువలు, మంచి నీటి సరఫరా, వీధి దీపాలు లాంటి మౌలిక వసతులపై సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లంతా ఐక్యతతో ఉండి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. ఎంఎల్‌ఏను కలిసిన వారిలో ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఆవుల సునిత, ఫోరం బాధ్యులు జోగు సురేష్, మిర్యాల వెంకటేశం, మహిపాల్‌రెడ్డి, సాగర్ల యాదయ్య, కట్ట ఆశయ్య, ఆవుల సుందర్, అందె రాములు తదితరులున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**ప్రజాపక్షం/మోత్కూర్ :** రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెలు అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ ఎన్నికల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానిక యల్‌ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెలు వచ్చేసి మాట్లాడుతూ రానున్న మున్సి పాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించి మోత్కూ రు మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని అన్నారు. పార్టీలో కొత్త పాత అనే భేదాభిప్రాయాలు పక్కకు పెట్టి ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పైళ్ళ సోమిరెడ్డి, కంచర్ల యాదగిరి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నూనముంతల విమల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కంటి సమస్యతో బాధపడొద్దు

### ప్రతి ఒక్కరి కళ్ళల్లో వెలుగును నింపడమే సుశీల ఫౌండేషన్ లక్ష్యం : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భరోసా



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడొద్దని తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ప్రతి ఒక్కరి కళ్ళలో వెలుగులు నింపడమే సుశీలమ్మ ఫౌండేషన్ లక్ష్యం అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో మునుగోడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్,శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన క్యాంప్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి తన మాతృమూర్తి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా చందూరు నాంపల్లి మర్రిగూడ సంస్థాన్ నారాయణపురం చౌటుప్పల్ మునుగోడు మండలాలలో ఇప్పటివరకు ఈ 10 ఉచిత కంటి వైద్య శిబిరాలలో 7506 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 1490 మందికి సక్సెస్ ఫుల్ గా కంటి ఆపరేషన్లు పూర్తి చేసి వారికి వెలుగులు నింపారు.అనంతరం కంటి పరీక్షలకు చేయించుకోవడానికి వచ్చినవారికి స్వయంగా భోజనం వడ్డించారు.కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఆపరేషన్ నిమిత్తం శంకర్ హాస్పిటల్ కి తరలించారు.

## పేదలకు అండగా సిపిఐ పోరాటం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్లో ఆవిర్భవించిందని నాటి నుండి నేటి వరకు పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలపై ప్రజా పోరాటాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు సానుభూతిపరులు మేధావులు పాల్గొని ఈ యొక్క బహిరంగ సభని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, టంగుటూరి రాములు, దాసరి అంజయ్య, నీల బిక్షపతి, రోషణ, అంజయ్య, కడవేరు కౌసల్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## కెసిఆర్ మరణాన్ని కోరుకునేది ఆ 'బావ బామ్మర్దులే'.. రేవంత్ రెడ్డి కాదు!

### సిఎం పదవి కోసం కెటిఆర్, పార్టీ కోసం హరీష్ రావు తహతహ..

### నీళ్లు, నిధుల దోపిడీని ఎండగడుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారు

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్షేమంగా ఉండాలని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటుంటే, ఆయన రాజకీయ వారసత్వం కోసం సొంత కుటుంబ సభ్యులే కుట్రలు చేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిపై విషం చిమ్మడమే లక్ష్యంగా హరీష్ రావు, కేటీఆర్ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం, కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టి తెలంగాణ ద్రోహానికి పాల్పడిందని చామల విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాలపై జరిగిన అన్యాయాన్ని 'ప్రజా భవన్' వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు వివరిస్తుంటే.. దొంగలు దొరికిపోయినట్లు బావ బామ్మర్దులకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అసలు వాస్తవాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం చర్చకు పిలుపునిచ్చిందని ఆయన స్పష్టం చేశారు. 'కేసీఆర్ చావాలని రేవంత్ రెడ్డి ఎందుకు కోరుకుంటారు? నిజానికి కేసీఆర్ దౌర్భాగ్య పాలన వల్లే రేవంత్ రెడ్డికి సీఎం అయ్యే అవకాశం వచ్చింది. ఒకవేళ కేసీఆర్ మరణాన్ని ఎవరైనా కోరుకుంటున్నారంటే అది వారి కుటుంబంలోని హరీష్ రావు, కేటీఆర్ మాత్రమే' అని చామల ఆరోపించారు. ఎలాగైనా ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవాలని కేటీఆర్ లక్ష్యంగా పెట్టుకోగా, పార్టీని తన గుప్పిట్లోకి తెచ్చుకోవాలని హరీష్ రావు ఆరాట పడుతున్నారని, వీరిద్దరి అధికార దాహానికి అడ్డు వస్తుందనే ఉద్దేశంతోనే కవితను కూడా పక్కకు తప్పించిన దాఖలాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. పాలమూరురంగారెడ్డి, కృష్ణా జలాలు, కాళేశ్వరం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకోవడానికి హరీష్ రావు, కేటీఆర్ మళ్లీ పాత పద్ధతిలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్లతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ విమర్శించారు. గత పదేళ్ల రావణ పాలన ముగిసిందని, ఇప్పుడు సాగుతున్న రామ రాజ్యంలో వాస్తవాలు ప్రజల కళ్లముందే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి స్వయంగా వెళ్లి పరామర్శించారని, అనుభవం ఉన్న నాయకుడిగా ఆయన సలహాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చామల వివరించారు.

## సాగర్‌లో పర్యాటకుల సందడి

**ప్రజాపక్షం/నందికొండ:** సెలవు దినం కావడంతో అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు సాగర్‌కు తరలివచ్చి సాగర్ అందాలను తిలకించారు.ప్రత్యేక ఆకర్షణగా సాగర్ జలాశయం నుంచి లాంచీల్లో నాగార్జునకొండకు బయలుదేరిన పర్యాటకులు అక్కడి చారిత్రక ప్రాధాన్యత కలిగిన మ్యూజియాన్ని సందర్శించారు. బౌద్ధ కాలానికి చెందిన శిల్పాలు, శాసనాలు, పురావస్తు సంపదను వీక్షిస్తూ చరిత్రను గుర్తుచేసుకున్నారు.లాంచీ ప్రయాణం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించగా, నాగార్జునకొండలోని మ్యూజియం విశేషాలు వారిని ఆకట్టుకున్నాయి.ఆతరువాత బుద్ధవనం, వ్యూ పాయింట్ తదితర ప్రాంతాలు సందర్శించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సెలవు దినాన్ని ఆనందంగా గడిపారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన హనుమంతు

### గణేష్ ఉయికేకు ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు:** ప్రజాయుద్ధనేత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పాక హనుమంతు అలియాస్ గణేష్ ఉయికే అన్న తాను నమ్మిన మావోయిస్టు సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు పోరాటం చేసి ప్రజల కోసం జీవించి అమరుడుగా నిలిచిపోయాడని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గత నెల డిసెంబర్ 24న ఒడిశాలోని కందమాల్ జిల్లా చరపాద్ అడవుల్లోజరిగిన ఎన్‌కౌంటర్‌లో పాక హనుమంతు అలియాస్ ఉయికే గణేష్ మరణించడంతో ఆయన స్వస్థలం తెలంగాణలోని నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో పాక హనుమంతు అంత్యక్రియలు జరిగాయి. జనవరి 4న పుల్లెంల గ్రామంలో జరిగిన పాక హనుమంతు అలియాస్ ఉయికే గణేష్ సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , కల్లుగీత కార్పోరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ , బిఆర్ఎస్ నేత తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్ హాజరై పాక హనుమంతు అలియాస్ ఉయికే గణేష్ అన్న చిత్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మావోయిస్టులపై చేస్తున్న కగార్ ఆపరేషన్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని మావోయిస్టులు ప్రకటించినాకూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మావోయి స్టులను పిట్టలను కాల్చినట్లు కాల్చిచంపడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పద్ధతి కాదని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవడం కోసం కమ్యూనిస్టు పార్టీ ఐక్యత చాలా అవసరమని, దేశంలోఉన్న మేధావులు, లౌకికవాదులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ , తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ , పౌరహక్కుల సంఘం నేతలు , అమరుల బంధు మిత్రుల సంఘం నేతలు , భరద్వాజ్ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , తీర్పారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పొరపాట్లుండొద్దు

### యాదాద్రి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/ఆలేరు :** మున్సిపల్ పట్టణాల్లోని ప్రతి వార్డుకు సంబంధించిన ఓటర్ల వివరాలు కీలకమని, ఎన్నికల నిర్వహణకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఆదివారం ఆలేరు మున్సిపాలిటీ కార్యాలయంను సందర్శించి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును పరిశీలించారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఏమైనా మార్పులు చేర్పుల కొరకు ఫిర్యాదులు అందితే వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రజలకు ఎవ్వరికైన ఎటువంటి అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే వారు ఇచ్చే అర్జీలను స్వీకరించుటకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలనీ ఇప్పటి వరకు ఆర్జీల స్వీకరించుటకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసారా లేదా అని తెలుసుకున్నారు. ప్రతి రోజు వచ్చినటువంటి అభ్యంతరాలను ఏరోజుకారోజు విచారణ నిర్వహించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే ఎన్నికలకు ముందస్తుగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం నర్సాపురం గ్రామ శివారులోని బోరబండగూడెం హ్యామ్లెట్ వద్ద సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ముషిపట్ల గ్రామానికి చెందిన రైతు కుక్కల యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం ఆయన కుమారుడు సాయి కిరణ్(19) తన స్నేహితుడు బొల్లా దీక్షిత్ (21) దాచారం గ్రామ నివాసితో కలిసి సోమవారం ఉదయం 9 గంటల సమయంలో భువనగిరికి వెళ్లేందుకు పుల్సర్ మోటార్ సైకిల్ (టిఎస్ 07హెచ్‌బి9040)పై బయలుదేరారు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో నర్సాపురం గ్రామ శివారులో అశోక్ లేలాండ్ 22 చక్రాల లారీ (టిఎస్02యుబి7312) మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఇనుప రాడ్లతో లోడ్ చేసిన లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా వలిగొండ వైపు నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో లారీ రెండో వరుస కుడి వైపు చక్రం సాయి కిరణ్ తలపై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అదే విధంగా, రెండో వరుస ఎడమ వైపు చక్రం బొల్లా దీక్షిత్ కుడి తొడ మరియు కిందటి పొట్ట భాగంపై వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై ఆయన కూడా సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే మృతుడి తండ్రి యాదగిరి సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్‌పై భారత న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదంతో ముషిపట్ల, దాచారం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.




## ప్రజల ప్రాణాలు కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీ అభివృద్ధి తో పాటు కాలనీలో ఉన్న ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినదనీయం అని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాక్ హిల్స్ కాలనిలో రివర్ నిమ్స్ హాస్పిటల్ సౌజంన్యతో లయన్స్ క్లబ్ నల్లగొండ స్టార్స్,హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన సెంటర్ సహకారంతో మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపును ఆదివారం నిర్వహించారు.ఈ క్యాంపు ను శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ మానవుడు ప్రస్తుత పరిస్థితిలలో బిజీగా ఉంటూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకపోవడం వలన ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాకెట్స్ కాలనీ అధ్యక్షులు సోమనబోయిన నరసింహ యాదవ్, గౌరవాధ్యక్షులు పకీరు వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రేఖ నాగబాబు,కోశాధికారి ఆంజనేయులు,ఉపాధ్యక్షులు వంశీ మహేందర్,నరసింహ ,డాక్టర్ వెంకట రెడ్డి,మాజీ కౌన్సిలర్ ఖయ్యూం బేగ్ పాల్గొన్నారు.




## బసవపురం ప్రాజెక్టును నింపండి

### సిఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేల విన్నపం



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన బసవపురం (నృసింహస్వామి) ప్రాజెక్టును నీటితో నింపి, సాగునీరు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రజా ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నేతృత్వంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. బసవపురం ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టుకు నీళ్లు అందిస్తే జిల్లాలోని మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని, వేలాది రైతు కుటుంబాలకు భరోసా కలుగుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సాగునీటి రంగంలో జిల్లా విప్లవాత్మక మార్పులు సాధిస్తుందని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బసవపురం ప్రాజెక్టు ఫలితాలు రైతులకు అందించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమ విన్నపంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రాజెక్టు పనుల పురోగతి మరియు నీటి లభ్యతపై అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు తెలిపారు. 'ప్రజల ఆకాంక్షల సాధనే ధ్యేయంగా పనిచేస్తున్న మా ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తోంది. బసవపురం ప్రాజెక్టు ద్వారా జిల్లా రూపురేఖలు మారుతాయని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు.

## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా రాజు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఆదివారం కేశ్యతండా సర్పంచు రాజునాయక్‌ను 20 మంది సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సర్పంచుల ఫోరం అధ్యక్షుడిని కొండమల్లేపల్లి సర్పంచు పసునూరి యుగేందర్‌రెడ్డి ప్రతిపాదించగా కేశ్యతండా సర్పంచు రమావత్ రాజును సర్పంచులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా చెన్నారం సర్పంచు రమావత్ తులసిరాంను ఎన్నుకున్నారు. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో కెసిఆర్ తప్పులు చేశాడనే వాదన తప్ప కృష్ణానది నీటి వాటాపై చర్చ ఏదీ?

### జగదీష్‌రెడ్డి మిత్రులు పెద్దఎత్తున అవినీతి అక్రమాలు

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపణ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అసెంబ్లీలో కెసిఆర్ తప్పులు చేశాడనే వాదన తప్ప కృష్ణానది నీటివాటాపై చర్చేలేదని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆల్మట్టి ఎత్తు పెంచి 100 టిఎంసిల నీటిని తెలంగాణ నష్టపోయే పరిస్థితి ఏర్పడినా ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఉత్తరం రాసి వదిలేశారని మండిపడ్డారు. కృష్ణనీటి వాటాలో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నాలుగు రాష్ట్రాల మీద మాట్లాడకుండా కేవలం ఆంధ్రప్రదేశ్ దోపిడి మీదనే సిఎం మాట్లాడడం విడ్డూరంగా ఉందని హేళన చేశారు. ప్రతిపక్షం అంటే ఒక పార్టీ మాత్రమే కాదు ప్రజల గొంతుకగా ఉండాలన్నారు. కురచ స్వభావంతో గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ తప్పులు కప్పిపుచ్చుకుంటున్న సిఎం చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక అప్పర్ భద్ర జాతీయ హోదా తొలగించాలని, అల్మట్టి ఎత్తు తగ్గించేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగతంగా హరీష్‌ని ఒక్క మాట అన్నందుకు సభని వాకౌట్ చేశారని ఆ అంశంపై వాకౌట్ చేస్తే తరువాత సభకు రావొచ్చన్నారు. మిగతా బిల్లులపై చర్చ జరుగుతుంటే ప్రతిపక్షం ఉండొద్దా అని ప్రశ్నించారు. సభ నుండి వాకౌట్ చేయాలనే నిర్ణయం హరీష్‌రావుదేనా అన్నారు. గతంలో కేసీఆర్‌ని తిట్టినప్పుడు సభ నుండి బాయ్‌కాట్ ఎందుకు చేయలేదని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీలో హరీష్ ఒక గుంపు తయారు చేస్తుండని బాయ్‌కాట్ నిర్ణయం అధిష్టానందే అయితే అది శ్రేయస్కరం కాదని, బయట సభలు పెట్టేకంటే చట్టసభల్లో మాట్లాడే అవకాశం వదులుకోవడం కరెక్ట్ కాదని హితవు పలికారు. గుంటనక్క హరీష్ వ్యవహారం తోక కుక్కను ఊపినట్టుందనీ, ఒక్క మాట అన్నందుకు సభ బాయ్‌కాట్ చేస్తారా అని అడిగారు. కృష్ణా పంపకాల్లో హక్కులు తగ్గించి హరీష్ సంతకం ఎందుకు పెట్టాడో చెప్పి పిపిటి చేయాలన్నారు. హరీష్ ధన దాహం కోసమే జూరాల నుండి శ్రీశైలానికి మార్పు చేసారని, హరీష్ నిర్ణయాలతో సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఏలూరు పంపుహౌస్‌ను అండర్ గ్రౌండ్ పంప్‌హౌస్‌గా మార్చారని అందుకు దాదాపు రూ.14కోట్లు ఖర్చు పెట్టారన్నారు. జగదీష్‌రెడ్డి దత్తత తీసుకున్న చీదెళ్ల గ్రామంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందన్నారు.



# క్రీడ

# బ్రూక్, రూట్ అర్ధ శతకాలు..

## తొలిరోజు ఇంగ్లండ్‌దే ఆధిపత్యం!



మెల్‌బోర్న్ టెస్టులో విజయంతో యాషెస్ సిరీస్‌లో బోణీ కొట్టిన ఇంగ్లండ్ సిడ్నీలోనూ జోరు చూపించింది. సిరీస్‌లో మొట్టమొదటి సారి ఆ జట్టు బ్యాటర్లు క్రీజులో నిలబడి తొలి రోజే ఆలౌట్ గండాన్ని అధిగమించారు. ఓపెనర్లు విఫలమైనా.. హ్యారీ బ్రూక్(78 నాటౌట్), జో రూట్(72 నాటౌట్)లు ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ అర్ధ శతకాలు బాదారు. ఫలితంగా.. తొలి రోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. సిడ్నీ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్(72 నాటౌట్), హ్యారీ బ్రూక్(78 నాటౌట్)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు చెక్కుచెదరని ఏకాగ్రతతో క్రీజులో పాతుకుపోయి స్కోర్‌బోర్డును నడిపించారు. ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు. నాలుగో వికెట్‌కు 150పరుగులు రాబట్టడంతో ఆసీస్ బౌలర్లు నీరుగారిపోయారు. రెండో రోజు కూడా ఈ ద్వయం సెంచరీలు సాధిస్తే ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచినట్టే. వరుసగా.. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓడిన ఇంగ్లండ్ సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే.

## ఇది కలా? నిజమా..?



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామిన్ మార్టిన్ కళ్లు తెరిచాడు. కొన్ని రోజులుగా కోమాలో ఉన్న అతడు ఆదివారం స్పృహలోకి వచ్చాడు. కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నాడు కూడా. దాంతో, ఇది కలా? నిజమా? అని డాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారు. కోమా నుంచి కోలుకున్న మార్టిన్ ఆరోగ్యం రోజురోజుకు మెరుగవుతోందని వైద్యులు తెలిపారు. త్వరలోనే అతడిని ఐసీయూ నుంచి వేరే వార్డుకు తరలిస్తామని చెప్పారు. ఒకప్పుడు విధ్వంసక ఆటగాడైన డామిన్ మార్టిన్ మెనింజిటైటిస్ జబ్బుతో బాధపడుతున్నాడు. 54 ఏళ్ల వయసున్న మార్టిన్ డిసెంబర్ 26న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో, కుటుంబసభ్యులు అతడిని వెంటనే బ్రిస్బేన్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మార్టిన్ అరోగ్యం మరింత క్షీణించడంతో ఐసీయూలో చికిత్స అందించారు. అతడు కోమాలోకి వెళ్లడంతో ఇక కోలుకోవడం కలే అనుకున్నారంతా. కానీ, అనూహ్యంగా మార్టిన్ వారంలో రోజుల తర్వాత కళ్లు తెరిచాడు. మనుషలను గుర్తుపడుతూ.. మాట్లాడుతున్నాడు కూడా. అతడు వైద్యానికి వేగంగా స్పందిస్తున్నాడు అని వైద్యులు వెల్లడించారు.

# వరల్డ్‌కప్ ఆడుతాం..

## కానీ, మా జట్టును భారత్‌కు పంపించం!





భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాలే కాదు క్రికెట్ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను బిసిసిఐ తప్పించడాన్ని ఆ దేశ బోర్డు సీరియస్‌గా తీసుకుంది. ఫిబ్రవరిలో జరుగబోయే ప్రపంచకప్ కోసం స్క్వాడ్‌ను ప్రకటించిన బంగ్లా క్రికెట్ బోర్డు కీలక ప్రకటన చేసింది. వరల్డ్‌కప్ ఆడేందుకు తమ జట్టును ఇండియాకు పంపమని ఐసిసికి ఈమెయిల్ చేసింది. పొట్టి ప్రపంచకప్ సమీపిస్తున్న బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆదివారం సమావేశమైన బంగ్లా బోర్డు సభ్యులు ముస్తాఫిజుర్‌ను ఐపిఎల్ నుంచి తప్పించడానికి ప్రతిచర్యగా కీలక ప్రకటన చేశారు. మెగా టోర్నీకి లిటన్ దాస్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేసిన తర్వాత.. భద్రతా కారణాలతో భారత్‌కు తమ జట్టును పంపమని బోర్డు వెల్లడించింది. 'భద్రతా కారణాల రీత్యా మా జట్టును ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపించడం సాధ్యం కాదు. బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. బిసిసిఐ నిర్ణయానికి కౌంటర్‌గా మేము ఈ తీర్మానం చేశాం. మా జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించండి' అని బంగ్లా క్రికెట్ బోర్డు ఆదివారం ఐసీసీకి పంపిన ఈమెయిల్‌లో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బంగ్లాదేశ్, వెస్టిండీస్ తలపడాలి. కానీ, ఇరుదేశాల బోర్డులు తమ ప్రభుత్వం మాటకే కట్టుబడి ఉన్నందున బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహిస్తారా? లేదా? రాజీకి వస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

### బంగ్లాదేశ్ టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ :

లిటన్ కుమార్ దాస్(కెప్టెన్), మొహమ్మద్ సైఫ్ హొసేన్(వైస్ కెప్టెన్), తంజిద్ హసన్, పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొసేన్, కాజీ నురుల్, మహేది హసన్, రిషద్ హొసేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తంజిమ్ హసన్, తస్కిన్ అహ్మద్, షైఫుద్దీన్, షారిఫుల్ ఇస్లాం.


### బిసిసిఐ ఆదేశాల మేరకు

ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసింది. అంతే కాదు బిసిసిఐ ఆదేశాల మేరకు తమ స్క్వాడ్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ తప్పించింది. దాంతో.. బంగ్లాదేశ్ బోర్డు సైతం వరల్డ్‌ప్ కోసం తమ జట్టును భారత్‌కు పంపించమని మెలిక పెట్టింది. మొదట.. తమ ఆటగాళ్లు, మీడియా, స్పాన్సర్లకు భద్రత కల్పిస్తామని బిసిసిఐ హామీ ఇవ్వాలని బంగ్లా బోర్డు కోరనుందనే వార్తలు వినిపించాయి. కానీ, తమ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని ఐసిసికి ఆ దేశ బోర్డు రాయడం చర్చనీయాంశమవుతోంది.

# ఆరోగ్యం

ఫోకస్

# బ్రెయిన్ స్ట్రోక్...



మెదడులోని కొంత భాగానికి రక్త సరఫరా అకస్మాత్తుగా రక్తం గడ్డ కట్టడం వలన అంతరాయం లేదా నిదానంగా తగ్గినప్పుడు, మెదడు కణజాలం ఆక్సిజన్, పోషకాలను పొందకుండా నిరోధించినప్పుడు ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవిస్తుంది. లేదా మెదడు లోని రక్తనాళం రక్త పోటు ఎక్కువ అయి చిట్లితే హిమరేజిక్ స్ట్రోకు వస్తుంది. మెదడు కణాలు నిమిషాల్లో చనిపోవడం ప్రారంభిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 6 నిముషాల్లో ఒకరికి ప్రపంచంలో బ్రెయిన్ స్ట్రోక్ వస్తున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) పేర్కొంది. ప్రతి సంవత్సరం భారతదేశంలో పదిలక్షల కేసులు వస్తాయి. స్ట్రోక్ అనేది వైద్యపరమైన అత్యవసర పరిస్థితి. సత్వర చికిత్స కీలకం. అందుకే, ముందస్తు చర్య మెదడు దెబ్బ తినడాన్ని, ఇతర సమస్యలను తగ్గిస్తుంది. ఈ లక్షణాలు ప్రారంభమైన సమయానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. స్ట్రోక్ ప్రారంభమైన వెంటనే కొన్ని చికిత్సలు చేయగలిగితే ఫలితాలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి.

### స్ట్రోక్ సంకేతాలు..లక్షణాలు..

- మాట్లాడటం, ఇతరులు ఏమి చెబుతున్నారో అర్థం చేసుకోవడంలో సమస్య. గందరగోళం, అస్పష్టమైన పదాలు లేదా ఎదుటి వారి ప్రసంగాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బందిని అనుభవించవచ్చు.
- ముఖం, చేయి లేదా కాలు యొక్క పక్షవాతం లేదా తిమ్మిరి. ముఖం, చేయి లేదా కాలులో ఆకస్మిక తిమ్మిరి, బలహీనత. ఇది తరచుగా శరీరంలో ఒక వైపు మాత్రమే ప్రభావితం చేస్తుంది.
- రెండు చేతులను తలపై ఒకేసారి ఉంచి, పైకి ఎత్తడానికి ప్రయత్నించండి. ఒక చేయి పడిపోవడం ప్రారంభిస్తే, స్ట్రోక్ ఉండవచ్చు. వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- నవ్వడానికి ప్రయత్నించినప్పుడు నోరు ఒక వైపు వంకర తిరగడం కూడా పక్షవాతానికి సంకేతం.
- తలనొప్పి. ఆకస్మిక, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, మైకము లేదా స్పృహలో మార్పు వంకటి లక్షణాలు కూడా స్ట్రోక్‌కు సంబంధించినవే కావచ్చు.
- నడవడానికి ఇబ్బంది... బ్యాలెన్స్ కోల్పోవడం.. సమన్వయం కోల్పోవడం కూడా ఉండవచ్చు.
- స్ట్రోక్‌కు సంబంధించిన ఏవైనా సంకేతాలు లేదా లక్షణాలను గమనించినా లేక అవి వచ్చి వెళ్లినట్లు అనిపించినా లేదా అవి పూర్తిగా అదృశ్యమైనప్పటికీ, వెంటనే వైద్య సహాయం తీసుకోండి. లేకపోతే స్ట్రోక్ తీవ్రత పెరుగుతుంది. పక్షవాతం తీవ్రమై అంగవైకల్యం ఏర్పడవచ్చు. చాలామంది స్పృహకోల్పోయి వెంటిలేటర్‌పైకి పోతారు.. ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.

గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు జాగ్రత్తలు ఒకే విధంగా ఉంటాయి. మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేసి కంట్రోలులో ఉంచుకోవాలి. ధూమపానం, మద్యపానం జోలికి పోకపోవడం మంచిది. నడవడం అలవాటు చేసుకోవాలి. ఊబకాయం తగ్గించుకోవాలి. 50 సంవత్సరాలు పైబడిన వారంతా గుండె పరీక్షలుతో పాటు కెరోటిడ్ డాప్లర్ పరీక్షలు ప్రతి సంవత్సరం చేయించుకోవడం ఉత్తమం. దీర్ఘకాలిక వ్యాధులు అని కూడా పిలువబడే నాన్‌కమ్యూనికేబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) దీర్ఘకాలికంగా ఉంటాయి. ఇవి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించని, జన్యు, శారీరక, పర్యావరణ, ప్రవర్తనా కారకాల కలయిక ఫలితంగా ఉంటాయి. ఏదిఏమైనా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే అన్ని విధాలా మంచిది.

# శ్వాస ద్వారా మైక్రోప్లాస్టిక్స్..

భారతదేశంలోని ప్రధాన నగరాల గాలిలో శ్వాసలోకి వెళ్లగల మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్లు రుజువైంది. 'ఎన్విరాన్మెంట్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైన తొలి సమగ్ర అధ్యయనం ఇవి ప్రస్తుత గాలి నాణ్యత సూచిక (ఎక్యుఐ) వ్యవస్థల్లో పట్టుబడని, కానీ ప్రమాదకరమైన దాగిన గాలి కాలుష్యంగా నిలుస్తున్నాయి. ఈ అధ్యయనం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై నగరాల్లోని జనసాంద్రత ఎక్కువగా ఉన్న మార్కెట్లలో గాలి కాలుష్యాన్ని పరిశీలించింది. భారత ప్రధాన నగరాల గాలిలో శ్వాసలోకి వెళ్లే మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇవి ఎక్కువసేపు గాల్లో తేలియాడుతూ, విషపూరిత పదార్థాలను మోసుకెళ్లి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు కలిగిస్తాయి. ప్రస్తుత ఎక్యుఐ లెక్కింపు విధానాల్లో ఇవి పరిగణనలోకి రాకపోవడం గమనార్హం. శ్వాస ద్వారా లోనయ్యే మైక్రోప్లాస్టిక్స్ అంటే...



10 మైక్రోమీటర్ల కన్నా చిన్నవైన గాల్లో తేలియాడే ప్లాస్టిక్ కణాలు. ఇవి నేరుగా వెళ్లి ఊపిరితిత్తుల లోతుల్లోకి చేరగలవు. సింథటిక్ దుస్తులు, టైర్లు–బ్రేకుల రాపిడి, ప్లాస్టిక్ ప్యాకేజింగ్, పెయింట్లు, సౌందర్య సాధనాలు, చెత్త దహనం వంటివి ఈ మైక్రోప్లాస్టిక్స్ పెరుగుదలకు కారణాలు. కొత్త గాలి కాలుష్కం గుర్తింపు: శ్వాస మైక్రోప్లాస్టిక్స్‌ను ప్రస్తుత ఎక్యుఐ సరైన విధంగా పట్టించుకోవడం లేదు.. ఇది నియంత్రణ లోపాన్ని చూపిస్తుంది. ఈ మైక్రోప్లాస్టిక్స్ తక్కువ గురుత్వాకర్షణ కారణంగా ఇవి ఎక్కువసేపు గాల్లో తేలియాడుతాయి. సీసం, క్యాడ్మియం వంటి భారీ లోహాలు, ఫ్తాలేట్స్ వంటి హార్మోన్ అంతరాయం కలిగించే రసాయనాలు అంటుకుని ఆరోగ్య ప్రమాదాన్ని పెంచుతాయి. ఢిల్లీ, కోల్‌కతాలలో స్థాయిలు ఎక్కువగా ఉన్నాయి. ముంబై, చెన్నైలో తీరప్రాంత వాతావరణం కాలుష్యాన్ని కొంత మేర చెలరేగిస్తుంది. పట్టణ ప్రజలు రోజుకు సుమారు 132 మైక్రోగ్రాముల మైక్రోప్లాస్టిక్స్‌ను శ్వాస ద్వారా లోనవుతున్నారు. ఫలితంగా ఊపిరితిత్తుల లోతుల్లోకి చేరి ట్రోజన్ హార్స్‌లా విషపదార్థాలను మోసుకెళ్లి హార్మోన్ రుగ్మతలు, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. వివిధ రకాల సూక్ష్మ జీవులను మోసుకెళ్లి, యాంటీబయాటిక్ నిరోధక శ్వాసకోశ సంక్రమణల ప్రమాదాన్ని పెంచుతాయి. వీటి నివారణకు సత్వర చర్యలు అత్యవసరం.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ఖమ్మం మురిసేలా శత వసంత ఉత్సవ ముగింపు సభ


సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



ప్రజాపక్షం/మణుగూరు : ఖమ్మం జిల్లా మురిసేలా సిపిఐ శత వసంతాల ఉత్సవాల సభను నిర్వహిస్తున్నట్లు సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎసకె.సాబీర్ పాష పేర్కొన్నారు. జిల్లాలో ప్రారంభమైన ప్రచార జాత రెండో రోజు ఆదివారం కొనసాగింది. పినపాక నియోజకవర్గం పరిధిలోని అశ్వాపురం మండలం నుండి ఆదివారం ప్రారంభమైన ఈ జాత మణుగూరు పినపాక కరకగూడెం గుండాల వరకు చేరింది. ఆయా మండల కేంద్రాల్లో ప్రచార జాతకు కమ్యూనిస్టు నాయకులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా సాబీర్ పాష మాట్లాడారు. సిపిఐ శత వసంతాన్ని పురస్కరించుకొని ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు దేశ నలుమూలల నుండి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు తరలి వస్తున్నారని, రెడ్ షర్ట్ వాలంటీర్ల ఎర్ర కవాతుతో ఖమ్మం నగరం ఎరుపెక్కనుందని చెప్పారు. దేశమే అబ్బురపడేలా ఈ ముగింపు ఉత్సవ సభ జరగనుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి ఉత్సవానికి తరలిరావాలని. నూతన ఉత్తేజంతో పదునెక్కిన ఉద్యమాలతో ప్రజాక్షేత్రంలో సమస్యల పరిష్కారం కోసం నవవసంతాన్ని ప్రారంభిద్దామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి బకాయిలు చెల్లించాలి

ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :సింగరేణి సంస్థ మనుగడ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 45 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ నర్సయ్య భవన్‌లో ఆదివారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల బహిరంగ సభకు సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం యూనియన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, అఫ్రోజ్ ఖాన్, ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, నాగభూషణ్, అద్దు శ్రీనివాస్, బాలకృష్ణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్



ప్రజాపక్షం/బెల్లంపల్లి : దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టి, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే చట్టాలు కేంద్రం తీసుకొచ్చిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బెల్లంపల్లి పట్టణంలో జీపు జాత నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన భగత్ సింగ్ విగ్రహానికి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి కలవేన శంకర్, మిట్టపల్లి వెంకటస్వామి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలవేన శంకర్ మాట్లాడుతూ 2014లో ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికి బిజెపి అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు, టెలికాం, గనులను, చివరకు రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరును మారుస్తూ గాంధీని అవమానపరుస్తున్నారని, స్వాతంత్రోద్యమంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి దేశభక్తి గురించి మాట్లాడటం శోచనీయమన్నారు. పార్టీ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ వెట్టిచాకిరి విముక్తికి, నిజాంను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణ త్యాగాలతో 3000 గ్రామాల విముక్తి, పది లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ఈనెల 10న రామకృష్ణాపూర్‌లో జరిగే సభను, 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, బొల్లం పూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, జాతీయ సమితి సభ్యులు అక్కపెల్లి బాపు, కొండు బానేష్, బొల్లం తిలక్ అంబేద్కర్, గుండ చంద్ర మాణిక్యం, డిఆర్ శ్రీధర్, కొంకుల రాజేష్, రత్నం రాజం, బొల్లం సోని, బియ్యాల ఉపేందర్, మంతెన రమేష్, కంబాల చందు, బండారి శంకర్, రత్నం ఐలయ్య, బొంకురి రామచందర్, ఇనుముల రాయమల్లు, గుండా శంకర్, పాఠకుల సౌజన్య, నస్పూరి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## 47 కార్మిక చట్టాలు సాధించిన ఘనత సిపిఐది

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు విలాస్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : 47 కార్మిక చట్టాలను సాధించిన ఘనత సిపిఐ పార్టీదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18న ఖమ్మం పట్టణంలో నిర్వహించ తలపెట్టిన భారీ శత వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి బూక్య రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విలాస్ మాట్లాడుతూ దున్నే వానికే భూమి, బ్యాంకుల జాతీకరణ, ఉపాధి హామీ పథకం(యంజిఎన్‌ఆర్‌ఇజిపి) సమాచార హక్కు చట్టం వంటివి తీసుకురావడంలో సిపిఐ చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. జిల్లా కార్యదర్శి భూక్య రమేష్ మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే చారిత్రాత్మక సభకు జిల్లానుంచి నాయకులు, కార్యకర్తలు జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.యన్.రెడ్డి, ఎఐటియుసి నాయకులు బాబులాల్, వెంకటేశ్వర్లు రావు తదితరులు పాల్గొన్నారు.



# వెనిజులాపై అమెరికా సైనికదాడి దుర్మార్గం

సిపిఐ. ప్రజాసంఘాల నిరసన






ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వెనిజులాకు మద్దతుగా ఆ దేశంపై అమెరికా చేసిన తాజా దాడికి నిరసనగా, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లా కౌన్సిల్ సహకారంతో హనుమకొండ జిల్లా నక్కలగుట్టలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని హరించేవిధంగా, అలాగే అధ్యక్షుడు నికోలస్ మదూరో, ఆయన కుటుంబ భద్రతకు ముప్పుగా మారిన అమెరికా సైనిక చర్యలను నిరసనకారులు తీవ్రంగా ఖండించారు. శాంతి కోసం, అధ్యక్షుడు మదూరోను వెంటనే విడుదల చేయాలని, వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ అమెరికా చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, అధ్యక్షుడు నికోలస్ మదూరో, ఆయన కుటుంబాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని ఆయన అన్నారు. సామ్రాజ్యవాద శక్తుల అన్యాయ చర్యలను అడ్డుకోవడానికి ప్రపంచం ఏకతాటిపై నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నిరసనలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,ఐఎఎల్ రాష్ట్ర కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు సి.వై.రాఘవరావు, జనరల్ సెక్రటరీ ఎన్.రాజమౌళి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సాంబయ్య, రవీందర్‌రావు, షామ్ కృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఎం.రామస్వామి, ప్రభాకర్, అనుముల రమేశ్, రచయితల సంఘం నాయకులు కె.ప్రదీప్, పర్వీన్ కుమార్, శ్రీనివాస్, నాగరాజు,టి. జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం సిపిఐ జగద్గిరిగుట్ట శాఖ ఆధ్వర్యంలో గుట్ట ఔటపోస్ట్ దగ్గర ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్‌లు మాట్లాడుతూ అత్యధిక చమురు నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా అని, ఆ నిల్వలను దోచుకోవాలనే నీచ కుట్రలతో, సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశా నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్రవేసి అరెస్టు చేయాలనుకోవడం ఆధునిక వలసవాద దురహంకారానికి ప్రతిరూపమన్నారు. అంతర్జాతీయ సమాజం ఈ దుర్మార్గమైన అరెస్టులను ఖండించాలన్నారు. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని తక్షణమే ఆపాలనీ, ఆ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, భారత ప్రభుత్వం కూడా సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి సహదేవ్‌రెడ్డి, సిపిఐ నాయకులు రవి, సామెల్, నారాయణ, యాదగిరి, సైదులు, వెంకన్న, యాకయ్య, ఆశప్ప, రాములు, రమేష్, సత్తయ్య, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## మైనంపల్లి ఇంటికి వెళ్లి కలిసిన జిహెచ్‌ఎంసి డిసి గోపాలరావు



ప్రజాపక్షం/మల్కాజిగిరి : అధికారులు కాంగ్రెస్ ప్రధాన నేతల ఇళ్లకు వెళ్లి ప్రసన్నం చేసుకొంటున్న ఉదంతం మల్కాజిగిరి నియోజకవర్గంలో చోటు చేసుకొంది. జిహెచ్‌ఎంసి గ్రేటర్ మహానగరంగా విస్తరించిన క్రమంలో జిహెచ్‌ఎంసి మౌలాలి సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు నూతనంగా ఏర్పాటు చేసి ఆ కార్యాలయ అధికారిగా డిప్యూటీ కమిషనర్ హోదాలో గోపాలరావును నియమించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను కార్యాలయంలో ఈ ప్రాంత పరిధిలోని వివిధ రాజకీయ నేతలు, కార్పొరేటర్లు ఒక్కరొక్కరే మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా డిప్యూటి కమిషనర్ గోపాలరావు ఆదివారం నేరుగా కాంగ్రెస్ సీనియర్ నేత, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఇంటికి వెళ్లి మరీ కలిసి బొకే స్వీకరించటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

## కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని దుండిగల్‌కు మార్చాలని ఎమ్మెల్యేకు వినతి



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సూరారంలో ఓ అద్దె భవనంలో పనిచేస్తున్నదని ఈ కార్యాలయానికి ప్రతిరోజూ అనేక మంది ప్రజలు భూముల రిజిస్ట్రేషన్, ఇండ్ల క్రయ, విక్రయాల, రిజిస్ట్రేషన్ తదితర అవసరాల నిమిత్తం వస్తుంటారనీ. అయితే ప్రస్తుత కార్యాలయ పరిసర ప్రాంతంలో తగిన స్థలం లేకపోవడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని దుండగల్ మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కెపి వివేకానందను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రధానంగా, సూరారం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద వాహనాల రాకపోకల కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందనీ సరైన పార్కింగ్ సదుపాయం లేక ప్రజలు రహదారులపై వాహనాలు నిలపాల్సి వస్తోందనీ, చిన్న స్థలం కారణంగా కార్యాలయంలో ప్రజలు వేచి ఉండడానికి కూడా తగిన సౌకర్యాలు లేవు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అద్దె భవనంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని దుండిగల్ మండల మునిసిపల్ కార్యాలయ పక్కన ఖాళీగా ఉన్న భవనానికి మార్చాలని దుందిగల్ మండల కార్యాలయంలో విశాలమైన స్థలం ఉండటంతో పాటు, అదే ప్రాంగణంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం కూడా ఉన్నాయని, కాబట్టి ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని, క్కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సూరారం నుండి దుందిగల్ మండల కార్యాలయానికి మార్చాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, అరుణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నీలిమ హాస్పిటల్ సౌజన్యంతో హెల్త్ క్యాంప్‌ను బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిహెచ్‌ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ 6వ వార్డు బ్రుక్ బాండ్ కార్మిక సంఘం ఆవరణలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని కొనసాగుతుందన్నారు. ఈహెల్త్ క్యాంపులో 800 మంది వివిధ రోగాలకు సంబధించిన ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్ రావు,మాజీ కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్,నాయకులు షకీల్,రామాంజి,ఎంఎ ఖలీల్,శావాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు సోషల్ మీడియా సభ్యులు ఎండి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్ డివిజన్‌లో ఈటల పర్యటన



ప్రజాపక్షం/మల్కాజిగిరి : ఆర్‌కె పురం రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులు చేపట్టనున్న దృష్ట్యా ఈ ప్రాంతంలో నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో కల్సి ఆయన డివిజన్‌లోని పల్లవి విల్లాస్ అపార్ట్‌మెంట్, ఆఫీసర్స్ కాలనీ ప్రాంతాలను సందర్శించారు. ఆర్‌కె పురం ఆర్‌ఓబి బ్యూటిఫికేషన్ల కారణంగా తమ ఇళ్లపై ప్రభావం కనపరచనుందని ఇక్కడ నివసిస్తున్న సీనియర్ సిటిజన్లు, మాజీ సైనికులు వాపోయారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు ఆర్‌కె శీను, భాను ప్రకాష్, కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, గోపు రమణారెడ్డి, శర్మ, పురాస్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రేక్ ఫాస్ట్ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పిఎసి చైర్మన్ గాంధీ

ప్రజాపక్షం / కూకట్‌పల్లి : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఆదివారం కాలనీలో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ ఆత్మీయ సమావేశంలో పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సప్తగిరి కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు, నాలకు ఇరువైపులా ప్రహరీ గోడ నిర్మాణం, కాలనీ రోడ్లపై స్పీడ్ బ్రేక్‌లు, వీధి దీపాలు పలు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ అందరి సహకారంతో కాలనీలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సిడిఎఫ్ నిధుల నుండి ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామన్నారు. రోడ్లను దశల వారిగా చేపట్టి పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని, ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, శర్మ, మల్లయ్య, హర్ష, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# కార్మికుల హక్కులు కాలరాస్తున్న బిజెపి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్



ప్రజాపక్షం/ కుత్బుల్లాపూర్ : కార్మికుల హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ పేర్కొన్నారు. ఆదివారం అస్‌బెస్టాస్ కాలనీ భవన నిర్మాణ కార్మిక అడ్డా వద్ద హరినాథ్ రావు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాజ్‌గిరి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం కాలరాసి నూతన కార్మిక లేబర్ కోడ్స్‌ను తీసుకుని వచ్చి కార్మికుల కనీస హక్కులైన ప్రమాదపు జీవిత భీమా, పని గంటలు, ఇఎస్‌ఐ, పిఎఫ్‌లాంటి సౌకర్యాలను కార్మికులకు లేకుండా చేస్తుందని, కార్మికులంతా ఏకమై పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకోవడానికి మరో పోరాటం నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అదే విధంగా భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డు కోసం వేలిముద్రలు ప్రమాద భీమా లాంటి సౌకర్యాల కోసం ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడం దారుణమని వెంటనే గతంలో ఉన్నట్టు విధానాలను కొనసాగించాలని దానికోసం భవన నిర్మాణ కార్మికులంతా ఏకం కావాలని లేకపోతే చట్టం నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు లక్షలాదిమంది కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవణ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ స్వామి, యాకోబ్, సామిల్, రవి, యాదగిరి, కృపాకర్, బాలాజీ, నాగప్ప, దావీదు, చారి తదితరులు పాల్గొన్నారు.

## మేకలు, గొర్రెల నుంచి రక్తాన్ని సేకరించి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : నిబంధనలకు విరుద్ధంగా మేకలు, గొర్రెల నుంచి రక్తాన్ని సేకరించి విక్రయిస్తున్న చికెన్ అండ్ మటన్ దుకాణంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల నుండి 130 బ్యాగుల్లో నిల్వ చేసిన రక్తం బ్యాగులను స్వాధీనం చేసుకొన్నారు. నాగారం సమీపంలోని సత్యనారాయణ కాలనీలో చికెన్ అండ్ మటన్ దు కాణంలో గత కొద్ది రోజులుగా జీవాల నుంచి రక్తం సేకరిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు కీసర ఇన్స్పెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున పోలీసులు దాడులు చేసారు. ఈ దాడుల్లో దుకాణ యజమాని సుందర్ సోను, అతడి వద్ద పని చేసే అఖిల్ అనే వ్యక్తి తో కల్సి మేకలు, గొర్రెల నుండి రక్తాన్ని సేకరించి కాచిగూడలోని సిఎన్‌కె ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు విక్రయించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకొంటున్నట్లు విచారణలో తేలింది. ఈ రక్తాన్ని ల్యాబరేటరీల్లో వినియోగించే షీప్ బ్లడ్ అగర్ ప్లేట్ల తయారీకి ఉపయోగిస్తున్నారని నిందితులు తెలిపారు. అదుపులోకి తీసుకొన్న నిందితులిద్దరిని జిహెచ్‌ఎంసి, వెటర్నరీ విభాగ అధికారులకు తదుపరి దర్యాప్తు నిమిత్తం అప్పగించామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## వెనిజులాపై అమెరికాదాడిని నిరసిస్తూ ఎఐవైఎఫ్ ధర్నా



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : వెనిజులాపై అమెరికా సైనిక దాడికి పాల్పడి ఆ దేశ అధ్యక్షుడు మధురోను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఎఐవైఎఫ్ ఆదివారం ధర్నా నిర్వహించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఎఐవైఎఫ్ శ్రేణులు పెద్ద సంఖ్యలో మల్లాపూర్ ఎలిఫెంటా కూడలి వద్ద ప్లేకార్డులు చేతబూని ట్రంప్‌కు వ్యతిరేక నినాదాలతో ధర్నా చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ ప్రపంచ దేశమైన వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను తీవ్రంగా ఖండిస్తూ ట్రంప్ అహంకార పూరితంగా ఆ దేశ ప్రజలు ప్రజాస్వామ్యంగా ఎన్నుకొన్న దేశాధ్యక్షుడిపై దాడి చేసి అరెస్టులు చేయటం అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కుకు ఐక్యరాజ్య సమితి నియమ నిబంధనలను కాలరాచటమేనన్నారు. ప్రపంచంలో చములు నిక్షేపాలు అధికంగా కల్గి ఉన్న వెనిజులా దేశంపై దాడితో దోచుకోవలన్నదే ట్రంప్ ప్రధాన లక్ష్యమన్నారు. అమెరికా దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వెనిజులా ప్రజా పోరాటాలకు ఎఐవైఎఫ్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్‌కు చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర సురేందర్, మధు, పవన్, చందు, ఎఐఎస్‌ఎఫ్ నేతలు మహేష అతీఫ్, దీపక్, పుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి



ప్రజాపక్షం/శామీర్‌పేట : వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట. జగ్గంగూడ, తూంకుంట గ్రామాల్లో ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిఐ శంకరయ్య ట్రాఫిక్ ఎస్‌ఐలతో కలిసి రోడ్డు భద్రత వారోత్సావాల్లో భాగంగా ప్రజలకు, వాహనాదారులకు వీడియోలు, ఫ్లెక్సిలు, ఫోటోగ్రాఫ్‌ల ద్వార ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లు నడిపే డ్రైవర్లు తప్పకుండా సీటు బెల్ట్ ధరించాలని తమ వాహనాలకు సంబందించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ట్రాపిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

## పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటా



ప్రజాపక్షం/కాప్రా : పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ కార్పొరేటర్‌గా రెండు పర్యాలయాలు ఎన్నికైన పన్నాల రాజకీయాలకు తావివ్వకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపించటాన్ని అభినందించారు. కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ల పునర్విభజన కారణంగా డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు శక్తి సాయినగర్ డివిజన్‌లో కలిసి పోయాయని, దీని వల్ల అభివృద్ధి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. ఈ రెండు డివిజన్లలోనూ రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థులు సంపూర్ణ మెజారిటితో విజయం సాధించేందుకు కార్యకర్తలందరూ సమిష్టిగా ముందుకెళ్లాలని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని సూచించారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కుల రక్షణకు విద్యాశాఖ కృషి

### మేడిపల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/బోడుప్పల్ : ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కుల రక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మేడిపల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్ వద్ద జిల్లా స్థాయి టీచర్స్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మేడిపల్లి బోడుప్పల్ ఎంఇఒ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ టీచర్ల సమస్యలను గుర్తిస్తుందని, వారికి కూడా హక్కులు ఉన్నాయని వాటి అమలుకు తప్పక ప్రయత్నిస్తున్నామన్నారు. రెండవ శనివారం సెలవు తప్పక ఇవ్వాలని, ఇవ్వని పాఠశాలల అంశం మా దృష్టికి తీసుకువస్తే ఆ స్కూల్స్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాసంస్థలు అన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు అనేకం ఉన్నాయని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అలాగే టీచింగ్ ఫీల్డ్ చాలా బాధ్యతతో కూడుకున్నదని విద్యార్థులను బాగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. దేశ భవిష్యత్ విద్యారంగం మీదే ఆధారపడి ఉంటుందని ఉపాధ్యాయులు ముఖ్యం కాబట్టి సైంటిఫిక్‌గా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఏ.విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రైవేట్ టీచర్స్ విద్యారంగానికి చేస్తున్న సేవలు చాలా విలువైనది. అందుకే ప్రభుత్వం వీరి సమస్యలు తప్పక పరిష్కరించాలి. ఇఎస్ఐ, పిఎఫ్, బీమా లు తప్పక ప్రతి పాఠశాల అమలు చేయాలి. ప్రైవేట్ టీచర్స్‌కి ప్రభుత్వం ఒక కార్పొరేషన్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి దానికి ఫండ్స్ కేటాయించాలని, ప్రతి టీచర్ సర్వీస్‌ను మొదటి రోజు నుంచి లెక్కకట్టాలి. అలాగే సావిత్రి బాయి స్ఫూర్తితో టీచర్స్ ఐక్యం అయ్యి పోరాడాలని పిలుపునిచ్చారు. సభ అనంతరం ఈ కార్యక్రమానికి సురేందర్ అధ్యక్షత వహించగా, అతిథులుగా టిపిటిఎల్‌ఎఫ్ టిఎల్‌పిఎల్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్, పి.విజయ్, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యవాణి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, హైద్రాబాద్ నాయకుడు జావేద్, రాజన్న లు హాజరు కాగా, స్కూల్ ప్రిన్సిపాల్స్ ప్రవీణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు పాతవేనా!

### మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ సందిగ్ధత



ప్రజాపక్షం/ వికారాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పుపై సందిగ్ధత నెలకొంది. పత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా లేక రిజర్వేషన్లను కొత్త మరుస్తారా అనే దానిపై పెద్ద ఎత్తున చర్చసాగుతుంది. ఎన్నికల సంఘం ఓటరు జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇప్పటికే విడుదల చేసిన విషయం తెలిసిందే దీంతో ఇప్పటికే వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలను ప్రకటించిదన్నారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించి పదో తేదీనా తుదిఓటరు జాబితా విడుదలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 11న నోటిపికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. 5,6 తేదీల్లో రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటుకు ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఈనెల 5వ తేదీన మున్సిపాల్‌లోని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో 6వ తేదీ అయా పార్టీలతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు తీసుకుని అవసరమైతే మార్పులు, చేర్పులు చేపట్టనున్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపల్ , వికారాబాద్, పరిగి, తాండూర్,కొడంగల్ వార్డుల వారీగా ముసాయిదా జాబితా సిద్ధం చేశారు. వికారాబాద్ మున్సిపల్ 34 వార్డులు 58,117 ఉన్నారు. స్థానిక సంస్థల్లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలకు రిజర్వేషన్ విధానం ఉండేలా నిబంధనలు తీసుకొచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దానిని పక్కన పెడుతోంది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ వంద శాతం ఎస్‌టి గ్రామాలను మినహాయించి మిగితా వాటిల్లో రోటేసన్ పద్ధతిని అవలంబించింది. దీంతో బిసి రిజర్వేషన్లు జనరల్ బిసికి ఎస్‌సి స్థానాలు బిసి, బిసిగా మరినవి చాలా ఉన్నాయి. అయితే అదే పద్ధతిని మున్సిపల్ ఎన్నికల్లో అవలంభిస్తుందా లేక 2020 ఎన్నికల సమయంలో అమలు చేసే రిజర్వేషన్లనే కొనసాగిస్తుందా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేయడం , ఎన్నికల కమిషన్ కూడా ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల చేయడంతో ఆశావహుల్లో ఆసక్తి మొదలైంది. సంవత్సర కాలంగా మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడొస్తాయని ఎదురుచూస్తున్నా వారంతా ప్రస్తుతం పోటీ చేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అధికారులు ,ముఖ్యనేతల వద్ద రిజర్వేషన్లు మారుతాయా ,లేక పాయవాటినే కొనసాగిస్తారా అనే దానిపై ఆశావహులు ఆరా తీస్తున్నారు.

## దమ్మాయిగూడలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం



ప్రజాపక్షం/నాగారం : పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలకు నిదర్శనంగా ఉంటుందని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.ఆదివారం జిహెచ్‌ఎంసి దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని భవాని నగర్‌లో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజలు చేసి ప్రారంభిచారు. తమకు రూ.5 లక్షలు సాయం చేసి ఇందిరమ్మ ఇళ్లను అందజేయడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోగుల సరితవెంకటేష్,నాగారం వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం



ప్రజాపక్షం/చర్లపల్లి : కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శివసాయి నగర్ కాలనీలో ఆదివారం సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని లక్ష్మారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి,అశోక్,రామచంద్రారెడ్డి, కాసులు సురేష్ గౌడ్,నారా నర్సింహులు, నాయకులు మహేష్‌గౌడ్,పాండాల శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్‌లో సమస్యలపై బండి రమేష్ పాదయాత్ర నిర్వహించారు. ముఖ్యంగా కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కాలనీ పరిధిలో ఉన్న దాదాపు 80శాతం పార్కు స్థలాలు కబ్జా అయ్యాయని ప్రజలు రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రమేష్ వెంటనే హైడ్రా ఇన్స్‌పెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, వీలైనంత త్వరగా లే అవుట్ పరిధిలోని పార్కు స్థలాలు అన్నింటిలో ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించాలని సూచించారు. మౌలిక సదుపాయాలైన రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను కూడా పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం కెపిహెచ్‌బి కాలనీ రమ్య గ్రౌండ్‌లో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో బండి రమేష్ పాల్గొని బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళ నాయకురాళ్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



ప్రజాపక్షం/నాగారం : నవ భారత రాజ్య నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు,మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు.ఆదివారం జిహెచ్‌ఎంసి 4వ డివిజన్ పరిధిలోని ఆర్‌జికె కాలనీలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 200 జ్ఞాన మాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మాజీ చైర్మన్ ప్రణీతగౌడ్,రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు గోగుల సరితవెంకటేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగశ్వేత,కీసర ట్రస్టు బోర్డు సభ్యులు ప్రసాద్‌గౌడ్,మాజీ కౌన్సిలర్లు నానునాయర్,మంగళపురి వెంకటేష్,భాస్కర్‌గౌడ్,శ్రీకాంత్‌గౌడ్,జాతీయ మాల మహనాడు సంఘం జిల్లా కన్వీనర్ గుజ్జుక పరశురాం,యాటరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.ఆదివారం ఆయన నివాసంలో జిహెచ్‌ఎంసి సర్కిల్ 6లో ఘట్‌కేసర్ ఈడబ్ల్యూస్ కాలనీకి చెందిన సూర్యదేవ్ మోరే మంజూరైన రూ. 55 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్,మాజీ సర్పంచ్‌లు అబ్బసాని యాదగిరి యాదవ్, మేడబోయిన వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కెటిఆర్‌ను కలిసిన అనం శశిధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** నూతన సంవత్సరం పురస్కరించుకొని బిఆర్‌ఎస్ పార్టీ కొండాపూర్ సీనియర్ నాయకులు అనం శశిధర్ రెడ్డి తన కుటుంబంతో కలసి తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కెటిఆర్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో అనం శశిధర్ కుమార్తె శ్రియ రెడ్డి, కుమారుడు అరుష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సర్పంచ్‌లు ముందుండి పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నూతన సర్పంచ్‌లు ముందుండి పనిచేయాలని ఇబ్రహీంపట్నం మాజీ శాసన సభ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన కృష్ణ, వార్డుమెంబర్లు పార్టీ నాయకులు మాజీ ఎంఎల్‌ఎ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ప్రజాప్రతినిధులు, నాయకులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పాలన పట్ల దృష్టి సారించాలన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించడంలో ముందుండి పనిచేయాలన్నారు. నూతన సర్పంచ్‌కు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణ పాండురంగారెడ్డి,మాజీ ఉప సర్పంచ్ వర ప్రసాద్‌రెడ్డి గ్రామానికి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీకి నాయకులు, కార్యకర్తలే బలం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** పార్టీకి నాయకులు, కార్యకర్తలు బలమని బిఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గోపన్‌పల్లి తాండకి చెందిన పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువకులు బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఖాజాగూడలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారిని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా బిఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసి రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లను, ఎమ్మెల్యేలను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు రాగం జంగయ్య యాదవ్, రాజు ముదిరాజ్, దార్గుపల్లి నరేష్, రాము, పరుశరామ్, ప్రవీణ్, నర్సింగ్, లడ్డు, శివ, హేమంత్ నాయక్ పాల్గొన్నారు.

## అయ్యప్ప పూజలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బియన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో ఆదివారం మాదగోని రవి గౌడ్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమంలో బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కార్పొరేటర్ లచ్చిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జగన్నాథం, విష్ణువర్ధన్ రెడ్డి, విఠల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హయత్ నగర్ డివిజన్‌లోని శుభోదయ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నికవడం పట్ల హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అభినందించారు. ఆదివారం కాలనీ వాసులు ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గంలో భాగంగా నూతన సభ్యులను కార్పొరేటర్ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారం కావాలంటే కాలనీ సంక్షేమ సంఘం తోడ్పాటు అవసరమన్నారు. కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు సంగాని శ్రీనివాస్, కాలనీ గౌరవ అధ్యక్షులు ఈటగోని నరసింహ, శ్రీనివాస్ గౌడ్, కాలనీ నూతన అధ్యక్షులు డి. గోపాల్ సభ్యులు సతీష్, శ్రీనివాస్, సంతోష్ అశోక్, శక్తి సింగ్, ఎర్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సంస్కృతికి చిహ్నం సంక్రాంతి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** సంక్రాంతి పండగ సంబరాల్లో భాగంగా గడ్డి అన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వివేకానంద బస్‌స్టాప్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో భాగంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ చిహ్నం అన్నారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివేక్ పల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్, రమణారెడ్డి, యాద శంకర్, ప్రతీక్,రవీందర్ రెడ్డి, వీక్షి,ప్రదీప్, విజయ లక్ష్మి, భాస్కర్, మోహన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## తస్మాత్ జాగ్రత్త
# సంక్రాంతికి ఊరెళ్తున్నారా?

డయల్ 100కు ఫోన్ చేయండి..
పోలీసులకు సమాచారమివ్వండి
విలువైన వస్తువులు
లాకర్లలోనే భద్రపరుచుకోండి
నగరవాసులకు సిపి సజ్జనర్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే నగరవాసులకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి.సజ్జనర్ తస్మాత్ జాగ్రత్త అంటూ పలు కీలక సూచనలు చేశారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటికెళ్లే వారు.. వెళ్లే ముందు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నగరవాసులను అప్రమత్తం చేశారు. పండుగ వేళ చాలామంది కుటుంబ సమేతంగా ఊర్లకు వెళ్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశముందని సిపి పేర్కొన్నారు. ప్రయాణానికి ముందే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ, బీట్ ఆఫీసర్‌కు గానీ సమాచారం ఇస్తే, పెట్రోలింగ్‌లో భాగంగా సిబ్బంది ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతారని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదని సిపి సజ్జనార్ ప్రజలకు హితవు పలికారు. వాటిని బ్యాంకు లాకర్లు, ఇతర సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవడం ఉత్తమమని సూచించారు. ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలను నివారించవచ్చని, తద్వారా పండుగను ప్రశాంతంగా జరుపుకోవచ్చని పేర్కొన్నారు. ఆధునిక పోలీసింగ్ అంటే కేవలం నేరాలు జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదని, నేరాలను ముందుగానే నివారించడం కూడా అని ఆయన అభిప్రాయపడ్డారు. పండుగ సీజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ఇళ్ల భద్రతకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అత్యవసర సమయంలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సిపి సూచించారు.

## ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు
# లైసెన్స్ లేకుంటే కఠిన చర్యలు

ఇంటెలిజెన్స్ అదనపు
డిజి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రైయివేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ యాక్ట్ 2005 (పిఎస్‌ఎఆర్‌ఎ) ప్రకారం సరైన లైసెన్స్ లేకుండా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కంట్రోలింగ్ అథారిటీ స్పష్టం చేసింది.ఈ మేరకు ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ఆదివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. సిద్ధిపేట కమిషనరేట్ పరిధిలో నమోదైన ఓ హత్య కేసులో రంజిత్ పాండే అలియాస్ రంజిత్ రాజ్, రితేష్ కుమార్ రాయ్ అలియాస్ రితేష్ రాజ్ అనే ఇద్దరు సెక్యూరిటీ గార్డులు నిందితులుగా ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. నిందితులు పనిచేస్తున్న సంస్థకు లైసెన్స్ లేదని విచారణలో బయపడింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని అన్ని సెక్యూరిటీ ఏజెన్సీలపై ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సంస్థ యజమానిపై కేసు నమోదు చేసినట్లు విజయ్‌కుమార్ వెల్లడించారు. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు సరైన పిఎస్‌ఎఆర్‌ఎ లైసెన్స్ లేకుండా సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లను నియమిస్తున్నట్లు కూడా కంట్రోలింగ్ అథారిటీ గుర్తించినట్లు ఆయన తెలిపింది. పిఎస్‌ఎఆర్‌ఎ చట్టం సెక్షన్ 20 ప్రకారం లైసెన్స్ లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమిస్తే యజమానికి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా రూ.25,000 వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని విజయ్‌కుమార్ హెచ్చరించారు. లైసెన్స్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు తప్పనిసరిగా www.psara.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మహిళల భద్రతపై 'ఒక నిమిషం' చలన చిత్రంకు ఎంట్రీల ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల భద్రత, బాలల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు మహిళల భద్రత విభాగం, యూనిసేఫ్, అన్నపూర్ణ ఫిల్మ్ అండ్ మీడియా కళాశాలల భాగస్వామ్యంతో 'ఒక నిమిషం' చలనచిత్రోత్సవాన్ని ప్రారంభిస్తున్నట్లు అదనపు డిజి చారుసిన్హా ఆదివారం ప్రకటించారు. ఇందుకోసం ఇక నిమిషం వీడియోలను ఆహ్వానిస్తున్నామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు, యువ చిత్రకారులు ఈ పోటీలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. ఒక నిమిషం నిడివి గల ఆలోచనాత్మక చిత్రాలు సమాజ ప్రవర్తనను ప్రభావితం చేసి చర్చకు దారి తీయగలవన్నారు. చిత్రాలు ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషల్లో రూపొందించవచ్చని, అయితే ఏ విధమైన ఏఐ సాధనాలను ఉపయోగించరాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 30మాస్ కమ్యూనికేషన్ కళాశాలలను సంప్రదించనున్నట్లు, మార్చి 9న అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చారుసిన్హా వెల్లడించారు. మహిళలు గౌరవంగా, పిల్లలు రక్షణతో జీవించే తెలంగాణను నిర్మించేందుకు అందరం కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# సకల సౌకర్యాలతో విద్యనందించాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సకల సౌకర్యాలతో షాద్‌నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామీణ పేద విద్యార్థులకు ప్రభుత్వపరంగా మెరుగైన విద్య అందించాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దాతల సహకారంతోపాటు తన సొంత ఖర్చులతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆదివారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే విధంగా నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నాటికి పేద విద్యార్థులకు అందుబాటులోకి ప్రభుత్వ జూనియర్ కళాశాలను తీసుకువచ్చేందుకు పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఆర్థికంగా ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ, సహకారాలు తీసుకోకుండా దాతల సహకారం సొంత ఖర్చులతో జూనియర్ కళాశాలను రాష్ట్రానికే ఆదర్శంగా ఉండే విధంగా నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు గుర్తు చేశారు. కళాశాల నిర్మాణానికి సహకరించిన దాతలకు పేరు పేరున అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిసిలు సంఘటితమైతే రాజ్యాధికారం సాధ్యం

బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలంతా సంఘటితంగా ముందుకొచ్చినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు కాటం నర్సింహ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. దేశ జనాభాలో అత్యధికులైన బిసిలకు రాజకీయపరంగా తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో లోపంగా కనపడుతుందన్నారు. కేంద్రం జనగణనలో కులగణన చేపడుతాననడం సామాజిక న్యాయానికి ఇదొక ముందడుగు అన్నారు. బిసిలపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రత్యేక అట్రాసిటీ చట్టాన్ని తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్, పరిషత్తు ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. పూలే దంపతులు, పెరియార్, నారాయణగురు, రామ్‌మనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్, అంబేద్కర్ మహనీయుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సమానత్వ లక్ష్య సాధనకు బిసిల ఐక్యత మరింత బలపడాల్సిన అవసరం ఉన్నదన్నారు. సమావేశంలో మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, రాష్ట్ర బిజెపి మోర్చా అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, బిసి నేతలు నిరంజన్ యాదవ్, నగర అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, వైవీ. శ్రీధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మిలినియర్ మైండ్‌సెట్ అలవర్చుకోండి

లా ఆఫ్ అట్రాక్షన్ కోచ్ కల్పన



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ప్రతి ఒక్కరూ మిలినియర్ మైండ్ సెట్ అలవర్చుకోవాలని లాఆఫ్ అట్రాక్షన్ కోచ్ కల్పన సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'మిలినియర్ మైండ్ సెట్ లా ఆఫ్ అట్రాక్షన్ సెషన్' కార్యక్రమం కల్పన అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో నిజ జీవితంలో లక్ష్యాల సాధన వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. సెలబ్రిటీ డాక్టర్ చిట్టో రాజేశ్, దర్శకులు కాచిడి గోపాల్‌రెడ్డి, నేతలు విశ్వం ఉరుమల్ల, అబ్దుల్ షుకర్, యూట్యూబర్ నవీన్ పట్నాయక్, శింబు వంటి 100 మంది వ్యాపారవేత్తలు, వృత్తి నిపుణులు పాల్గొని, మాట్లాడారు. భవిష్యత్తులో తెలంగాణవ్యాప్తంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కల్పన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అబిడ్స్‌లోని తమ బ్రాంచి నందు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భవన నిర్మాణ కార్మికులు అందరూ లేబర్ గుర్తింపు కార్డులు తీసుకోవాలని రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి అనుబంధం)నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటియుసి,తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్నక్షన్ వర్కర్స్ యూనియన్ రాజేంద్రనగర్ మండలం సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎఆర్ దేవరాజ్ భవన్ లో నిర్వహించిన లేబర్ కార్డులు, శ్రమ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాలు నర్సింగ్ రావు, బిఓసి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, కౌన్సిల్ సభ్యులు జి.ఆనంద్‌గౌడ్, రాజేందర్ నగర్ మండల సహాయ కార్యదర్శి షేక్ షఫీ, సభ్యులు సదానందగౌడ్, సయ్యద్ కాజా, సిహెచ్ నర్సిరెడ్డి సాబీర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికో మనిషి.. ఊరికో బండి.. ఖమ్మం రండి



సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు హలో కామ్రేడ్..చలో ఖమ్మం అనే నినాదంతో ప్రతి ఇంటికి ఒక మనిషి ప్రతి ఊరికి ఒక బండి తరలిరావాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కె.రామస్వామి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం లో సిపిఐ చేపట్టిన రెండవ రోజు ప్రచార జీపు యాత్ర ఆదివారం మొయినాబాద్ మండలం వెంకటపూర్ గ్రామం నుంచి ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ మొయినాబాద్ మండల కేంద్రంలో మండల కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు మొయినాబాద్ మండలం నుంచి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం ప్రబులింగం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ బికేఎంయు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్ ఎండి జలీల్ వెంకటయ్య కళాకారుడు నరసింహ రాములు మల్లేష్ పాండు నరసింహులు వెంకటమ్మ భాగ్యమ్మ సుశీల తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** జనవరి 18న ఖమ్మం లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓరుగంటి యాదయ్య పిలుపునిచ్చారు ఆదివారం తుర్క యంజల్ మున్సిపాలిటి సమితి కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్ అధ్యక్షతన తుర్కయంజాల్ సమితి సమావేశం జెఎన్ఎన్ యుఆర్ఎం కాలనీలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి శివకుమార్ గౌడ్, సిపిఐ నాయకులు శివప్రసాద్, రోజా, సుందరమ్మ, నాగేశ్వర్ ,శివ, భాస్కర్, నీలా, శశికళ తదితరులు పాల్గొన్నారు

# మహిళల్లో సృజనాత్మకతకు ప్రతీక ముగ్గులు





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లెలగూడ కార్పొరేషన్ డివిజన్ న్యూవెంకటేశ్వర కాలనీలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆటా అధ్యక్షుడు జల్లా జయంత్‌రెడ్డి, మాజీ టిడిఎఫ్ అధ్యక్షురాలు చల్లా కవిత హాజరై మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకతకు ముగ్గులు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. నిర్వాహకులు, బిఆర్‌ఎస్ డివిజన్ నాయకులు మేకల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీయడానికి ముగ్గులు దోహదం చేస్తాయన్నారు. ముగ్గుల పోటీల్లో మహిళలు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారని అభినందనలు తెలిపారు. ముగ్గుల పోటీల్లో సుమారు వందమంది మహిళలు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న మహిలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పోటీలకు జడ్జీలుగా స్వరూపారాణి, ప్రవశ్య, వనజ, కంచర్ల సరిత వ్యవహరించగా శంకర్‌నాయక్, బి.కృష్ణారెడ్డి, కందాల బాబు, శ్రీధర్‌రెడ్డి, నర్సింహా, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, కంచర్ల విమల్‌కుమార్‌తో పాటు పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు.

# రీల్

## రజనీకాంత్@173



రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై తలైవర్ రజనీకాంత్ 173 చిత్రం షూటింగ్ ప్రారంభమయింది. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో వచ్చే ఈ చిత్రానికి సిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తారు. రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మాణంలో తలైవర్ 173 రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ లెగసీని గ్రాండ్ సెలబ్రేట్ చేసుకోనుంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రం మాస్ అప్పీల్, ఎమోషన్, హై క్వాలిటీ మేకింగ్‌తో ప్రేక్షకులని అలరించబోతోంది. ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభమవుతుంది. త్వరలోనే తారాగణం, టెక్నికల్ టీం గురించి మరిన్ని వివరాలను రివిల్ చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు స్పెషల్ ట్రీట్‌గా తలైవర్ 173 సినిమాను 2027 పొంగల్ సందర్భంగా థియేటర్లలో విడుదల కానుంది.



## హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది

-శ్రీ నందు

'సైక్ సిద్ధార్థ' హౌస్ ఫుల్‌గా రన్ అవుతోందని హీరో శ్రీనందు అన్నారు. ఇటీవల విడుదల అయిన ఈ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నందు మాట్లాడుతూ.. ఈ సక్సెస్ కోసమే 18 ఏళ్లుగా ఎదురు చూశాను. ఒక బ్లాక్ బస్టర్ పోస్టర్‌తో మీ అందరి ముందు మాట్లాడాలని. నేను ఎన్నో సినిమాలు చేశాను కానీ అవి సురేష్ బాబు దగ్గరికి వెళ్లలేదు. ఈ సినిమా వెళ్లిందంటే కారణం డైరెక్టర్ వరుణ్ విజన్. ఈ సినిమా క్రెడిట్ అంతా వరుణ్ కే దక్కుతుంది. నాకు ఈ సినిమా ఇచ్చిన వరుణ్‌కి థాంక్యూ. ఈ సినిమా రైటింగ్ ఎడిటింగ్ స్క్రీన్ ప్లే సౌండ్ డిజైన్ అన్నీ కొత్తగా ఉంటాయి. ప్రతిదీ చాలా ఆలోచించి చేసింది. ఫస్ట్ 100 మందిలో 40 మందికి నచ్చుతుంది. సెకండ్ హాఫ్ 100 మందికి నచ్చుతుంది. 40 మంది కూడా ఈ సినిమాని ఈ సినిమా గురించి జీవితాంతం మాట్లాడుకుంటారు. సినిమా హౌస్ ఫుల్‌గా రన్ అవుతుంది. థియేటర్‌లో ఒక మాస్ సినిమాని ఎంజాయ్ చేస్తున్నట్టుగా చూస్తున్నారు. ఈ సినిమాని ఇంత గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తున్న ఆడియన్స్ అందరికీ థాంక్యూ సో మచ్. సెకండ్ హాఫ్ ముద్దపప్పు అవకాయ లాంటింది అందరికీ నచ్చుతుంది. సక్సెస్ అంటే డబ్బులతో పాటు అవకాశాలు రావడం. మాకు అలాంటి అవకాశాలు వస్తున్నాయి. ఇంత మంచి బ్లాక్ బస్టర్ ఇచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో హీరోయిన్ యామిని భాస్కర్, డైరెక్టర్ వరుణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వెంకట్ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.



జనవరి 12న విడుదల కానున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా హిట్ కావాలని మొక్కుతూ తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డైరెక్టర్ అనిల్ రవి పూడి, నిర్మాత సాహు గారపాటి, గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి

## సంక్రాంతి కొట్లాట సీనియర్ V/S జూనియర్



'సీనియర్స్ సీనియర్సే... ఈ సంక్రాంతికి అన్ని సినిమాలు హిట్ అవ్వాలి. మా సినిమా కూడా హిట్ అయితే హ్యాపీ' అని ఇటీవల రాజాసాబ్ ఈవెంట్‌లో ప్రభాస్ అన్న మాటలివి. ప్రతి సంక్రాంతికి తెలుగు సినిమాల మధ్య పోటీ ఉండటం సహజమే. కానీ ఈ సారి పోటీ కాస్త వెరైటీగా ఉంది. ఈ సారి సంక్రాంతి పోటీ సీనియర్ వర్సెస్ జూనియర్ మధ్య నెలకొంది.



ప్రభాస్ ఇప్పుడు పాన్ వరల్డ్ స్టార్ అవొచ్చు కానీ తెలుగు తెరపై చిరంజీవి కంటే చాలా జూనియర్. రవి తేజ సీనియరే కానీ రవి తేజతో పోల్చుకుంటే చాలా జూనియర్ అయిన శర్వానంద్ కూడా ఈ సంక్రాంతికి పోటీ పడుతున్నాడు. 2025 సంక్రాంతి సినిమాల్లో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేష్ హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా వెంకటేష్ కెరీర్ లోనే పెద్ద హిట్‌గా నిలబడింది. అదే కాన్ఫిడెన్స్ తో మళ్ళీ సంక్రాంతికి జనం ముందుకు అనిల్ రావిపూడి వస్తున్నాడు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకర్ వరప్రసాద్ గారు' పేరుతో నిర్మించిన ఈ సినిమాలో వెంకటేష్ కూడా కనిపిస్తారు. కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు చిరంజీవి, వెంకటేష్ లపై ఒక మాస్ పాటను కూడా చిత్రీకరించారు. ఈ సినిమాపై చిరంజీవి అభిమానుల్లోనూ, ట్రేడ్ వర్గాల్లోనూ భారీగా అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ ఏడాది సంక్రాంతి బరిలో వస్తున్న తొలి సినిమా రాజాసాబ్. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, రిద్ధికుమార్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హర్రర్ జోనర్ లో నిర్మించిన ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇప్పటి వరకు విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ కు మంచి స్పందన వస్తోంది. అయితే రాజాసాబ్ సినిమా దర్శకుడు మారుతి ఇప్పటి వరకు పెద్ద యాక్టర్ ను హ్యాండిల్ చెయ్యలేదు. మారుతీ కెరీర్ లో పెద్ద నటుణ్ని హ్యాండిల్ చెయ్యడం ఇదే ప్రథమం. అందుకే కాబోలు మారుతి ఎలా తీశాడో అనే అనుమానాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి గత ఏడాది భారీ ఫ్లాప్ లను చూసిన రవితేజ కూడా ఈ సంక్రాంతి బరిలో దిగుతున్నారు. భర్త మహాశయులకు విజ్ఞప్తి పేరుతో వస్తున్న సినిమా ఈనెల 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆషిక రంగనాథ్ డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకుడు. ఇది పూర్తిగా రవితేజ ఎంటర్‌టైన్‌మెంట్ మార్క్ సినిమాలా ఉంటుందని ఫిలిం నగర్ టాక్. ఇదే పోటీలో విడుదల అవుతున్న మరో చిత్రం నారి నారి నడుమ మురారి. శర్వానంద్ హీరోగా నటిస్తున్నారు. సామజవరగమన సినిమా దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. శర్వానంద్ సరసన సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా 14న విడుదల కానుంది. పైన పేర్కొన్న హీరోలందరి కంటే జూనియర్ హీరో అయిన నవీన్ పోలిశెట్టి నటించిన అనగనగ ఒకరాజు సినిమా కూడా సంక్రాంతి బరిలో దిగుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించిన ఈ సినిమాను కూడా 14నే ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఇది కూడా ఎంటర్టైన్మెంట్ ప్రధానంగా తెరకెక్కించిన సినిమా. ఈ ఏడాది సంక్రాంతికి మొత్తం అయిదు సినిమాలు విడుదల కానున్నాయి. మరి ఈ అయిదు సినిమాల్లో సంక్రాంతి విజేత హీరో ఎవరు అవుతారో వేచి చూద్దాం.








## 'జెట్లీ' యాక్షన్ గ్లింప్స్



కమెడియన్ సత్య, తాజాగా నటించిన సినిమా 'జెట్లీ'. రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మించిన ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. సత్య వాయిస్‌లో వేమన శతకంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అకస్మాత్తుగా అల్లకల్లోలం ప్రయాణికులను భయాందోళనకు గురికావడం, తుపాకీ కాల్పులు, హైజాక్ గురించి సూచిస్తూ, సత్య పరిచయం కావడం ఆకట్టుకుందిసత్యవెన్నెల కిషోర్ మధ్య వచ్చే డైలాగ్స్ గ్లింప్స్‌కు మరింత చార్మిన్ యాడ్ చేశాయి. నివ్వు ఏ హీరో అని అడిగినప్పుడు, జనరల్ కంపార్ట్మెంట్ అంటూ సత్య అన్సర్ ఇవ్వడం ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయ్యింది. ఈవెంట్‌లో సత్య మాట్లాడుతూ.. రితేష్, చెర్రీతో మళ్ళీ కలిసి వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మా మధ్య మంచి క్రియేటివ్ ఫ్రీడమ్ ఉంటుంది. ఇందులో స్పెషల్ హీరో అంటూ ఏమీ ఉండదు. యాక్షన్‌లో కూడా కామెడీని ఫీల్ అవుతారు. మత్తు వదలరా సక్సెస్ తర్వాత నాకు వచ్చిన అవకాశాలు పెరిగాయి. చెర్రితో సినిమా అనగానే నేను ఇంకేది ఆలోచించలేదు. నేను కథని డైరెక్టర్ నే ఫాలో అవుతాను. ఆ క్యారెక్టర్ తగ్గట్టు స్పాట్లో నాకు ఏదైనా అనిపిస్తే అది చెప్తాను. అయితే మొత్తం అంతా డైరెక్టర్ మీదే ఉంటుంది. ఈ సినిమా కోసం యాక్షన్ చేశాను. నాన్‌చాకు ఎలా వాడాలో నేర్చుకున్నాను అన్నారు.




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకు సమందించి ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తుపాకీని పట్టుకొని, శత్రువుల వైపు గురి పెట్టి నిల్చున్న ఈ పోస్టర్ అదిరిపోయింది. ఈ పోస్టర్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.

## 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' టీజర్ విడుదల



త్రిగుణ్, పాయల్ రాధా కృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో చేస్తున్న చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సిహెచ్‌వివిఎస్ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వరక్స్ బ్యానర్‌పై అరవింద్ మండెం నిర్మించారు. అరుణ్ చిలువేరు, ప్రకాష్ చెరుకూరి సంగీతం సమకూర్చారు. ఈ సినిమా టీజర్ గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో త్రిగుణ్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా చిన్న సినిమాలన్నీ అద్భుతంగా ఆడుతున్నాయి. అందరికి ఒక హోప్ వచ్చింది. సినిమాలు చూడడం థియేటర్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. తక్కువ టికెట్ ధరల్లో పెడితే ఆడియన్స్ అందరూ వచ్చి చూస్తారని భావిస్తున్నాను. మోడరన్ లైఫ్, పాత పద్ధతిలో ఉన్న వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చు అనేది ఈ సినిమాల్లో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించారు. చాలా ముఖ్యమైన విషయాలు ఇందులో చెప్పాం. మనమందరం కూడా వ్యవసాయం నుంచే వచ్చాము. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అన్ని తరాలు కూడా వ్యవసాయం నుంచే వచ్చాయి. వ్యవసాయం గురించి ఇంపార్టెంట్ విషయాలు మాట్లాడుతూనే సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మధుదీప్, పాయల్, అనీష్ కురివిల్లా, సత్య కృష్ణ, ప్రొడ్యూసర్ అరవింద్, పాల్గొన్నారు.

## వ్యవస్థ సృష్టించిన విపత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందో అనడానికి ఇది నిదర్శనమని సింగ్ పిటిఐతో అన్నారు. భగీరత్‌పురా ప్రాంతంలో ఈ సంక్షోభం ప్రారంభమైంది. స్థానిక ప్రభుత్వ అధికారులు తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌లో భారీ లీక్‌ను కనుగొన్నారు. ఒక పోలీస్ అవుట్‌పోస్ట్‌లోని నీటి పైప్‌లైన్‌పై మరుగుదొడ్డిని నిర్మించిన ప్రాంతంలో నీరు కలుషితమైనట్లు తేలింది. మరుగుదొడ్డి నుండి మురుగునీరు పొంగిపొర్లి నీటి పైప్‌లైన్‌లలోకి చేరడం వల్ల వాంతులు, విరేచనాలు వంటి తీవ్రమైన అనారోగ్యాలు ప్రబలాయని ప్రభుత్వ అధికారులు అంగీకరించారు. అధికారికంగా ఇప్పటివరకు మృతుల సంఖ్య ఆరుగా నిర్ధారించారు. అయితే, మృతుల సంఖ్య 10 నుండి 14మధ్య ఉండవచ్చని, మరో 200 మంది ఆసుపత్రిలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. 30 మందికి పైగా రోగులు ఇప్పటికీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో ఉన్నారు. 'ఇండోర్‌లోని కలుషిత తాగునీటి సంక్షోభం వ్యవస్థ సృష్టించిన విపత్తు. డబ్బు ఆదా చేయడానికి, కాంట్రాక్టర్లు తాగునీటి పైప్‌లైన్‌లను మురుగు కాలువల పక్కనే వేస్తున్నారు' అని సింగ్ ఆరోపించారు. అవినీతి మొత్తం వ్యవస్థను నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. ఇండోర్ విషాదం ఈ అవినీతి వ్యవస్థ యొక్క ప్రత్యక్ష ఫలితమేనని ఆయన అన్నారు. ఇండోర్‌లో ఏటా భూగర్భ జలమట్టాలు పడిపోవడం అత్యంత ఆందోళన కలిగించే విషయని, తాను 1992లో మొదటిసారి ఇండోర్‌ను సందర్శించానని, అప్పుడే ఈ నగరం నర్మదా నది నీటిపై ఎంతకాలం ఆధారపడుతుందని ప్రశ్నించానని సింగ్ అన్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నగరం నర్మదా నీటిపైనే ఆధారపడి ఉందంటే, ప్రభుత్వ వ్యవస్థలోని ప్రజలు ఒక బాధ్యతాయుతమైన నీటి నిర్వహణ యంత్రాంగాన్ని సృష్టించాలనుకోలేదని అర్థమవుతోందని ఆయన పేర్కొన్నారు. 80 కిలోమీటర్ల దూరం నుండి నర్మదా నీటిని ఇండోర్‌కు తీసుకువచ్చే ప్రాజెక్టులో అవినీతికి పెద్ద మొత్తంలో డబ్బు దుర్వినియోగం అవుతోందని ఆ జల సంరక్షకుడు ఆరోపించారు. ఇండోర్ తన నీటి అవసరాల కోసం నర్మదా నదిపై ఆధారపడుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ వేసిన పైప్‌లైన్ల ద్వారా, 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొరుగున ఉన్న ఖర్గోన్ జిల్లాలోని జలుడ్ నుండి నర్మదా నది నీటిని ఇండోర్‌కు తీసుకువచ్చి, ప్రత్యామ్నాయ రోజులలో ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం కేవలం విద్యుత్ బిల్లులకే ప్రతి నెలా మున్సిపల్ కార్పొరేషన్ ఖజానా నుండి సుమారు రూ.25 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మేయర్ పుష్పమిత్ర భార్గవ చేసిన ప్రకటనల ద్వారా కూడా ఈ ప్రాజెక్ట్‌లో ఉన్న భారీ వ్యయాన్ని అంచనా వేయవచ్చు.

## ట్రంప్ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

చంపేశారని ఆ తర్వాత అణు ఆయుధాల గురించి ఎందుకు వెల్లడించడం లేదని నారాయణ ప్రశ్నించారు. వెనుజులాపై దాడి భారత దేశానికి నష్టమని దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయిల్ ఎగుమతిని అడ్డంపెట్టుకుని భవిష్యత్తులో అమెరికా ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశాలపై విదేశీ శక్తులు దాడి చేసే హక్కు లేదన్నారు. బిజెపి, గాంధీ, నెహ్రూలను చరిత్ర నుండి చెరిపివేయాలని చూస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే కమ్యూనిస్టులు పోరాడి సాధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పు చేయడం వెనక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. గాంధీజీని భౌతికంగా చంపేసిన సంఘ్ పరివార్ అనుకూలురు ఇప్పుడు గాంధీ పేరు మార్చారన్నారు. 40 కుటుంబాల కోసం 28 లక్షల కోట్ల రూపాయల రాయితీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం 85 కోట్ల మందికి 10లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు జంకుతుందని ఆయన తెలిపారు. 40 శాతం రాష్ట్రాలు భరించడం సాధ్యం కాదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ఎత్తేశాయని తెలిపారు. జిఎస్టి రూపంలో దోపిడీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం మార్పును ఉపసంహరించుకోవాలన్నారు. మూసీనది కలుషితంపై వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిపిఐ ఆందోళన చేసిందని మూసీ ప్రక్షాళన ఇండ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. శాసన సభను బైకాట్ చేసిన వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను చర్చించకుండా వేతనాలు పొందటం ఎలా సాధ్యమవుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంచాయతీ తగదని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని చర్చించాలని కోరారు. పోలవరం, బనకచర్ల సాధ్యం కాదని చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిల గురుశిష్యుల కథ ముగిసిందన్నారు. తెలంగాణకు ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామాలను వదిలివేయాలని దీని వల్ల రెండు రాష్ట్రాలకు నష్టం లేదన్నారు. జనవరి 18న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా చారిత్రిక సభ జరుగుతుందని నారాయణ తెలిపారు. లక్షలాది మందితో జరిగే ఈ సభలో దేశ విదేశీ ప్రతినిధులు హాజరు కానున్నారని 15 రోజుల పాటు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సభలు, సమావేశాలు, సదస్సులు జరుగుతాయన్నారు. కమ్యూనిస్టులు పురోగమించక తప్పదని మతోన్మాద శక్తులను అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు,జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యత్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి కార్యవర్గ కూర్పుపై 8వ తేదీ నాటికి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలి

టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సంస్థగత పదవులపై దృష్టి సారించిన టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ ఈనెల 8వ తేదీ నాటికి డిసిసి కార్యవర్గ కూర్పుపై పూర్తి స్థాయి నివేదిక అధిష్టానానికి అందజేయాలని డిసిసి అధ్యక్షులకు సూచించారు. ఆదివారం డిసిసి, టిపిసిసి ఉపాధ్యక్షులతో మహేశ్ కుమార్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ మాట్లాడుతూ 8వ తేదీన గాంధీ భవన్‌లో టిపిసిసి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఉంటుందని, ఈసమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లతో పాటు టిపిసిసి కార్యవర్గం మొత్తం పాల్గొంటారని తెలిపారు. ఆ రోజు నాటికి డిసిసి కార్యవర్గ కూర్పుపై నివేదిక ఇవ్వాలన్నారు. అదేవిధంగా 15వ తేదీ లోగా మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా జాతీయ ఉపాధి పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం పట్ల దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలుచేపట్టాలని ఎఐసిసి పిలుపులో భాగంగా మన్రేగా కార్యక్రమాలు రాష్ట్రంలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.






## కదం తొక్కిన కమ్యూనిస్టులు

(మొదటి పేజీ తరువాయి)

పల్లా వెంకట రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నగరంలోని సర్కస్ గ్రౌండ్ నుండి భారీ ర్యాలీ రెవెన్యూ గార్డెన్ వరకు సాగింది. అనంతరం రెవెన్యూ గార్డెన్‌లో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26తో వందేళ్లు పూర్తి చేసుకుందని, ఈ దేశంలో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక రాజకీయ పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. దేశ సంపూర్ణ స్వాతంత్య్రం కోసం మొదట పిలుపునిచ్చిన పార్టీ సిపిఐ అని వెంకట రెడ్డి గుర్తు చేశారు. దేశంలోని అన్ని రంగాల్లోని ప్రజలను ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటంలో బాగస్వాములను చేసిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు స్వాతంత్ర్య పోరాటంలో బాగస్వాములైనారని, కానీ నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, ఆ పార్టీ నాయకులు అప్పుడు లేరన్నారు. స్వాతంత్ర్య పోరాట అనంతరం తెలంగాణాలో రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మొయినోద్దీన్ లాంటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు తెలంగాణ సాయిధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడి ఈ ప్రాంతంలోని గ్రామాలను వెట్టి నుంచి విముక్తి చేసి లక్షల ఎకరాలు పంచిన చరిత్ర సిపిఐకి ఉందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నుంచి గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రయోజనాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కమ్యూనిస్టుల సూచనతో ప్రవేశ పెట్టిన ఉపాధిహామీ పథకాన్ని ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఉపాధి చట్టంలో సవరణలు చేసి రాష్ట్రాలపై భారాన్ని మోపుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశా రు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర గొప్పదని అన్నారు. తెలంగాణ సాయిధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర 3500 గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర.. 4500 మంది ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర ఏ పార్టీకి లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాంటలో కరీంనగర్ కు ప్రత్యేక స్థానముందన్నారు. అనభేరి ప్రభాకర్ రావు లాంటి వాళ్లు పేదల పక్షాన కొట్లాడి తన ప్రాణాలను ఫణంగా పెట్టి అమరుడైనారని గుర్తు చేశారు. రాబోయే పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ సంఖ్యలో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ ప్రసంగించారు.



ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అందే స్వామి, పొన్నగంటి కేదారి, శంకర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోయడ సృజన్ కుమార్, బోయిన అశోక్ న్యాలపట్ల రాజు, నాగేల్లి లక్ష్మారెడ్డి, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, బోయిన తిరుపతి,పిట్టల సమ్మయ్య, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, బండ రాజిరెడ్డి, గోవిందుల రవి, కొట్ట అంజలి, ఉమ్మెత్తల రవీందర్ రెడ్డి, కళ్యాణ్, చొక్కల శ్రీశైలం,గజ్జఐలయ్య, మౌలానా, మచ్చ రమేష్, బ్రాహ్మణపల్లి యుగంధర్, రామారావు వెంకటేష్, సుజాత,లక్ష్మీ మమత, బిర్లా రమ, స్వాతి, పైడిపల్లి వెంకటేష్, బోయిని పటేల్, తదితరులు పాల్గొన్నారు.




డప్పు చప్పళ్లు, కోలాటాలు, నృత్యాలతో ప్రదర్శన

కరీంనగర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ఉత్సవాల సందర్భంగా పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రధాన కూడళ్లను ఎర్రజెండాలు, తోరణాలతో అలంకరించారు. సర్కస్ గ్రౌండ్ నుండి రెవెన్యూ గార్డెన్ వరకు వేలాది మంది పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలోమహిళలు కోలాటా నృత్యాలతో ముందు వరుసలో నిలువగా డప్పు కళకారులు ఆట పాటలతో అలరించారు. వందల మంది జన సేవాదళ్ వాలంటీర్స్ ఎర్ర జెండాలను చేతబూని ర్యాలీలో వరుస క్రమంలో నిలిచారు. వారిననుసరిస్తూ పార్టీ అగ్ర నాయకులు నినాదాలు చేస్తూ కదిలారు. దీంతో నగరమంతా ఎరుపు రంగును పులుముకున్నట్లుగా కయనిపించింది. కమ్యూనిస్టు పార్టీ నగరంలో చేపట్టిన ర్యాలీతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సహాన్ని నింపింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com